రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

భారత్ – ఆఫ్రికా భాగస్వామ్యం..
ఆ ప్రతిపాదన ఏదీ లేదు
ఇంధన, ఎరువుల భద్రతలో బిజెపి 'డబుల్ ఎఫ్ గ్రేడ్' సాధించింది 05

సంపుటి 09, సంచిక: 144 | శుక్రవారం | 24-04-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఆర్టీసీ సమ్మె తీవ్రరూపం



## పలుచోట్ల కార్మికులకు పోలీసుల బెదిరింపులు

- సమ్మె శిబిరాలకు టెంట్లు, ఇతర సామగ్రి అద్దెకు ఇవ్వొద్దని హుకుం
- రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు డ్రైవర్ల ఆత్మహత్యాయత్నం
- జెఎసి పిలుపుతో రెండోరోజు సమ్మె సక్సెస్
- డిపోలకే పరిమితమైన బస్సులు
- ప్రైవేట్ సిబ్బందితో బస్సులు నడిపేందుకు యత్నించిన ఆర్టీసీ అధికారులు
- అడ్డుకున్న కార్మికులు, పోలీసులతో వాగ్వాదం
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిన జెఎసి
- ప్రభుత్వం దిగివచ్చేవరకూ ఆందోళన శాంతియుతంగా నిర్వహిస్తామని ప్రకటన

### జెఎసి కార్యాచరణ

ఏప్రిల్ 24న అన్ని డిపోల ముందు మౌన ప్రదర్శనలు.
ఏప్రిల్ 25న అన్ని డిపోలలో వంటావార్పు.
ఏప్రిల్ 26న అన్ని రీజియన్‌లలో, జిల్లాలలో కార్మిక కవాతు
ఏప్రిల్ 27న తెలంగాణ ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి, ఎంపి, మంత్రులకు వినతిపత్రాలు సమర్పణ.
ఏప్రిల్ 28న మహిళ ఉద్యోగులతో అన్ని డిపోలలో బతుకమ్మలతో నిరసన ప్రదర్శనలు.
ఏప్రిల్ 29న అన్ని డిపోల ముందు అర్ధనగ్న ప్రదర్శనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సమ్మెకు ప్రత్యక్షంగానే కాకుండా, పరోక్షంగానూ మద్దతు ఇవ్వొద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని పోలీసు శాఖ బెదిరింపులకు పాల్పడుతున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండోరోజు విజయవంతంగా కొనసాగింది. ఆర్‌టిసి జెఎసి పిలుపుతో గురువారం కూడా బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. డిపోలు, యూనిట్ల వద్ద కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు సిబ్బందితో ఒకటి రెండు బస్సులను నడిపేందుకు ప్రయత్నించిన ఆర్‌టిసి అధికారులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. వరంగల్ జిల్లా నర్సంపేటలో, నల్లగొండ జిల్లా కేంద్రంలో, ఖమ్మంలో ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తీవ్ర మనస్థాపం చెందిన ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు ప్రభుత్వ అనుమతి లేదని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని, సమ్మె శిబిరాలకు టెంట్లు, ఇతర సామాన్లు అద్దెకిచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టెంట్‌హౌస్ షాప్ ఓనర్లు, ఫంక్షన్ హాల్ యజమానులు, కమ్యూనిటీ అండ్ కన్వెన్షన్ హాల్స్ అసోసియేషన్ సభ్యులకు వికారాబాద్ జిల్లా తాండూరు పోలీసులు జారీ చేసిన వింత ఉత్తర్వులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇది కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను తరువాయి 2లో

## ముగ్గురు డ్రైవర్ల ఆత్మహత్యాయత్నం



- నర్సంపేట డిపో వద్ద శంకర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా 80 శాతం పైగా కాలిన గాయాలు
- నల్లగొండ డిపో వద్ద వెంకన్న పెట్రోల్ పోసుకోగా ప్రమాదం నుంచి తప్పించిన తోటి కార్మికులు
- పురుగులమందు సేవించిన భద్రాచలం డిపో డ్రైవర్

ప్రజాపక్షం/ నర్సంపేట/వరంగల్ / నల్లగొండ/ఖమ్మం అర్బన్

ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తీవ్ర మనస్థాపం చెందిన ముగ్గురు డ్రైవర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో, నల్లగొండ జిల్లా కేంద్రంలో, ఖమ్మంలో ఈ ఘటనలు చోటుచేసుకోవడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గురువారం రెండోరోజూ ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్వహించగా, తరువాయి 2లో

## తొందరపాటు నిర్ణయాలు వద్దు

### నేడు జెఎసితో మంత్రుల బృందం చర్చలు
### సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

ఆర్‌టిసి కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సిఎం ప్రకటించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు శుక్రవారం ఆర్‌టిసి కార్మిక సంఘాలను పిలిచి మాట్లాడతారని చెప్పారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెపై గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించిన విషయాలను అనంతరం రవాణశాఖ మంత్రి మీడియాకు వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి సమస్యల తరువాయి 2లో

## నాన్చుడు ధోరణి వద్దు

- ఆలస్యం చేయకుండా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలి
- ఉద్యోగులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఆందోళనకరం
- సహనం కోల్పోవద్దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి
- ఆర్టీసీ యాజమాన్యం, పోలీసుల రెచ్చగొట్టే చర్యలు వద్దు

నర్సంపేట, నల్లగొండ ప్రాంతాలలో ఆర్‌టిసి ఉద్యోగులు ఆత్మాహుతి యత్నానికి పాల్పడడం తీవ్ర ఆందోళనకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులు సహనం కోల్పోవద్దని, తీవ్ర చర్యలకు పాల్పడవద్దని ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి సమ్మె విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం తాత్సారం చేస్తూ రెచ్చగొట్టే తరువాయి 2లో



కొత్తగూడెంలో సమ్మెచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న కూనంనేని

## కాళేశ్వరం లోపాలు, అక్రమాలపై దర్యాప్తు చేయండి



### మరోసారి సిబిఐని కోరాలని మంత్రివర్గం నిర్ణయం

- హైకోర్టు తీర్పును పరిశీలించిన తరువాత ఢిల్లీలో న్యాయనిపుణులతో సంప్రదింపులు
- వారి సలహాల ఆధారంగా సుప్రీంకోర్టుకు వెళ్లాలా? లేదా? అనే దానిపై నిర్ణయం
- రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల ఇబ్బందులపై కేబినేట్ ఆందోళన
- వందరోజుల్లోగా బకాయిల చెల్లింపునకు సుముఖత వ్యక్తం
- ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు (ప్యాక్స్) నామినేటెడ్ పద్ధతిన పాలకవర్గాల నియామకం

### ఆర్టీసీ జెఎసి చర్చలకు రావాలని ఆహ్వానం




ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సిబిఐ దర్యాప్తును వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున మరోసారి సిబిఐని కోరాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. కాళేశ్వరంపై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పును మొత్తం పరిశీలించిన తర్వాత ఢిల్లీలో ఉన్న న్యాయ నిపుణులతో సంప్రదించి, సుప్రీంకోర్టుకు వెళ్లాలా? లేదా? అనేది వారిచ్చే సలహాలు సూచనల ఆధారంగా వ్యవహరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఆర్‌టిసి సమ్మె విరమించాలని కార్మికులకు రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఆర్‌టిసి కార్మికులు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలియజేసింది. కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే సానుకూల వైఖరితోనే ప్రభుత్వం అధికారుల కమిటీ వేసిందని, శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి మీడియాకు వివరించారు. ''కాళేశ్వరంపై జస్టిస్ పిసి.ఘోష్ జ్యుడిషియల్ కమిషన్ నియామకాన్ని హైకోర్టు తప్పుబట్టలేదు. కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుబట్టలేదు. జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమని, రాజ్యాంగబద్ధమని కూడా అభిప్రాయపడింది. కేవలం పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే తరువాయి 12లో

## ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్




- రాష్ట్రంలో మరింత భీకరంగా ఎండలు
- వడగాలుల వీచే ప్రమాదం
- వాతావరణ శాఖ హెచ్చరికలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మరింత మండి పోనున్నాయి. ఎండలకు తోడు తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తర తెలంగాణకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు రాష్ట్రంలో పలు జిల్లాలలో 43 నుంచి 44డిగ్రీలకు, మరికొన్ని జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని, దీంతో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. అదేవిధంగా రాష్ట్రంలో పలు జిల్లాలలోఅక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షాలు కురువనున్నాయని, అయినప్పటికీ, పెద్దగా ఉపశమనం కలిగించే అవకాశంలేదని, కేవలం గాలిలో తేమ మాత్రమే పెరుగనుందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో సైతం తీవ్రమైన వడగాలుల ప్రభావం ఉండనుందని హెచ్చరికలు జారీ చేసింది.

**పలు జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత**

ఉత్తర తెలంగాణలో శుక్రవారం నుంచి 6 రోజుల పాటు తీవ్ర వడగాలుల ప్రభావం ఉండనుంది. పలు జిల్లాల్లో 43 డిగ్రీల నుంచి 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్, కొమురం భీమ్ అదిలాబాద్ , నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్, తరువాయి 12లో

# వెల్లువెత్తిన ఓటర్లు

### తమిళనాడు, బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదు
### తమిళనాడులో 85.05 శాతం, బెంగాల్‌లో 91.78 శాతం ఓటింగ్



**చెన్నై/కోల్‌కతా :** తమిళనాడు, పశ్చిమబెంగాల్ (తొలివిడత)లో గురువారం అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. తమిళనాడులో 85.05శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ (తొలి విడత ఎన్నికలు)లో 91.78శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పోలింగ్ సమయం ముగిసినప్పటికి కేంద్రాల్లో ఇంకా ఓటర్లు బారులుతీరడంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ శాతం పెరగనుంది. తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా జరగగా, బెంగాల్‌లో కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు, బెదిరింపులు చోటు చేసుకున్నాయి. దీంతో పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరింపుచేశారు. తమిళనాడులో 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. 5.73 కోట్ల మంది ఓటర్లలో 80 శాతానికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. భారత ఎన్నికల సంఘం (ఇసి) గణాంకాల ప్రకారం, సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలో 82.24 శాతం తరువాయి 2లో



వాహనాలపైకి దూసుకొచ్చిన ట్రక్కు
11 మంది సజీవ దహనం
ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాలో ఘటన
మృతులకు రాష్ట్రపతి, ప్రధాని, యుపి సిఎం సంతాపం 05

## ఇజ్రాయెల్ ప్రభుత్వానికి మోదీ సంఘీభావమా?

### భారతీయ సూత్రాలు, వైఖరులతో పాటు అన్ని మానవ విలువలకు ద్రోహం : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** గాజాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న 'మారణ హోమం', లెబనాన్‌పై భారీ బాంబు దాడులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తి మౌనం వహించడం ద్వారా నైతిక పిరికితనం ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఇజ్రాయెల్ పాలన పట్ల ఆయన ప్రభుత్వం చూపినంత సంఘీభావం మరే ప్రభుత్వమూ చూపలేదని పేర్కొంది. మోదీ ప్రభుత్వం సాంప్రదాయ భారతీయ సూత్రాలు, తరువాయి 12లో

## హోర్ముజ్‌లో ఇరాన్ సుంకాల వసూళ్ళు

- హిందూ మహాసముద్రంలో మరో నౌక అమెరికా స్వాధీనం
- మందుపాతరలుపెట్టే వాళ్ళను కాల్చి చంపాలని ట్రంప్ ఆదేశం
- నిరవధిక కాల్పుల విరమణ వార్తలకు వైట్‌హౌస్ ఖండన

**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధిని దాటివెళ్ళే నౌకల నుండి ఇరాన్ ప్రభుత్వం సుంకాలు వసూలు చేయడం ప్రారంభించగా, హిందూ మహాసముద్రంలో ఇరాన్ చమురు తీసుకువెళుతున్న ఎం.టి మెజెస్టిక్ నౌకను స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా రక్షణశాఖ ప్రకటించింది.హోర్ముజ్ జలసంధిలో మందుపాతరలు పెట్టే ఇరాన్ బోట్లపై కాల్పులు జరపాలని, అందులో ఉన్న నావికులను కూడా కాల్చి చంపాలని ట్రంప్ తన సైన్యానికి తాజా ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదిరేవరకూ కాల్పుల విరమణ కొనసాగుతుందని వైట్‌హౌస్ ప్రకటించింది. దీనికి ఒక తుది గడువును ట్రంప్ విధించలేదని చెబుతూ, ఈ కాల్పుల విరమణ నిరవధికంగా కొనసాగుతుందని తరువాయి 12లో



## ఇస్లామాబాద్‌లో రెండో విడత సమావేశంపై
# అమెరికా రాయబారితో పాక్ మంత్రి భేటీ

**ఇస్లామాబాద్ :** అమెరికా—ఇరాన్ మధ్య స్తంభించిన రెండోవిడత ముఖాముఖీ దౌత్యచర్చలను ముందుకు తీసుకువెళ్లేందుకు ఇస్లాబాద్‌లో ఉన్న అమెరికా రాయబారి నటాలీ బేకర్‌తో పాకిస్థాన్ దేశీయ వ్యవహారాల మంత్రి మొహిసిన్ నక్వీ గురువారం సమావేశం జరిపారు. స్తంభించిన చర్చలను ముందుకు తీసుకువెళ్ళే మార్గాలపై వారిద్దరూ చర్చించారు.

బహుశా ఈ వారాంతంలో శత్రుదేశాలను మరోసారి చర్చల బల్ల దగ్గరకు తీసుకురావాలన్న గట్టి కృతనిశ్చయంతో తగిన చర్యలను ఆలోచించడానికి ఈ సమావేశం జరిగింది. పశ్చిమాసియాలో ప్రాంతీయ పరిస్థితులపై వారిద్దరు వివరంగా చర్చించారని పాకిస్థాన్ దేశీయ వ్యవహారాలశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. యుద్ధ విరమణను పొడిగించాలన్న అమెరికా అభిలాష, నిర్ణయాన్ని నక్వీ స్వాగతిస్తూ, ఇరాన్‌వైపు నుండి కూడా సానుకూలమైన సమాధానం ఆశిస్తున్నామన్నారు. సులభంగా శాంతియుత పరిష్కారం సాధించడానికి అన్నిస్థాయిల్లోనూ పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, సర్వసైన్యాధిపతి ఆసిమ్ మునీర్ సర్వశక్తులూ ఒడ్డి కృషి చేస్తున్నారని బేకర్‌కు నక్వీ చెప్పారు. అమెరికాతో తీవ్రస్థాయి వైరుధ్యంతో మండిపడుతున్న ఇరాన్ నాయకులు మాత్రం పాకిస్థాన్ దౌత్య చర్యలను, శాంతి సాధనకు వారు చేస్తున్న కృషిని పదే పదే ప్రశంసిస్తున్నారు. ఇప్పటికి మూడుసార్లు ఇరాన్ నాయకుల నుండి పాకిస్థాన్ ప్రశంసలు అందుకుంది. మరోవైపు వారు హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించిన ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్ నాయకత్వం ఐక్యంగా ఒక నిర్ణయం తీసుకోవడానికి వీలుగా తగిన సమయం ఇవ్వాలని పాకిస్థాన్ చేసిన విజ్ఞప్తి మేరకు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ పొడిగించారు.

ఏప్రిల్ 22వ తేదీతో కాల్పుల విరమణ గడువు ముగిసిపోతున్న తరుణంలో నాటకీయ పరిణామాల మధ్య గడువు పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఐతే ఈ పొడిగింపు చర్యను ఇరాన్ స్వాగతించలేదు. పైగా తీవ్రంగా విమర్శించింది. పొడిగింపు చర్యవల్ల ఎలాంటి ప్రయోజనం లేదని హెచ్చరించింది. హోర్ముజ్‌లో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని తొలగించేవరకూ చర్చలకు తావు లేదని కూడా ఇరాన్ స్పష్టం చేసింది.

# రెండువేల ఏళ్ళు ఎదురుచూసినా చర్చలు జరగవ్!

### హైదరాబాద్‌లో ఇరాన్ కాన్సొలేట్ 'ఎఐ' వీడియో



**హైదరాబాద్ :** పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా—ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత గడచిన ఏడు వారాలుగా సోషల్ మీడియాకు లాఫింగ్ స్టాక్‌గా మారిపోయిన డోనాల్డ్ ట్రంప్ నెటిజన్లను తెగ ఎంటర్టైన్ చేస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్—నెతన్యాహూ కూర్చుని మాట్లాడుకుంటున్న సమయాల్లో పుతిన్—జీ జిన్‌పింగ్ కలిసి రావడం, కామెడీ సృష్టించడం,మోదీ,పుతిన్,జిన్‌పింగ్‌లకు అలీ ఖమేనీ డ్రమ్ములోంచి ముడి చమురు కొలిచి పోయడం, ట్రంప్ తెచ్చుకున్న డబ్బాలో చమురు పోసేందుకు నిరాకరించడం,ట్రంప్ నిక్కర్లతో పరుగులు తీయడం....ఇలా ఎన్నెన్నో లాఫింగ్ వీడియోలతో నెటిజన్లు తెగ ఎంజాయ్ చేస్తున్న సమయంలో తాజాగా హైదరాబాద్‌లో ఉన్న ఇరాన్ కాన్సొలేట్ జనరల్ కార్యాలయం కూడా కృత్రిమ మేథతో తయారు చేసిన ఒక వీడియోను విడుదల చేసింది.

"కాల్పుల విరమణను ఎలా పొడిగించారు? ఈ వీడియో ఇరాన్‌లో వైరల్ అవుతోంది" అనే శీర్షికతో 45 సెకన్లు నిడివి గల ఒక వీడియోను హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సొలేట్ కార్యాలయం తన అధికారిక ట్విట్టర్‌లో పోస్టింగ్ చేసింది. ఈ వీడియోలో ఒక పొడుగు టేడుగు రెండు వైపులా ఐదేసి కుర్చీలు వేసి ఉంటాయి. దానికి అమెరికా—ఇరాన్ జెండాలు అమర్చి ఉంటాయి. ఒకవైపు వరుసలో ట్రంప్‌తోపాటు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ కూర్చుని ఇరాన్ ప్రతినిధి బృందం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఖాళీగా కూర్చుని ఆయన తన కాలి బూటుతో నేలమీద శ బ్దం చేస్తూ ఉంటారు. ఇంతలోనే జేబులోంచి సెల్‌ఫోన్ తీసి సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడతారు. ఆ విధంగా అసహనంగా ఎదురుచూస్తూ ఉంటారు. ఇంతలో వీడియో స్క్రీన్ మీద "2000 సంవత్సరాల తర్వాత..." అని అక్షరాలు కనిపిస్తాయి. రెండు వేల సంవత్సరాల తర్వాత కూడా ట్రంప్ బృందం అలా చర్చల బల్ల వద్ద ఎదురుచూస్తూ చివరకు ఆయన అసహనంతో లేచి నిలబడి గట్టిగా అరుస్తారు.

అంతలోనే ఆయన సహాయకుడు ఒకరు"సార్ మీకు ఇరాన్ నుండి ఒక సందేశం వచ్చింది" అంటూ ఒక కాగితం తీసుకువచ్చి అందిస్తారు. ట్రంప్ ఆ కాగితం తెరచి చూడగానే "ట్రంప్ షటప్...!" అని ఇంగ్లీషులో రాసి ఉన్న అక్షరాలు కనిపిస్తాయి. దీంతో ట్రంప్ దిగ్భ్రాంతితో చర్చల బల్ల దగ్గర నుండి వెళ్ళిపోతారు.



### లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులకు ఖండన
# జర్నలిస్టు,శాంతి సైనికుడు సహా ఐదుగురు మృతి

**బీరూట్ :** ఇజ్రాయెల్—లెబనాన్ మధ్య ఒకవైపు వాషింగ్టన్ కేంద్రంగా చర్చలు జరుగుతుంటే లెబనాన్‌లో ఐ.డి.ఎఫ్ సేనలు దాడులతో ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో లెబనాన్ జర్నలిస్టు అమల్ ఖలీల్ మరణించారు. ఆయనతోపాటు దాడుల్లో మరో శాంతి సైనికుడు కూడా మరణించారు. మొత్తంగా ఐడిఎఫ్ దాడుల్లో ఐదుగురు మరణించారు. ఈ దాడులను ఇజ్రాయెల్ చేసిన యుద్ధనేరాలని లెబనాన్ ప్రధానమంత్రి నవాఫ్ సలామ్ విమర్శించారు. లెబనాన్‌లో ఇప్పటికే ఒక శాంతి సైనికుడు మరణించగా, తాజా దాడుల్లో యూనిఫిల్‌కు చెందిన మరో శాంతి సైనికుడు మరణించడంతో సర్వత్రా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అల్లకల్లోలంగా మారిన లెబనాన్‌కు తక్షణ ఆర్థిక సహాయం కావాలని నవాఫ్ సలామ్ కోరుతున్నారు. ఇజ్రాయెల్ దురాక్రమణ, దక్షిణ లెబనాన్‌లో గ్రామాలు,పట్టణాలను ఖాళీచేయించడంవల్ల లక్షలమంది ప్రజలు నిరాశ్రయులు కావడంవల్ల తమ దేశంలో మావనతా సంక్షోభం నెలకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్—లెబనాన్ మధ్య ఏప్రిల్ 16వ తేదీన ప్రారంభమైన పది రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 25వ తేదీ ఆదివారంనాటికి ముగుస్తుంది. దీనికి ముందే అమెరికా మధ్యవర్తిత్వంలో గురువారం చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రి మార్కో రుబియో, ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి మైక్ హక్కబీ, అమెరికాలో ఉన్న లెబనాన్ రాయబారి తదితరులు పాల్గొన్నారు.

**వాషింగ్టన్‌లో అరుదైన చర్చలు**

లెబనాన్—ఇజ్రాయెల్ మధ్య అమెరికా మధ్యవర్తిగా వాషింగ్టన్‌లో గురువారం అరుదైన రెండో విడత చర్చలు ప్రారంభమయ్యాయి. ట్రంప్ ఒప్పించి అమలులోకి తీసుకువచ్చిన పది రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని బహుశా ఈ చర్చల్లో నెలరోజులకు పొడిగించే అవకాశాలు ఉన్నాయని లెబనాన్ అధికారులు ముందురోజే ప్రకటించారు. లెబనాన్‌లో దాడులు ఆపి, ఇజ్రాయెల్ తన సైన్యాన్ని వెనక్కు తీసుకోవాలనే డిమాండ్లతోపాటు హెజ్బొల్లా సైనికులను పూర్తిగా నిరాయుధులను చేసే విషయంపై కూడా ప్రధానంగా ఈ సమావేశంలో చర్చలు జరుగుతాయి. అమెరికాలో లెబనాన్ రాయబారి నాడా హమాదే మోవాద్, అమెరికాలో ఇజ్రాయెలీ రాయబారి యెచీల్ లీటర్ పాల్గొన్న ఈ సమావేశానికి అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కూడా హాజరయ్యారు. ఈ సమావేశానికి ముందుగా ఇజ్రాయెలీ విదేశీమంత్రి గిడియోన్ సార్ లెబనాన్ విదేశీమంత్రితో మాట్లాడారు. తమ మధ్య తీవ్రమైన అసమ్మతులు ఏవీ లేవని, ఏవో కొన్ని చిన్న చిన్న సరిహద్దు సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించుకోవచ్చునని అన్నారు.

# అమెరికా నౌకాదళాధికారి ఫెలాన్ రాజీనామా

### కీలక సమయంలో మరో అధికారిపై వేటు



**వాషింగ్టన్ :** హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌తో అమీతుమీ తేల్చుకునే దశలో అమెరికా నావికాదళంలో అత్యున్నత అధికారి, నేవీ కార్యదర్శి జాన్ ఫెలాన్ ట్రంప్ పాలనాయంత్రాంగం నుండి వైదొలగారు. గత ఏడాది మార్చిలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన మిలిటరీలో పనిచేయలేదు.

నావికాదళ పాలనావిభాగం కార్యకలాపాలను ప్రధానంగా నిర్వహిస్తున్నారు. ఆయన నిష్క్రమణ తక్షణం అమలులోకి వస్తుందని పెంటగాన్ సైనిక వర్గాల ప్రతినిధి సీన్ పార్నెల్ గురువారం సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సేవలకు పార్నెల్ కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్ ప్రయత్నాల్లో ఆయన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం అండర్ సెక్రటరీగా పనిచేస్తున్న హాంగ్ కావో తాత్కాలికంగా జాన్ ఫెలాన్ బాధ్యతలు నిర్వహిస్తారు.ఇటీవలి నెలల్లో ట్రంప్ పరిపాలనా బాధ్యతల నుండి వైదొలగుతున్న నాయకులలో తాజాగా రాజీనామా చేసిన కార్యదర్శి ఫెలాన్. ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రాడీ జార్జ్‌ను పదవి నుండి వైదొలగాల్సిందిగా అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కోరిన తర్వాత ఆర్మీ అధికారులు జనరల్ డేవిడ్ హోడ్నే, మేజర్ జనరల్ విలియం గ్రీన్ కూడా ఇటీవల తమ పదవులకు రాజీనామాలు చేశారు.

తర్వాత కొద్దిరోజులకు ఇప్పుడు ఫెలాన్ కూడా నిష్క్రమించారు. ఇరాన్‌తో ఏడు వారాలుగా జరుగుతున్న యుద్ధంలో ఏడు వారాల తర్వాత పంతాలు పట్టింపులు రెండు వైపులా తీవ్రస్థాయిలో పెరిగిపోయిన తర్వాత ఏ క్షణంలో యుద్ధం తీవ్రరూపం దాలుస్తుందో తెలియని పరిస్థితుల్లో ఆయుధాలను సమకూర్చుకునే ప్రయత్నాలను అమెరికా—ఇరాన్ ముమ్మరం చేశాయి. అమెరికా నౌకాదళంలో నిర్మాణ కార్యకలాపాలకు సంబంధించి కొనసాగుతున్న అంతర్గత వైరుధ్యాల నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని భావిస్తున్నారు.

రక్షణమంత్రిగా హెగ్సెత్ పెంటగాన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత నేవల్ ఆపరేషన్స్ ప్రధానాధిపతి, గగనతల దళాల ఉప ప్రధానాధిపతి సహా డజనుకుపైగా సైనిక అధికారులను పదవుల నుండి తొలగించారు.

## ఆత్మహత్యాయత్నం
(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన బోలా శంకర్ అనే డ్రైవర్ పెట్రోల్ పోసుకోని నిప్పంటించుకున్నారు. ఈప్రమాదంలో శంకర్‌కు దాదాపు 80శాతం పైగా గాయాలయ్యాయి. శంకర్‌ను హుటాహుటిన నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజిఎంకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో శంకర్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు వరంగల్ ఎంజిఎం వైద్యులు డాక్టర్ అశ్విన్ తెలిపారు. బాధితుడు 80 శాతం వరకు కాలిపోయాడని, గొంతు నొప్పి కారణంగా మాట పడిపోయిందన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఎంజీఎంలో తగిన సదుపాయాలు లేకపోవడంతో, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించనున్నట్లు వెల్లడించారు. కాగా నర్సంపేట డిపోలో ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్ తదితరులు పరామర్శించారు. మరో ఘటనలో నల్లగొండ బస్టాండ్ వద్ద రావుల వెంకన్న అనే డ్రైవర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను గమనించిన పోలీసులు,తోటి కార్మికులు వెంటనే అప్రమత్తమై అతడిని అడ్డుకుని పెద్ద ప్రమాదాన్ని తప్పించారు.ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది.అస్వస్థతకు గురైన వెంకన్నను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.విషయం తెలిసి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు బస్‌స్టాండ్ డిపో వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఇంకో ఘటనలో భద్రాచలం డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. లింగారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం ఉదయం ఖమ్మం డిపో ఎదుట చేపట్టిన సమ్మెలో పాల్గొన్న లింగారెడ్డి మధ్యాహ్నం వరకు డిపో వద్ద ఉన్నారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల ఆయన స్వగృహంలో సాయంత్రం సమయంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లింగారెడ్డిని ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గడ్డి మందు తాగినట్లు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

## వెల్లువెత్తిన ఓటర్లు
(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ నమోదైంది. 2011 ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధికంగా 78.29 శాతం నమోదైంది. కాగా, ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) ప్రక్రియ ద్వారా, అక్టోబర్ 2025లో 6.41 కోట్లుగా నమోదైన ఓటర్ల సంఖ్య, ప్రస్తుతం 5.73 కోట్లకు తగ్గించబడింది. ఫలితంగా 2021 ఎన్నికల సమయంలో సుమారు 6.29 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు, ఇది ఈ సంవత్సరం నమోదైన సంఖ్య కంటే 56 లక్షలు ఎక్కువ. గురువారం నాడు, 88.02 శాతం పోలింగ్ నమోదు కాగా సేలం జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. చెన్నైలో 81.34 శాతం పోలింగ్ నమోదు కాగా, మదురైలో ఇది 77.89 శాతంగా, కోయంబత్తూరులో 82.33 శాతంగా, రాష్ట్ర మధ్యభాగంలో ఉన్న తిరుచిరాపల్లి జిల్లాలో 82.76 శాతంగా నమోదైంది. చెన్నైలోని కొలత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పోటీ చేస్తున్న చోట, సాయంత్రం 5గంటల వరకు 83.58 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడే ఉన్న చేపాక్—తిరువల్లికేణి నియోజకవర్గంలో 81.89 శాతం పోలింగ్ నమోదైంది. ఉప ముఖ్యమంత్రి, స్టాలిన్ కుమారుడైన ఉదయనిధి, ఈ నగర నియోజకవర్గం నుండి రెండవసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. సేలం జిల్లాలోని ఎడప్పాడి నియోజకవర్గంలో 89.09 శాతం పోలింగ్ నమోదైంది. ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి తన సంప్రదాయ నియోజకవర్గం నుండి పోటీ చేస్తుండగా, డిఎంకె నుండి ఆయనకు గట్టి పోటీ ఎదురవుతోంది. మరోవైపు, నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అభ్యర్థి నామినేషన్ పత్రాలు సాంకేతిక కారణాల వల్ల తిరస్కరించబడటంతో, ఆ పార్టీ ఒక స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ఇస్తోంది. 'తమిళగ వెట్రి కజగం' అధినేత విజయ్ పోటీ చేస్తున్న తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గంలో, సాయంత్రం 5 గంటల వరకు 79.32 శాతం పోలింగ్ నమోదైంది.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



టిఎంకె తరపున పోటీ చేస్తున్న సిఎం స్టాలిన్ చెన్నైలో అతడి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. టివికె చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ చెన్నైలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయ్ తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూరు రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే సినీ నటుడు, ఎంఎన్‌ఎం చీఫ్ కమల్ హాసన్, అతడి కూతురు శృతి హాసన్ సైతం చెన్నైలో ఓటు వేశారు. అలాగే చెన్నైలోని స్టెల్లా మేరీస్ స్కూల్‌లో సూపర్ స్టార్, తళైవ రజనీకాంత్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్నా డిఎంకె చీఫ్ పళనిస్వామి సాలెం ప్రాంతంలో ఓటు వేశారు.

**బెంగాల్‌లో 90 శాతం ఓటింగ్**

పశ్చిమ బెంగాల్‌లో గురువారం తొలి విడతగా 152 అసెంబ్లీ నిజయోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 3.60 కోట్ల మంది ఓటర్లలో సాయంత్రం 6 గంటల సమయానికి ఓటింగ్ 90 శాతం నమోదైంది. రాష్ట్ర ఇటీవలి ఎన్నికల చరిత్రలో ఓటింగ్ శాతం అత్యధిక స్థాయిలలో నమోదైన వాటిలో తాజది కూడా ఒకటిగా ఉంది. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలో 89.93 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అందులో దక్షిణ దినాజ్‌పూర్ జిల్లా 93.12 శాతం పోలింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నందున, పోలింగ్ శాతం 95 శాతాన్ని దాటవచ్చని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. అయితే పలు ఓటింగ్ సమయంలో పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా హింసఘటనలు, బెదిరింపులు, బిజెపి అభ్యర్థులపై దాడులు వంటి ఘటనలు జరిగాయి. 16 జిల్లాల్లోని 152 నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మొదటి రెండు గంటల్లో 18.76 శాతంగా ఉన్న ఓటింగ్ శాతం, ఉదయం 11 గంటల సమయానికి 41.11 శాతానికి, మధ్యాహ్నం 1 గంట సమయానికి 62.18 శాతానికి క్రమంగా పెరిగింది. మధ్యాహ్నానికల్లా ఇది 78 శాతం మార్కును దాటింది. పోలింగ్ చాలా వరకు ప్రశాంతంగా జరిగిందని అధికారులు వర్ణించినప్పటికీ, జిల్లాలవ్యాప్తంగా జరిగిన ఘర్షణలు, ఓటర్లను బెదిరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం వివరణాత్మక నివేదికలను కోరింది. దక్షిణ దినాజ్‌పూర్‌లోని కుమార్‌గంజ్‌లో, అల్లర్లు జరుగుతున్నాయనే సమాచారం అందడంతో పోలింగ్ బూత్‌కు వెళ్తున్న బిజెపి అభ్యర్థి సువేందు సర్కార్‌పై దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. పోలీసుల సమక్షంలో తనను కొట్టారని, తన వాహనాన్ని ధ్వంసం చేశారని సర్కార్ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను టిఎంసి ఖండించింది. ఆయన అశాంతిని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ముర్షిదాబాద్‌లోని నౌడాలో ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ (ఎజెయుపి), టిఎంసి మద్దతుదారుల మధ్య రాళ్ల దాడి, విధ్వంసం చోటుచేసుకోవడంతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో కేంద్ర బలగాలు లాఠీఛార్జ్‌కు దిగాయి. ఉదయం ఎజెయుపి అధినేత హుమాయున్ కబీర్ పోలింగ్ బూత్‌ను సందర్శించినప్పుడు నిరసనలు ఎదుర్కోవడంతో ఉద్రిక్తత పెరిగింది. బీర్‌భూమ్‌లోని లాభ్‌పూర్‌లో అభ్యర్థి దేబాశిస్ ఓఝాకు చెందిన బిజెపి పోలింగ్ ఏజెంట్‌పై దాడి జరగడంతో అతనికి తలకు గాయాలయ్యాయి. దీంతో ఉద్రిక్తత నెలకొంది. మాల్డాలోని చంచల్‌లో ఒక బిజెపి పోలింగ్ ఏజెంట్‌ను కొట్టి, అతని బట్టలు చింపేశారని ఆరోపణలు రావడంతో ఇలాంటి ఆరోపణలే వెలుగులోకి వచ్చాయి. మురారైలో కాంగ్రెస్, టిఎంసి కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం ఇద్దరు గాయపడగా, ముర్షిదాబాద్‌లోని డోమ్కల్‌లో ఉద్రిక్తత నెలకొంది. తమను పోలింగ్ బూత్‌లకు చేరుకోకుండా అడ్డుకున్నారని స్థానికులు ఆరోపించారు. అనంతరం ఓటర్లకు రక్షణగా ఈసీ భద్రతా సిబ్బందిని మోహరించింది. కూచ్ బెహార్‌లో, పోలింగ్ బూత్‌ల సమీపంలో టిఎంసి కార్యకర్తలు రోడ్లను దిగ్బంధించారని ఆరోపణలు రావడంతో, ఓటర్లకు ప్రవేశం కల్పించేందుకు కేంద్ర బలగాలు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టాయి. మధ్యాహ్నం వరకు ఎన్నికల సంఘానికి సుమారు 500 ఫిర్యాదులు అందగా, మరో 375 ఫిర్యాదులు సివిజిల్ యాప్ ద్వారా నమోదయ్యాయని అధికారులు తెలిపారు. వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా, ఓటర్లు ఉదయం నుంచే భారీ సంఖ్యలో బారులు తీరారు. 294 మంది సభ్యులున్న అసెంబ్లీలో 167 మంది మహిళలతో సహా 1,478 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యాన్ని నిర్ణయించనున్న మొదటి దశ ప్రాముఖ్యతను ఇది స్పష్టం చేస్తోంది.



## తీవ్రరూపం
(మొదటి పేజీ తరువాయి)

అణచివేయడమేనని, తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసులు ఇలా చేసి ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు విఫలమవడంతో ఉద్యోగులు బుధవారం నుంచి సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. గురువారం నుంచి మహాధర్నాకు పిలుపునిచ్చిన ఆర్‌టిసి జెఎసి, కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని తేల్చి చెప్పింది. సకల జనుల సమ్మె తరహాలో పోరుబాట పట్టాలని కార్మికులను కోరింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లు, వర్క్‌షాప్‌లలో శాంతియుతంగా ఉద్యమాలు చేయాలని జెఎసి పిలుపునిచ్చింది. తమ సమస్యలు తీరే వరకు వెనకడుగు వేయబోమని తేల్చి చెబుతున్నారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తమకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని టిజిఎస్ ఆర్‌టిసి కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొన్నారు. సరైన సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక నానావస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాలంటే అధిక ఛార్జీలతో దోపిడీ జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సంపేట డిపో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి: ఆర్‌టిసి జెఎసి

నర్సంపేట డిపో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆర్‌టిసి జెఎసి నాయకులు అన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మె డిమాండ్లు పరిష్కరించడంలో అనుసరిస్తున్న విధానాల పట్ల, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన 3 ప్రధాన డిమాండ్లను పక్కకు పెట్టి మిగిలిన 29 డిమాండ్లను పరిష్కరించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పిన అబద్ధపు మాటలకు కలత చెంది, మనోవేదనకు గురై, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగానే సమస్యలను పరిష్కరించడంలో మొండి వైఖరి అవలంభించడాన్ని తట్టుకోలేక క్షణికావేశంతో నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా 70 శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని నాయకులు తెలిపారు. ఈ దుర్ఘటన పట్ల జెఎసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 34 మంది ఆర్‌టిసి కార్మికులు ఆత్మబలిదానం చేసుకుంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమంది ఆర్‌టిసి కార్మికులు బలిదానాలు చేసుకుంటే దిగివస్తుందో చెప్పాలని జెఎసి నేత వెంకన్న ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇప్పటివరకు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తున్న ఆర్‌టిసి కార్మికవర్గంపై ఉక్కుపాదం మోపుతూ, డిపోల వద్ద వేసుకున్న టెంట్‌లను పోలీసులతో కూల్చివేయించి అక్కడి నుండి నిర్ధాక్షిణ్యంగా కార్మికులను తరిమికొడుతున్నారని, ఇదేనా ప్రజాపాలన అని ముఖ్యమంత్రిని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు సుద్దాల సురేష్, కత్తుల యాదయ్య, బి.యాదగిరి ప్రశ్నించారు. నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్‌కు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా, వెంటనే మెరుగైన వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆత్మహత్య సంఘటనకు ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వాలే బాధ్యత వహించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి స్పందించి సమ్మె డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింపచేయాలని కోరుతూ, అన్ని డిపోలలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించి కార్మికులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. కార్మికవర్గమంతా క్షణికావేశానికి గురికావద్దని, ఎలాంటి అఘాయిత్యాలు చేసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, ఐకమత్యంతో కార్మికులమంతా కొట్లాడి డిమాండ్లను సాధించుకోవడానికి జెఎసి కృతనిశ్చయంతో ఉందని, కార్మికులంతా జెఎసి పట్ల విశ్వాసంతో ఉండాలని వారు కోరారు.

## నాన్చుడు ధోరణి వద్దు
(మొదటి పేజీ తరువాయి)

ధోరణి కారణంగా ఇలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సాంబశివరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆర్‌టిసి కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులతో శుక్రవారం మంత్రులు నిర్వహించే చర్చలు, డిమాండ్ల పరిష్కారం, సమ్మెకు ఉపశమనం దిశగా ఉండాలే తప్ప, నాన్చుడు ధోరణిలో ఉండకూడదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికులు సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇవ్వడమే కాకుండా, అండదండగా నిలబడుతోందని, సమస్యల పరిష్కారానికి తమవంతు పాత్రను నిర్వహిస్తామని సాంబశివరావు స్పష్టం చేశారు.

**సమ్మెను అణివేయాలనుకోవడం అప్రజాస్వామికం**

గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి సమ్మె విచ్ఛిన్నానికి పూనుకోవడం అప్రజాస్వామకమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు, ప్రైవేటు డ్రైవర్‌ల ద్వారా బస్సులు నడిపించటం, బస్సులు, బస్సు డిపోలలో పోలీసులను మొహరించటం, సమ్మె చేస్తున్న కార్మికులకు టెంటు సామాన్లు కూడా ఇవ్వకుండా టెంటుషాప్‌ల యాజమానులను పోలీసులు బెదిరించడం, నోటీసులు ఇవ్వడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని యాజమాన్యం హెచ్చరించటం వంటి అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ పరిణామాలతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, తక్షణమే ఇలాంటి రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు సుదీర్ఘ కాలం ఎదురు చూసి, అనేక మార్గాలలో డిమాండ్‌ల పరిష్కారానికి ప్రయత్నించిన తరువాత చివరి ప్రయత్నంగానే సమ్మెకు దిగారని పేర్కొన్నారు. చర్చల ద్వారా సమ్మె త్వరగా పరిష్కరం కావాలని ఆశిస్తున్నామన్నారు. ఒక వేళ ఆలస్యమైనా శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఎండాకాలంలో కావడంతో కార్మికులకు ఇబ్బందులు పడకుండా టెంట్లు వేసుకునే వీలు కల్పించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## తొందరపాటు నిర్ణయాలు వద్దు
(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మికులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రుల ఆధ్వర్యంలో సబ్ కమిటీ వేసామని, కేబినెట్ స్థాయిలో చర్చ జరగడానికి కొంత ఆలస్యం అయిందన్నారు. శుక్రవారం జెఎసి నాయకులతో చర్చలు జరుపుతామని, ఉద్యోగులు సంయమనం పాటించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలను కోరారు. మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో ఆర్‌టిసి సమస్యలపై చర్చించామని, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్‌టిసి ఉద్యోగి




శంకర్‌గౌడ్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి కంచన్‌బాగ్ లోని అపోలో ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందిస్తామని తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు తమ కుటుంబ సభ్యులని, భావోద్వేగాలతో సమస్యలు పరిష్కారం కావన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు ఆత్మబలిదానాలు చేసుకొవద్దని, ఉద్యమంలో మనమందరం కొట్లాడి తెలంగాణ సాధించుకున్నామని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వంలో 58 రోజులు సమ్మె చేసి, 36 మంది మరణించినా వారు పట్టించుకోలేదన్నారు. ఆర్‌టిసికి ఇప్పటికే రూ.10వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందని, ఆర్‌టిసి కార్మికుడు శంకర్‌గౌడ్ త్వరగా కోలుకోవాలని కోరుతున్నామన్నారు.

## ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఆర్‌టిసి సమ్మె విరమింపజేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి సమ్మెపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. ఎన్నికలకు ముందు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ నేరవేర్చాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు. ఎపి పునర్ వ్యవస్థీకరణ అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేశారని, తెలంగాణ రాష్ట్రంలో విలీన ప్రక్రియకు ఏమి అడ్డు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. గత కెసిఆర్ ప్రభుత్వ కాలంలో సమ్మె చేస్తే కార్మికుల హక్కులను హరించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా సమ్మె చేస్తామని కార్మికులు అనేక సందర్భాలలో నోటీసులు ఇచ్చినా వారి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. 2025 మే నెలలో సమ్మె కు చేసేందుకు కార్మికులు సన్నద్ధం కాగా, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ మేరకు సమ్మె విరమించారని, సంవత్సరం పాటు కార్మికు లు వేచి చూశారని, ఇంకా వేసి చూడాలనడంతో కార్మికులు మానసిక వేదనకు గురవుతున్నారని చాడ వెంకట రెడ్డి తెలిపారు. ఆర్‌టిసి ఉద్యోగులైనా, కార్మికులైనా ప్రభుత్వంలో భాగమేనని సిఎం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. సమ్మె కాలంలో అనుభవం లేని డ్రైవర్లతో బస్సులను నడుపుతుండడంతో పలు చోట్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, ప్రభుత్వం పట్టింపులు పోకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని చాడ వెంకట రెడ్డి సిఎంకు విజ్ఞప్తి చేశారు.

**నాదెండ్ల భాస్కరరావు మృతి తెలుగు ప్రజలందరికీ బాధాకరం : చాడ**

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి తెలుగు ప్రజలందరికీ బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం నాదెండ్ల భాస్కర్‌రావు భౌతికకాయాన్ని చాడ వెంకటరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. భాస్కర్ రావు కుమారుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భాస్కరరావు నిబద్ధతతో పనిచేసేవారని ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి గుర్తు చేశారు. భాస్కర రావు స్ఫూర్తితో కుమారుడు మనోహర్ మంత్రిగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని ఆయన తెలిపారు.



# ధాన్యం సేకరణలో వేగం పెంచిన ప్రభుత్వం

**• ఇప్పటివరకు 4543 కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు • 47,623 మంది రైతుల నుంచి 4.26 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు • రైతుల ఖాతాల్లో రూ.102 కోట్లు జమ**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే వరి కోతలు ఊపందుకోవడంతో కోనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సీజన్‌లో మొత్తం 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ఇప్పటివరకు 4543 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మునుపెన్నడూ లేని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా 2025–26 రబీ సీజన్‌లో 54.48 లక్షల ఎకరాలలో వరి సాగు చేయగా, 152.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా ఈ రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో పౌర సరఫరాల శాఖ ద్వారా 90 లక్షల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిన నేపథ్యంలో మొత్తంగా ఈ రబీ సీజన్‌లో రైతుల నుంచి ప్రభుత్వం సేకరించనున్న 90 లక్షల మెట్రిక్ టన్నుల్లో 60 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించనున్నారు. రబీ వరికోతలు ఊపందుకోవడంతో అంతే వేగంగా ప్రభుత్వ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది.ఇప్పటివరకు 47,623 మంది రైతుల నుంచి రూ.102.42 కోట్ల విలువైన 4.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. ఇందులో అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి 2,04,010 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, నల్లగొండ జిల్లాలో 1,15,652 మెట్రిక్ టన్నులు, సూర్యపేట జిల్లాలో 51,207 మెట్రిక్ టన్నులు మొత్తం ఈ మూడు జిల్లాల నుంచి మొత్తం 3,70,869 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, మిగిలిన జిల్లాల నుంచి 49,131 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.102 కోట్లును ప్రభుత్వం జమ చేసింది. ఇందులో సన్నాలకు సంబంధించి క్వింటాల్‌కు రూ.500 ల చోప్పున బోనస్‌ను తర్వాత విడుదల చేయనుంది.

## 28న ముఖ్యమంత్రి ఇంటికి ఎఐఎస్‌ఎఫ్ పాదయాత్ర

- విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ప్రకటించారు. పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర కార్యక్రమం వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు వార్షిక ఫీజులు, పరీక్ష ఫీజులు చెల్లించి హాల్ టికెట్స్, సర్టిఫికెట్లు తీసుకోవాలని విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల కాకపోతే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకుని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత విద్యార్థులకు చెల్లించాలని పేద, మధ్య తరగతి విద్యార్థులకు వ్యతిరేకంగా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం అన్యాయమన్నారు. దీంతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని హైకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఆసరాగా ప్రవేశపెట్టిన ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని నిధులు ఇవ్వకుండా అదే కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందని, అందుకే ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి.అన్వర్, చైతన్య యాదవ్, అనిల్, నాయకులు నెల్లి సత్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లులో బిసి రిజర్వేషన్ల అంశాన్ని కూడా జోడించాలి

ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీకి టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో చేపడుతున్న మహిళ రిజర్వేషన్ల బిల్లు లో బిసి రిజర్వేషన్ల అంశాన్ని కూడా జోడించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి)అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేశారు. రానున్న ఎఐసిసి జాతీయ ఓబిసి సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని ఆయన కోరారు. ఇందుకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు టిపిసిసి తెలియజేసింది. ఢిల్లీలోని 10 జన్ పథ్‌లో గురువారం రాహుల్ గాంధీతో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాహుల్ గాంధీకి వివరించారు. తాజా రాజకీ య అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. రాష్ట్రంలో పార్టీ పరంగా జరుగుతున్న కార్యక్రమాలను రాహుల్‌గాంధీకి మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. డిసిసి అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీలు, బిఎల్‌ఎ నియామకాలు, అనుబంధ సంఘాల నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో రాహుల్ గాంధీకి మహేష్ కుమార్ గౌడ్ తెలియజేశారు. రాహుల్ గాంధీకి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రా ష్ట్రంలో కుల గణన జరిపి కుల గణన సమగ్ర అధికారిక సమాచారాన్ని ప్రకటించినట్టు రాహుల్ గాంధీకి చెప్పారు. అంతకు ముందు మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంత రావు, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కూడా రాహుల్ గాంధీతో సమావేశం అయ్యారు.

## కొత్త జీవిత బీమా, బ్యాంకింగ్ ప్యాకేజీ ప్రారంభించడం 'వన్ స్టాప్ సొల్యూషన్': కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం సరికొత్త జీవి త బీమా, బ్యాంకింగ్ ప్యాకేజీని అధికారికంగా ప్రారంభించడం ఉద్యోగుల పాలిట 'వన్ స్టాప్ సొల్యూషన్' అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా కేవలం బీమా మాత్రమే కాకుండా, బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలను ఒకే ప్యాకేజీ కిందకు తీసుకువచ్చారన్నారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల నుంచి మొదలుకొని మిలటరీ, పారామిలటరీ, కార్మికుల వరకు అందరికీ ఇది వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికులది కీలక పాత్ర

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోయ నగేష్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి కార్మికులు కీలక పాత్ర పోషించారని, ఉద్యమంలో పాల్గొన్న వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోయ నగేష్ స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఆర్‌టిసి పని ఖతం అని కెసిఆర్ అన్నారని గుర్తుచేస్తూ, ఆర్‌టిసిని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. యూనియన్లు అవసరం లేదని కెసిఆర్ భావించగా, యూనియన్లు ఉండాలని కాంగ్రెస్ నమ్ముతుందని తెలిపారు. ఆర్‌టిసిని మోయలేమని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారని చెప్పారు. కార్మికులు కుట్రదారుల ఉచ్చులో పడకూడదని హెచ్చరించిన బోయ నగేష్, మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని పేర్కొన్నారు. అదే విషయాన్ని బిఆర్‌ఎస్ తట్టుకోలేకపోతోందని విమర్శించారు. ఆర్‌టిసి అంశంలో గతంలో కెసిఆర్ అహంకారంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులు గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మధ్య తేడాను గమనించాలని సూచించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఆర్‌టిసి కార్మికుల రెండో రోజు సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు ఐటియుసి సంపూర్ణ మద్దతును ప్రకటించింది. గురువారం సమ్మెలో భాగంగా గురువారం మిధానీ డిపోలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలీం, బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర రెడ్డి, కౌన్సిల్ సభ్యులు షేక్ మహమూద్, ఇమ్రాన్ ఖాన్ పాల్గొని మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేస్తామని, వర్క్ షాపులు అభివృద్ధి చేస్తామని, అనేక హామీలను ఇచ్చి ఏ ఒక్కటి నేరవేర్చలేదని ఈ సందర్భంగా బాల్‌రాజ్, యాదగిరి విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లను నేరవేర్చి సమ్మెను విరమింపజేయాలని వారు డిమాండ్ చేశారు.

## పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నేషనల్ కో– ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ సదస్సు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జాతీయ పెన్షనర్ల సమన్వయ కమిటీ (ఎన్‌సిసిపిఎ) రాష్ట్ర స్థాయి సదస్సు డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం కమిటీ గౌరవాధ్యక్షులు ఎం.ఎన్.రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎన్‌సిసిపిఎ రాష్ట్ర అధ్యక్షులు సగరం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నామాల సోమయ్య, జాతీయ నాయకులు పాలకుర్తి కృష్ణమూర్తి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, సిఐటియు నేత ప్రసాద్, తాప్రా రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు నరహరి, వి.కృష్ణ మోహన్, బిఎస్‌ఎన్‌ఎల్ నాయకులు రామచంద్రుడు, కాన్ఫెడరేషన్ నాగేశ్వరరావు, రైల్వే నాయకులు అతర్ సింగ్, రాఘవరావు, పోస్టల్ యూనియన్ నాయకులు జలాలుద్దీన్, వివిధ పెన్షనర్ల నాయకులు ప్రసంగించారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ 1972 నుండి సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన అనేక తీర్పులను నిర్వీర్యం చేస్తూ, నష్టదాయకమైన పెన్షన్ ధృవీకరణ యాక్ట్‌ను రద్దు చేయాలని, 8వ కేంద్ర వేతన సంఘం (సిపిసి) మార్గదర్శకాలను సవరించాలని, బిఎస్‌ఎన్‌ఎల్, బ్యాంక్, కోల్, ఎల్‌ఐసి, జిఐసి పెన్షన్లను నవీకరించాలని, కనీస ఈపిఎస్ పెన్షన్ రూ.9000లకు పెంచాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పెన్షన్ కమ్యూటేషన్ విలువపై కోత కాలాన్ని పదేళ్ల 8 నెలలకు తగ్గించాలని వక్తలు డిమాండ్ చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా 65, 70, 75 ఏళ్లకు అదనపు పెన్షన్‌ను మంజూరు చేయాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్‌పిఎస్, యూపిఎస్‌ను రద్దు చేసి, నిర్వాచిత పెన్షన్ పథకం(ఒపిఎస్)తో పాటు సీనియర్ సిటిజన్ ప్ర యాణ రాయితీని పునరుద్ధరించాలనీ, పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాలని, వైద్య సౌకర్యాల ను మెరుగుపరచాలని కోరారు. 50 శాతం డిఎ, డిఆర్‌ను బేసిక్ పెన్షన్‌లో విలీనం చేయాలనీ, 18 నెలల పెండింగ్ డిఎ, డిఆర్‌లను విడుదల చేయాలని, కేంద్రం స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుండి కమల కుమారి, సుదర్శన్ రెడ్డి, బి.రామారావు, బ్రహ్మచారి, టి.నిరంజన్, ఎం.అర్జున్, స్వరాజ్ కుమార్, బి.నరహరి, బాల గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ కుటుంబం తమ బ్రాండ్ కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసింది

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ కుటుంబం తమ బ్రాండ్ కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని, కాళేశ్వరం పేరుతో కార్పొరేషన్ ఏర్పా టు చేసి భారీగా అప్పులు తెచ్చిందని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తీర్పు ఇచ్చినా నేపథ్యంలో దాన్ని క్లిన్ చిట్‌గా ప్రచారం చేస్తూ బిఆర్‌ఎస్ సంబరాలు చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి తెలంగాణ రైతులకు సంబంధం లేదని, కానీ రైతుల పేరుతో రాజకీయ లాభాలు పొందాలని బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయగా మాజీ సిఎం కెసిఆర్ పేర్కొన్నారని గుర్తుచేసిన ఆయన, అదే మేడిగడ్డలో నీళ్ల నింపవద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించడం గమనార్హమని చెప్పారు. రెండు పిల్లర్లు కూలినా పెద్ద సమస్య లేదన్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాళేశ్వరం వాస్తవాలను గ్రహించి బిఆర్‌ఎస్‌కు గట్టి గుణపాఠం చెప్పారని, అయినప్పటికీ కొందరు నేతలు సంబురాలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు కుంగిపోకపోవడం కాంగ్రెస్ పాలనలో నాణ్యతకు నిదర్శనమన్నారు. సిబిఐ విచారణను హైకోర్టు ఆపలేదని, కేంద్రంలోని బిజెపికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ నేతల అక్రమాలను ప్రభుత్వం వదిలిపెట్టదని, న్యాయ నిపుణులతో చర్చలు జరిపి అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# నాడు కమ్యూనిస్టులు భూములు పంచితే... నేడు పాలకులు గుంజుకుంటున్నారు

- రాంజీ చట్టం బోగస్
- ట్రేడ్ ఒప్పందాలు ప్రమాదకరం
- భూ సంస్కరణలు జరగాల్సిందే
- బిజెపిని ఐక్యంగా ఎదుర్కోవాలి
- అఖిల భారతకిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు అశోక్ దావెల్





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా తెలంగాణాలో, ప్రభుత్వాల ద్వారా కేరళ, బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో కమ్యూనిస్టులు పేదలకు లక్షలాది ఎకరాలను పంచితే నేటి పాలకులు రైతులనుంచి భూములు గుంజుకుంటున్నారని ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ దావెల్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నరేగా చటాన్ని రద్దు చేయడం దుర్మార్గం అన్నారు. దాని స్థానంలో తీసుకొచ్చి రామ్ బోగస్ అని విమర్శించారు. బిజెపి విధానాలు దేశానికి అత్యంత ప్రమాద కరంగా ఉన్నాయని, దానిని ఎదుర్కొనేందుకు ఐఖ్యంగాసంఘటనా పోరాటాలు చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సామినేని రామారావు నగర్‌లో గురువారం ప్రారంభమైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమినేని రామారావు, కాసాని ఐలయ్యకు నివాళ్లర్పించిన అనంతరం సభలో దావే మాట్లాడుతూ ఈ జిల్లా ఆదివాసీల ఇలాఖా అని, పోడు భూముల హక్కుల కోసం పోరాడిన నేలన్నారు. వేలాది మంది సింగరేణి కార్మికులకు అడ్డ అన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగుల సంఖ్య క్రమంగా పడిపోవడం బాధాకరం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల కారణంగా సంస్థమనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బొగ్గు గనులు వేలం వేసి సింగరేణి పాడుకుని దక్కించుకోవలని అనడం దుర్మార్గం అన్నారు. సింగరేణి సంస్థకు బొగ్గు గనులు కేటాయించాలని కోరారు. సంస్థకు బకాయి ఉన్న రూ.50వేల కోట్లను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధర బూటకం అని, ఈ రాష్ట్రంలో మొక్కజొన్న మద్దతు ధర రూ.750 ఇవ్వడం సరైంది కాదన్నారు. వరికి తెలంగాణాలో 2370 ఉండగా, పచ్చి వడ్లను క్వింటా రూ.1300 లకు మాత్రమే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రైతులందరికీ రుణ మాఫీ చేస్తే ఆత్మహత్యలు తగ్గ చవచ్చని తెలిపారు. వ్యవసాయాన్ని అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మూడు నల్ల చట్టాలని మోడి సర్కారు తేవాలని చూస్తే ఢిల్లీ రైతాంగం పోరాటం ద్వారా తిప్పికొట్టిన విషయాని గుర్తు చేశారు. భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశానికే ప్రమాదకరమని, విత్తనరంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్రం సీడ్ బిల్లును ముందుకు తెచ్చిందన్నారు. దగాకోరు విధానాలు అనుసరిస్తున్న పాలకులను వ్యతిరేకంగా అందర్నీ కలుపుకుని పోరాటాలుచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ మాట్లాడుతూ నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఎర్రజెండాలు బలమైన పోరాటాలు చేయాలన్నారు. మోడిఆర్థిక సంస్కరణల కారణంగా రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతోందని, తెలంగాణాలో నవంబర్ నెల్లో ఎఐకెఎస్ జాతీయ మహాసభలు ఉంటాయని ప్రకటించారు. ఈ సభలో మజీ ఎంపి తమ్మినేని వీరభద్రం, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, ఎఐకెఎస్ నాయకులు వెంకట్‌తో పాటు టి సాగర్, సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాద్, జంగారెడ్డి, మాజీ ఎంఎల్ఎ జూలుకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
**నాగోల్ సర్కిల్-11**

**NIT No.** E/5826/02/2026-27/40, తేది: 11.04.2026, **పని పేరు:** (1 పని) ''ఎంఎంసి, ఎల్‌బి నగర్ జోన్, నాగోల్ సర్కిల్-11 పరిధిలోని వివిధ ప్రాంతాలలో గల ఇందిరమ్మ క్యాంటీన్లకు తాగునీరు, చేతులు కడుక్కోవడానికి నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల కనెక్షన్లను సమకూర్చడం'', **అంచనా విలువ :** రూ.1.50 లక్షలు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 24.04.2026న మ.12.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా: శ్రీ ఎల్.నాగేందర్,** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నాగోల్ సర్కిల్-11, ఎంఎంసి. సెల్ నెం. 9989930401. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నాగోల్ సర్కిల్-11, ఎల్‌బిఎన్‌జెడ్, ఎంఎంసి.

DIPR R.O. No. : 1312-PP/CL/ADVT/2026-27, Date: 23-04-2026

**తెలంగాణ ప్రభుత్వం, అటవీ శాఖ.**

**ఇ-టెండర్ నోటీసు**

ఫైల్ నెంబరు. 747464/ఎస్6/2025, తేదీ, 22.04.2026 (1) పని నిమిత్తం. అనగా, సంగారెడ్డి రేంజ్, మరియు జిల్లా, చార్మినార్ సర్కిల్,హైదరాబాద్‌లోని మంజీరా వన్యప్రాణి కేంద్రం నిమిత్తం 40 హార్స్‌పవర్ 2 స్ట్రోక్ టిల్లర్ ఓబిఎం మరియు క్లాత్ కేనోపీతో 25 లైఫ్ జాకెట్లు సహా (వాటర్ టాక్సీ మోడల్) 24 సీట్లుగల బోటు సేకరణ. టెండర్ ఐడిః696030 ద్వారా ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌పై 2025-26లో సేకరించడంకోసం ఈ టెండరు ప్రచురించడమైనది. @www.tender.telangana.gov.in లో లాగిన్ చేయడం ద్వారా ఈ పని వివరాలను చూడగలరు.

| క్ర.సం. | పని పేరు | అంచనా విలువ (రూపాయలలో): |
|---|---|---|
| 1. | సంగారెడ్డి రేంజ్ మరియు జిల్లాలో మంజీరా వన్యప్రాణి కేంద్రం నిమిత్తం 40 హార్స్‌పవర్ 2 స్ట్రోక్ టిల్లర్ ఓబిఎం మరియు క్లాత్ కేనోపీతో 25 లైఫ్ జాకెట్లు సహా (వాటర్ టాక్సీ మోడల్) 24 సీట్లుగల బోటు సేకరణ. | రూ. 16,77,000/- |
| 2. | టెండరు డాక్యుమెంటును డౌన్‌లోడ్ చేసుకుని మరియు బిడ్ డాక్యుమెంటును సమర్పించవలసిన సమయం. | 24.04.2026 ఉదయం 10:30 నుండి 11.05.2026 సాయంత్రం 4:30 వరకు. |
| 3. | టెక్నికల్ బిడ్ తెరచే తేదీ. | 11.05.2026 సాయంత్రం 5:00 గంటలకు. |

**అధికారి చిరునామా :** జిల్లా అటవీశాఖాధికారి, మల్కాపూర్ క్రాస్‌రోడ్ సమీపం, సంగారెడ్డి, రాంచంద్రారెడ్డి కాలనీ, సంగారెడ్డి-502001 (సంప్రదింపు సంఖ్య: 8142412347).

సం/- జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి.

DIPR R.O. No. : 1286-PP/CL/ADVT/2026-27, Date: 23-04-2026



## పోషకాహారంతోనే క్షయ వ్యాధిని జయించొచ్చు

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 'మిత్ర' పథకం కింద టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నివారణకు మందులతో పాటు బలమైన ఆహారం ఎంతో అవసరమని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ కిట్లలో బియ్యం, పప్పులు, వేరుశనగలు, వంటనూనె మరియు చిరుధాన్యాలు ఉంటాయని, ఇవి రోగులలో రోగనిరోధక శక్తిని పెంచి 6 నెలల చికిత్స సమయంలో త్వరగా కోలుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి రోగి ప్రభుత్వం అందించే వైద్య సహాయాన్ని సద్వినియోగం చేసుకొని పూర్తి ఆరోగ్యవంతులుగా మారాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుల్లపల్లి వాణి భరత్ గౌడ్, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు వచ్చేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటిపై ఉందని, అర్హులైన జర్నలిస్టులు అందరికి అక్రిడిటేషన్ కార్డు త్వరలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే గురుతర బాధ్యత పత్రికలు, ఛానళ్లపై ఉందన్నారు. అలాంటి విధులు నిర్వహించే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డులు అర్హత ఉన్న వారికి అందాలన్నారు. ఆ విధంగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈనెల 24వ తేదీ శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేయని పాత్రికేయులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. నూతనంగా ఎంపికైన అక్రిడిటేషన్ కమిటి సభ్యులు చలసాని శ్రీనివాసరావు, వజ్జె వీరయ్య, షేక్ సైదా, కోల నాగేశ్వర రావు, ఎండి ఖలీల్ అహ్మద్, డాక్టర్ బంటు కృష్ణ, రెబ్బ విజయకుమార్, శంకరమంచి రవీందర్ శర్మ, బత్తుల మల్లికార్జున్, బుక్క ఉపేందర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సభ్యులు జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ దర్శనం మల్లేశం, జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అందుబాటులో ప్రజలకు మౌలిక వసతులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, మేయర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని 12,23 డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ బి శరత్ చంద్ర హిందూపూర్ వైకుంఠధామాన్ని సందర్శించారు. 23వ డివిజన్ లో రోడ్డు సమస్యపై వచ్చిన ఫిర్యాదుపై సంబంధిత ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి,ఇరు పక్షాల పత్రాలను సమగ్రంగా పరిశీలించి,సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. పజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాధి స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటరీ జవాన్లు క్రమం తప్పకుండా శుభ్రపరిచే పనులు నిర్వహించాలని శానిటరీ సూపర్వైజర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొహమ్మద్ మహబూబ్ అలీ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్,అసిస్టెంట్ ఇంజనీర్ దిలీప్,టౌన్ ప్లానింగ్,బిల్డింగ్ అధికారి అబ్దుల్ రెహ్మాన్, శానిటరీ సూపర్వైజర్ గడ్డం శ్రీనివాస్,శానిటరీ జవాన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రెండవ రోజు గురువారం సమ్మెలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాస్తమని ప్రభుత్వాలు కార్మికులకు హామి ఇచ్చి అమలు చేయకపోవడం సరికాదన్నారు. వేతన సవరణ చేయాలని, సమస్యలను జేఏసీ నాయకులతో కలిసి చర్చించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల సమితి సభ్యులు సాలె జగన్, బంటు రాజేశ్వరి, ఆంజనేయులు, సీహెచ్.రాములు, గువ్వల వెంకన్న, డబ్బికార్ మల్లేష్, డాక్టర్ రాజు, ఎండి.షోయబ్, ఐల వెంకన్న, అంజిబాబు, గోపాలకృష్ణ, మట్టయ్య, పోగుల సైదులుగౌడ్, తిరందాసు విష్ణు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## మే 05 నుండి జనగణన ప్రారంభం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా మొదటి దశ అయిన గృహ లెక్కింపు, గృహ పరిస్థితుల లెక్కింపు 2026, మే 05 నుండి 2026, జూన్ 6 వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన జనగణన అధికారి తేజస్ నందలాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునేందుకు స్వీయ లెక్కింపు సదుపాయం https://se.census.gov.in వెబ్‌పోర్టల్ ద్వారా 26.04.2026 నుండి 10.05.2026 వరకు అందుబాటులో ఉంచబడుతుందని వివరించారు. మొబైల్‌ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు పూర్తయిన తర్వాత ఒక యూనిక్ కోడ్ పొందుతారని, దీనిని ఇంటికి వచ్చే గణాంకాల అధికారి చూపిస్తే సరిపోతుందన్నారు. స్వీయ లెక్కింపులో పాల్గొనడం ద్వారా గణన ప్రక్రియను వేగవంతం చేయడంలో సహకరించిన వారవుతారన్నారు. జిల్లాలోని ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్‌టిసి కార్మికుల సమ్మె ఉధృతం..

### నల్లగొండ బస్‌స్టాండ్‌లో ఉద్రిక్తత, డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

### సూర్యాపేటలో పోలీసు పహారా మధ్య నడిచిన పలు బస్సు సర్వీసులు




**ప్రజాపక్షం/నల్లగొండ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. డిపో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ డిపోలో మహాధర్నా నిర్వహించగా,అదే సమయంలో బస్ స్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది.మహాధర్నాలో పాల్గొన్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం క్లాక్ టవర్ సెంటర్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి,ఆర్టీసీలో రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలు,ట్రేడ్ యూనియన్ హక్కులను అమలు చేయాలని కోరుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.జేఏసీతో వెంటనే చర్చలు జరిపి సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదే సమయంలో ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రావుల వెంకన్న అనే ఆర్టీసీ డ్రైవర్ బస్ స్టాండ్ డిపో వద్ద తీవ్ర నిరసనకు దిగాడు.డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను గమనించిన పోలీసులు,తోటి కార్మికులు వెంటనే అప్రమత్తమై అతడిని అడ్డుకుని పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. అస్వస్థతకు గురైన వెంకన్నను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనతో బస్ స్టాండ్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పెద్ద సంఖ్యలో కార్మికులు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు బి నరేందర్,యార చంద్రయ్య,బాసాని వెంకటయ్య,కేఎస్ రెడ్డి,జల్దా వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు టీజే రావు,ఎన్‌ఆర్‌సీ రాజు,మీలా ప్రభాకర్,కేఎల్ నాయక్,డిపో నాయకులు ఈఎస్ రెడ్డి, ఏఎల్ స్వామి, వీఎస్ రెడ్డి, బీఆర్ లింగం,ఎండీ అన్వర్,ఎండీ సాధిక్ పాషా,బి శివకుమార్,బి శంకరమ్మతో పాటు కార్మిక సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట** : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం రెండవ రోజు ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. తెల్లవారుజాము నుంచే పోలీసులు అద్దె బస్సులను నడిపించేందుకు డిపోల ముందు, బస్టాండ్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని పోలీసు పహారా మధ్య బస్సు సర్వీసులను నడిపించారు. కార్మికులు మాత్రం తమ సమ్మెను శాంతియుతంగా కొనసాగించారు. ఈ సందర్భంగా పలు ఆర్‌టిసి కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం వారు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల పరిరక్షణతోపాటు ఆర్‌టిసి సంస్థను పరిరక్షించుకునేందుకు తాము రాజీలేని పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. పలు సంఘాల నాయకులు ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశం

### ధాన్యం నాణ్యతను పరిశీలించి,తూకం ప్రక్రియలో జాప్యంపై ఆరా



**ప్రజాపక్షం/నకిరేకల్** : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించి రైతులు నిరీక్షణకు గురికాకుండా చూడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని నెల్లిబండ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ఆయన ధాన్యం నాణ్యతను పరిశీలించి,తూకం ప్రక్రియలో జాప్యంపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీల కొరత లేకుండా చూడాలని,లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రైతులు ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండకుండా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియను సమయపాలనతో నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రాల్లో కాంటాలు వేసిన వెంటనే లోడింగ్ చేసి, అనంతరం రైస్ మిల్లర్ల వద్ద వెంటనే అన్లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టి ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత,నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, నెల్లిబండ సర్పంచ్ ఆడెపు రాఘవులు, యనాల యాదగిరి రెడ్డి పాల్గొన్నారు.

# వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

### హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అకస్మిక తనిఖీ

### తనిఖీ సమయంలో అందుబాటులో లేని డాక్టర్లు

### డాక్టర్ల గైర్హాజరు పట్ల కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజూర్‌నగర్ (ప్రాంతీయ వైద్యశాల) ఏరియా ఆసుపత్రికి కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్ కేంద్రాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్ట్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరిండెంట్‌ను అదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తిగా నివేదికను అందించాలన్నారు. కాయకల్ప లో అవార్డు పొందాలని ఆకాంక్షించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజీ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం సిటిస్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టి హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు దోహదం



### నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి

**ప్రజాపక్షం/తిప్పర్తి :** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని,ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని ఖాజీ రామారం గ్రామంలో గ్రామస్థుల సహకారంతో రూ.1.30 లక్షలతో 10 సీసీ కెమెరాలు తిప్పర్తి ఎస్‌ఐ వి.శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా శివరాం రెడ్డి హాజరై గ్రామ సర్పంచ్ సల్వాది సైదులు,గ్రామ కార్యదర్శి రాజేశ్వరి,గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు,జీనేక్స్ సీడ్స్ కంపెనీ డైరెక్టర్ సుంకరి వెంకటేశ్వర్లు గౌడ్,ఉప సర్పంచ్ సుంకరి సుమలత మోహన్ రావు,గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా డిఎస్పి శివరామిరెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలందరినీ అభినందించారు.

**హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత: డిఎస్‌పి శివరాం రెడ్డి**

గామంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించే లాగా ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలను డిఎస్‌పి కోరగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు,జీనేక్స్ సీడ్స్ కంపెనీ డైరెక్టర్ సుంకరి వెంకటేశ్వర్లు గౌడ్ స్పందించి త్వరలోనే గ్రామ సర్పంచ్ గ్రామ ముఖ్య నాయకుల అందరితో కలిసి గ్రామంలో ప్రతి ఒక్కరికి హెల్మెట్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పోలీసు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు సుంకరి శ్రీనివాస్,పాలకూరి యాదయ్య,దండంపల్లి సైదులు పాల్గొన్నారు.

# బిసిల పట్ల కేంద్రానిది సవతి తల్లి ప్రేమ

### బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : జనగణనలో బిసి ప్రస్తావన చేయకుండా కేంద్ర ప్రభుత్వం బిసిల పట్ల సవతి తల్లి ప్రేమ కనపరుస్తుందని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బిసి సామాజిక వర్గానికి చెందిన ప్రధానమంత్రిని అని చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ నిజానికి బిసి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదన్నారు. తను మొదటిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు అతని కులం ఒసి సామాజిక వర్గానికి చెందినదని తను అధికారంలోకి వచ్చిన తరువాత తన అధికారాన్ని ఉపయోగించుకొని తన కులాన్ని బిసి సామాజిక వర్గానికి మార్పిడి చేసుకున్నారని ఆరోపించారు. అందువల్ల నరేంద్రమోడీకి బిసిల పట్ల ప్రేమ లేదని బిజెపి కూడా అగ్రవర్ణాల పార్టీగా ముద్ర పడిపోయిందన్నారు. అందువల్లనే జన గణనలో కులగణన చేయకుండా అడ్డుకుంటున్నారని అందుకనే తమ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నామని ప్రకటించారు. అందువల్లనే తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కాలంలో కేంద్రంలో రాష్ట్రాల్లో ఉన్న పార్టీలు బిసిలను మోసం చేసి 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కేవలం 21 శాతానికే పరిమితం చేసినా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో 56శాతం సీట్లను మున్సిపాలిటిలో 61శాతం బిసిలు గెలుపొందారని ఇది హర్షించదగ్గ పరిణామం అన్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జన గణనలో కులగణన అంశాన్ని చేర్చి జనాభా దామాషా ప్రకారం చట్టసభలోను విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లోనూ బడ్జెట్‌లోనూ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి ముఖ్య నాయకులు బూర వెంకటేశ్వర్లు, ఎండి గౌస్ పాషా, పెంద్ర కృష్ణ, ఐతరాజు లింగయ్య పాల్గొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అక్రమాలను సమర్ధించుకోవడం సిగ్గుచేటు

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచపల్లి** : కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసి గోష్ నివేదిక సరి అయినదేనని విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంలో బాధ్యులను చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం మండలంలోని పోచంపల్లి, రేవనపల్లి, శివారెడ్డి గూడెం,అలీనగర్,జూలూరు గ్రామాల్లో పిఎసిఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గత పది ఏళ్లలో బిఆర్‌ఎస్ పార్టీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి మాజీ మంత్రి హరీష్ రావు అండ్ కో హైకోర్టు ఆదేశాలపై తప్పుడు ప్రచారం చేస్తూ విషం కక్కుతున్నారని అన్నారు. అనంతరం శివారెడ్డి గూడెం గ్రామంలో ఉప్పునూతల వెంకటేష్‌మాధవి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శ్రీరేఖబాబురావు పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాల కోసం పీసీ ఘోష్ కమిషన్

### బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు వెళ్లి రాజకీయ లబ్ధి పొందిందని,ఇప్పుడు పీసీ ఘోష్ కమిషన్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,మాజీ మంత్రి హరీష్ రావుపై అభియోగాలు మోపుతోందని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్, ఆరోపించారు.గురువారం పట్టణంలోని బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, హైకోర్టులో కాంగ్రెస్ పార్టీ దురుద్దేశంతో కేసీఆర్,హరీష్ రావును బదనాం చేయడానికి ప్రయత్నించిందన్నారు.37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టును కూలిపోయిందంటూ ప్రజల్లో అపోహలు సృష్టించిందని విమర్శించారు. డిండి ఎత్తిపోతల పథకానికి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నేటినుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా ఉంటామని,అవసరమైతే కలెక్టరేట్ వద్ద ఆందోళనకు కూడా పిలుపునిస్తామని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,మాజీ జడ్‌పి చైర్మన్ బండ నరేందర్ రెడ్డి,నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి,బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు

### మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల



**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వేసిన ఘోష్ కమీషన్‌పై హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని మాజీ రాజ్యసభ సభ్యులు బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సెక్షన్ 80, 8బి ప్రకారం చట్టవిరుద్ధంగా కెసిఆర్, హరీష్ రావులపై నిందారోపణలు చేయడం తగదని హైకోర్టు తీర్పు చెప్పడం జరిగిందన్నారు. రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మాట్లాడిన మాటలు తప్పుడు మాటలని ఈ తీర్పుతో తేలిపోయిందన్నారు. పిసిసి రూపొందించిన ఈ ఘోష్ కమీషన్ కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా మారి లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పుట్ట కిషోర్, నెమ్మాది బిక్షం, జీడి బిక్షం, ఆకుల లవకుశ, బండారు రాజు, బొమ్మగాని శ్రీనివాస్, తూడి నరసింహారావు పాల్గొన్నారు.

## నేడు కొల్‌ముంతల్ పహాడ్‌కు మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ/కొండమల్లేపల్లి:** దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతల్ పహాడ్ గ్రామ సమీపంలోని రైతు వేదిక వద్ద నూతనంగా నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి దేవరకొండ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు అధికా సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ శ్రేణులకు సూచించారు.

# వాహనాలపైకి దూసుకొచ్చిన ట్రక్కు

- 11 మంది సజీవ దహనం
- ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాలో ఘటన
- మృతులకు రాష్ట్రపతి, ప్రధాని, యుపి సిఎం సంతాపం



**మీర్జాపూర్ :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మీర్జాపూర్ జిల్లాలో ఒక ట్రక్కుకు బ్రేకులు ఫెయిల్ కావడంతో అది పలు వాహనాల ఢీకొట్టింది. ఈ ఘటనలో పిల్లలతో సహా పదకొండు మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం రాత్రి సుమారు 8:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందని, వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో సహాయక చర్యలు ప్రారంభించారని మీర్జాపూర్ ఎస్‌పి అపర్ణ రజత్ కౌశిక్ తెలిపారు. అత్యంత విషాదకరమైన, హృదయవిదారకమైన ఘటనగా అభివర్ణించిన ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో, డ్రమాండ్‌గంజ్ లోయ నుండి లసోడా వైపుకు దిగే జాతీయ రహదారి 135 మార్గంలో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణ వివరాల ప్రకారం లోయ కిందకు ప్రయాణిస్తున్న ఒక ట్రక్కు బ్రేకులు విఫలమవడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అనుమానిస్తున్నారు. మధ్యప్రదేశ్ నుండి వస్తున్న ఆ ట్రక్కులో శనగలు నిండుగా ఉన్నాయని, ఒక నిటారు వాలుపై అదుపు తప్పి, ముందు వెళ్తున్న ఒక బొలెరో కారును, మరొక ట్రక్కును ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో బొలెరో కారుతో సహా రెండు కార్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. మంటల తీవ్రత ఎత్తున ఉండడంతో వాటిని అదుపులోకి తీసుకురావడానికి రెండు గంటల కంటే ఎక్కువ సమయం పట్టిందని అధికారులు పేర్కొన్నారు. పోలీసులు, స్థానికులతో కలిసి నుజ్జునుజ్జు అయిన వాహనాల్లో చిక్కుకున్న బాధితులను బయటకు తీశారని, ఇప్పటివరకు, 11 మంది మరణించినట్లు నిర్ధారణ అయినట్లు ఎస్‌పి తెలిపారు. బొలెరో కారులో ప్రయాణిస్తున్న తొమ్మిదిమంది—వారిలో నలుగురు పిల్లలు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారని అధికారులు తెలిపారు. వీరంతా మధ్యప్రదేశ్‌లోని మైహర్ ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తున్నారు. మరొక కారు డ్రైవరు, ట్రక్కు డ్రైవరు కూడా మరణించారని, ట్రక్కు డ్రైవరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడని వారు తెలిపారు. మరణించిన వారిలో ఏడుగురు మీర్జాపూర్ జిల్లాకు చెందినవారని, ముగ్గురు మధ్యప్రదేశ్‌కు చెందినవారని, మరొకరు పొరుగున ఉన్న సోన్‌భద్ర జిల్లాకు చెందినవారని జిల్లా మేజిస్ట్రేట్ పవన్ గంగ్వార్ పిటిఐకి తెలిపారు. మీర్జాపూర్ జిల్లాలోని జిగ్నా ప్రాంతానికి చెందిన మృతుల్లో శివ సింగ్ (8), సోనమ్ సింగ్ (9), పియూష్ సింగ్ (14), పంకజ్ సింగ్ (40), వందన సింగ్ (43), విష్ణు సింగ్ (45), వీణ సింగ్ (47) ఉన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో మధ్యప్రదేశ్‌లోని సత్నాకు చెందిన కార్తికేయ సింగ్ (18), ప్రియాంక సింగ్ (42), మధ్యప్రదేశ్‌లోని సాగర్‌కు చెందిన వికాస్ శర్మ (32), సోన్‌భద్రకు చెందిన జై ప్రకాష్ (27) ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రత కారణంగా మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని, దీనివల్ల మృతులను గుర్తించే ప్రక్రియ క్లిష్టంగా మారిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో బిహార్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన ఒక ట్రక్కు, మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగిన మరొక వాహనం ఉన్నాయి. కార్లలో ఒకటి సోన్‌భద్ర జిల్లాకు చెందినది కాగా, మరొకటి మీర్జాపూర్‌కు చెందినది. 'మీర్జాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమైన, హృదయవిదారకమైన సంఘటన అని సిఎం ఆదిత్యనాథ్ గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మీ, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మృతులకు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షలకు, గాయపడిన వారికి రూ. 50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

# భారత్—ఆఫ్రికా భాగస్వామ్యం..

- అల్లకల్లోల ప్రపంచంలో 'స్థిరత్వం', 'విశ్వసనీయత'కు ఒక సందేశం
- విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఉద్ఘాటన




**న్యూఢిల్లీ :** ప్రపంచం సంక్లిష్టమైన భౌగోళిక, రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో భారత్—ఆఫ్రికా భాగస్వామ్యం విశేష ప్రాముఖ్యతను సంతరించుకుందని,అస్థిరమైన, అల్లకల్లోల ప్రపంచంలో ఈ భాగస్వామ్యం 'స్థిరత్వం', 'విశ్వసనీయత'కు ఒక సందేశాన్ని ఇస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్..జైశంకర్ ఉద్ఘాటించారు. త్వరలో జరుగబోయే ఇండియా—ఆఫ్రికా ఫోరం శిఖరాగ్ర సమావేశం— IV కోసం లోగో, థీమ్, వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమంలో గురువారం ఆయన సభను ఉద్దేశించి జైశంకర్ మాట్లాడుతూ ఇండియా—ఆఫ్రికా కలిసి కేవలం అభివృద్ధి భాగస్వాములు మాత్రమే కాదని, 'ఒక మెరుగైన ప్రపంచాన్ని తీర్చిదిద్దడంలో కూడా భాగస్వాములు' అని నొక్కి చెప్పారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో పశ్చిమాసియాలో 50రోజులకు పైగా కొనసాగుతూ ప్రపంచవ్యాప్త పరిణామాలకు దారితీస్తున్న అనేక సంఘర్షణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే సదస్సు సంబంధిత లోగోలో, భారతదేశం—ఆఫ్రికా ఖండాలు ఒకదానినొకటి పెనవేసుకున్న పటాలను చిత్రీకరించిన ఒక చిత్రంపై ఒక సింహం ఉంటుంది. 'శాశ్వత భాగస్వామ్యం, ఉమ్మడి దార్శనికత' ఇతివృత్తంగా ఉన్న ఈ శిఖరాగ్ర సమావేశం మే 28 నుంచి 31వరకు జరగబోతున్నది. రాబోయే శిఖరాగ్ర సమావేశం మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తుందని మంత్రి జైశంకర్ తెలిపారు. ఈ శిఖరాగ్ర సమావేశం భాగస్వామ్యం తదుపరి దశకు రూపకల్పన చేయడానికి ఒక వేదికను అందిస్తుందని, ఆ వేదిక మరింత ఆశయ పూర్వకంగా, మరింత సమ్మిళితంగా, మరింత భవిష్యత్ ఆధారితంగా ఉంటుంది అన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఇదిఅల్లకల్లోల ప్రపంచంలో స్థిరత్వానికి, అనిశ్చిత ప్రపంచంలో విశ్వసనీయతకు, క్లిష్ట సమయాలలో సంఘీభావానికి సందేశంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. వివిధ ఆఫ్రికన్ దేశాల నుంచి పలువురు రాయబారులు, దౌత్యవేత్తలు హాజరైన ఈ కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగిస్తూ ఇటీవలి సంవత్సరాలలో ఆఫ్రికా ఖండం అంతటా 17 కొత్త దౌత్య కార్యాలయాలను ప్రారంభించడం ద్వారా భారతదేశం ఆఫ్రికాలో తన దౌత్య కార్యకలాపాలను విస్తరించిందని దీంతో భారత రాయబార కార్యాలయాల సంఖ్య పెరిగిందని జైశంకర్ నొక్కిచెప్పారు. నేటి విదేశాంగ విధానంలో ఆఫ్రికాకు 'కేంద్ర స్థానం' ఉందని, సమానత్వం, పరస్పర గౌరవం, ఉమ్మడి పురోగతి అనే సూత్రాలపై ఆధారపడి స్పష్టమైన దార్శనికతతో న్యూఢిల్లీ ఆఫ్రికాతో సంబంధాలు కొనసాగిస్తోందని వివరించారు. భారత్ ఆఫ్రికా ఫోరం సమ్మిట్ ఫ్రేమ్ వర్క్ ద్వారా భారత్—ఆఫ్రికాల మధ్య శాశ్వత భాగస్వామ్యంలో తదుపరి అధ్యాయానికి నాంది పలకడానికి మనం ఇక్కడ సమావేశమయ్యామని జైశంకర్ పేర్కొన్నారు. సాంస్కృతిక మార్పిడులు, మానవ పరస్పర చర్యల ద్వారా శతాబ్దాలుగా పెంపొందించబడిన 'మన నాగరికత సంబంధాల'లోనే భారత్—ఆఫ్రికా సంబంధాలు పాతుకుపోయాయన్నారు. వలసవాదానికి వ్యతిరేకంగా ఆఫ్రికా దేశా లు చేస్తున్న పోరాటానికి భారతదేశం సంఘీభావం తెలపడంతో మన బంధాలు మరిత బలపడటం సంతోషదాయకమన్నారు. భారత స్వాతం త్ర్య పోరాట గాథ ఆఫ్రికాతో కూడా సన్నిహితంగా ముడిపడి ఉందని మంత్రి వివరించారు. సుస్థిర వృద్ధి, సమ్మిళిత అభివృద్ధి ద్వారా శ్రేయ స్సు, పురోగతిని సాధించే దిశగా వికసిత్ భారత్—2047, ఆఫ్రికా అజెండా—2063 అనేవి ఒకదానికి మరొకటి పూరకమైన రోడ్‌మ్యాప్‌లని జైశంకర్ నొక్కిచెప్పారు. ప్రపంచ పాలనలో ఆఫ్రికాకు దక్కాల్సిన సముచిత స్థానానికి భారతదేశం నిరంత మద్దతు ఇస్తుండటంతో అనేక ఉన్నత స్థాయి రాజకీయ సంప్రదింపుల ద్వారా భారతదేశం—ఆఫ్రికాల మధ్య సంబంధాలు కీలక రంగాలలో బలపడ్డాయన్నారు. 2023లో జి—20కి భారతదేశం అధ్యక్షత వహించిన సమయంలో ఆఫ్రికన్ యూనియన్‌ను అందులో చేర్చడమే ఆ దిశగా ఒక కీలకమైన ముందడుగు అని మంత్రి జైశంకర్ వివరించారు.

## తెరుచుకున్న బద్రీనాథ్




**డెహ్రాడూన్ :** ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ హిమాలయ ప్రాంతంలో ఉన్న బద్రీనాథ్ ఆలయ ద్వారాలు ఆరు నెలల శీతాకాల విరామం తర్వాత గురువారం తిరిగి తెరుచుకున్నాయి. పునఃప్రారంభం తర్వాత జరిగిన మొదటి పూజను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు మీద నిర్వహించారు. చమోలీ జిల్లాలో ఉన్న ఈ ఆలయ ద్వారాలను వేద సంప్రదాయాలు, ప్రార్థనల అనంతరం ఉదయం 6.15 గంటలకు తెరిచారు. దేశ, విదేశాల నుంచి సుమారు 15,000 మంది యాత్రికులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, భారతీయ జనతా పార్టీ (బిజెపి) రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర భట్ ప్రారంభోత్సవానికి హాజరై, పరిపాలనా ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు యాత్రికులతో ముచ్చటించారు. సురక్షితమైన, సజావైన చార్‌ధామ్ యాత్రను నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని ధామి తెలిపారు. పచ్చని, పరిశుభ్రమైన యాత్రను కొనసాగించడంలో సహకరించాలని ఆయన యాత్రికులను కోరారు. ముఖ్యమంత్రి ఒక సామూహిక వంటశాలను కూడా ప్రారంభించారు. నార్, నారాయణ పర్వతాల మధ్య నెలకొని ఉన్న ఈ ఆలయాన్ని టన్నుల కొద్దీ పూలతో అలంకరించారు. మానా, బామ్ని గ్రామాలకు చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయ 'ఝుమైలో' నృత్యం ప్రదర్శిస్తుండగా, డప్పుల శబ్దాలు, సైనిక బృందాల సంగీతం 'జై బద్రీ విశాల్' నినాదాలు ప్రతిధ్వనించాయి. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు భక్తి గీతాలు ఆలపించారు. మిగిలిన మూడు హిమాలయ పుణ్యక్షేత్రాలైన గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ద్వారాలు ఇప్పటికే యాత్రికుల కోసం తెరుచుకున్నాయి.

# ఆ ప్రతిపాదన ఏదీ లేదు

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై స్పష్టతనిచ్చిన కేంద్రం



**న్యూఢిల్లీ :** పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని వస్తున్న వార్తలపై కేంద్రం స్పష్టతనిచ్చింది. ప్రభుత్వం వద్ద అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆ వార్తలన్నీ అవాస్తవమని, ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని ఉద్ఘాటించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్ట్ చేసింది. ఇలాంటి వార్తా కథనాలు పౌరుల్లో భయాందోళనలు సృష్టించేందుకు ఉద్దేశించినవని, దురుద్దేశపూరితమైనవిగా మంత్రిత్వ శాఖ అభివర్ణించింది. గత 4 ఏళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్ అని స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా ధరలు పెరుగుతున్నా భారత పౌరులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దేశంలో కూడా ఇంధన ధరలు పెరగొచ్చన్న ఊహాగానాలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ముఖ్యంగా బంగాల్ వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ధరలు పెరుగుతాయని కోటక్ ఇన్‌స్ట్యూషనల్ ఈక్విటీస్ పేర్కొంది. ఏప్రిల్ 29న పోలింగ్ అనంతరం ఈ పెంపు ఉండొచ్చని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా ఈ వివరణ ఇచ్చింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేశాయి. ప్రతిగా ఇరాన్ కూడా దాడులను తీవ్రతరం చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఈ ప్రతీకార చర్యల్లో ప్రపంచంలోని ఇంధన రవాణా మార్గాల్లో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ప్రపంచంలో ఐదోవంతు రవాణా ఈ జలసంధి నుంచే జరుగుతోంది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశన్నంటాయి. ఫలితంగా, పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు 70 డాలర్లుగా ఉన్న బ్యారెల్ చమురు ధర ప్రస్తుతం 100 డాలర్ల పైనే ట్రేడవుతోంది. అయితే, ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినా, భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

**భగ్గుమన్న బ్రెంట్ క్రూడ్ ధరలు**

ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు ఆరు శాతం పెరిగి 95.89 డాలర్లకు చేరింది. ఫ్యూచర్స్‌లో యుఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 7 శాతానికి పైగా పెరిగి, 90.13 డాలర్లుగా ఉంది. కాగా, ఇటీవల ఇరాన్‌కు చెందిన తౌస్కా అనే వాణిజ్య నౌకపై అమెరికా దళాలు కాల్పులు జరిపి, స్వాధీనం చేసుకున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో జరిగిన ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సోషల్ కూడా మీడియాలో ధ్రువీకరించారు. అయితే, ఈ విషయంపై ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఐఆర్‌జిసి దళం అమెరికా యుద్ధ నౌకల పైకి డ్రోన్లను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ వెల్లడించింది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను ఒక్కసారిగా పెంచాయి. ఇదిలా ఉండగా, అం తర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో పెట్రోలు బంకుల్లో ఒక్కో ట్రక్కుకు ఇంత డీజిల్ మాత్రమే నింపుతామని, అనధికారిక పరిమితులు ఉంటున్నాయని ట్రక్కుల యజమానుల సంఘాలు చెబుతున్నాయి. దీంతో తరచు పెట్రోలు బంకుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని, పైగా క్యూలైన్లు పెద్దగా ఉంటుండటంతో, సరకు రవాణాలో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సరఫరాలు తక్కువగా ఉండటమే ఈ పరిస్థితికి కారణమని చెబుతున్నాయి. నెలవారీ డీజిల్ కొనుగోళ్లపై ఇచ్చే డిస్కౌంట్లను కూడా పెట్రోలు బంకులు ప్రస్తుతం ఆపేశాయని వెల్లడించారు.

## ఇండో—పసిఫిక్‌లో సవాళ్లను ఎదుర్కొనేందుకు సమన్వయం అవశ్యం

- నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి



**శ్రీ విజయ పురం :** ఇండో—పసిఫిక్‌లో తలెత్తుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి సైన్యం, నౌకా దళం, వైమానిక దళం, కోస్ట్‌గార్డ్ మధ్య సమన్వయం, పరస్పర సహకారం ప్రాముఖ్యతను నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి నొక్కిచెప్పారు. రెండు రోజుల సందర్శనలో భాగంగా ఆయన అండమాన్, నికోబార్ కమాండ్ (ఎఎన్‌సి)లో పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించడంతోపాటు సేవల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, సహకారాన్ని పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏప్రిల్ 21, 22 తేదీలలో జరిగిన పర్యటన సందర్భంగా అడ్మిరల్ త్రిపాఠి అధికారులతో కూలంకషంగా సమావేశం అయ్యారని, కొనసాగుతున్న కార్యచరణ కలాపాలు, కార్యక్రమాలపై ఆయనకు వివరించారని అధికారులు గురువారం తెలిపారు. కార్యాచరణ సమన్వయాన్ని బలోపేతం చేయడం, సంసిద్ధతను మెరుగుపర్చడం, సేవల మధ్య ఏకీకరణను మరింతగా పెంపొందించడంపై చర్యలు కేంద్రీకరించబడ్డాయని త్రిపాఠి చెప్పారు. అండమాన్, నికోబార్ ద్వీపాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యంగా కీలకమైన సముద్ర కమ్యునికేషన్ మార్గాలకు సమీపంలో ఉన్నందున, ఈ ప్రాంతంలో సముద్ర భద్రతను నిర్ధారించడంలో, నిఘాను మెరుగుపర్చడంలో, వేగవంతమైన ప్రతిస్పందన సామర్థ్యాన్ని కొనసాగించడంలో ఎఎన్‌సి కీలక పాత్రను అడ్మిరల్ త్రిపాఠి పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కూడా సంభాషించారు. దేశ సముద్ర సరిహద్దులను పరిరక్షించడంలో వారి వృత్తి నైపుణ్యం, అంకితభావం, ఉన్నత స్థాయి కార్యాచరణ సంసిద్ధతను నౌకాదళాధిపతి త్రిపాఠి ప్రశంసించారు. దీనికి ముందు జనవరి నెలలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అండమాన్, నికోబార్ దీవులను సందర్శించి భారత వైమానిక దళానికి చెందిన కార్ నికోబార్ వైమానిక స్థావరంలో ఆధునీకరించిన రన్‌వేను ప్రారంభించారు.

# ఇంధన, ఎరువుల భద్రతలో బిజెపి 'డబుల్ ఎఫ్ గ్రేడ్' సాధించింది

- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు



**న్యూఢిల్లీ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. దేశ ప్రజలకు ఇంధన, ఎరువుల భద్రతను కల్పించడంలో మోదీ సర్కార్ విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన నాటకాల ద్వారా ఈ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రయత్నించిందని విమర్శించారు. భారతదేశ ఇంధన ఉత్పత్తి తగ్గిపోయిందని, దిగుమతుల వైవిధ్యీకరణ విఫలమైందని దుయ్యబట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కూడా ఖర్గే విమర్శలు గుప్పించారు. మనం ఇకపై 'విశ్వగురువు' అనే పదాన్ని ఉపయోగించకూడదు అని ఇటీవల పేర్కొన్న తన సొంత మార్గదర్శక్ మండల్ సభ్యుడు మురళీ మనోహర్ జోషి మాటలను ఆయన పాటించాలని ఖర్గే సూచించారు. గురువారం జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ, సంస్కృతాన్ని భారతదేశ అధికార భాషగా చేయాలని జోషి గట్టిగా వాదించారు. గతంలో బి.ఆర్.అంబేద్కర్ సహా ఎందరో దీని కోసం ప్రయత్నించారని, కానీ ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభించలేదని ఆయన అన్నారు. అదే విధంగా 'మోదీ ప్రభుత్వం డీలిమిటేషన్ నాటకాల ద్వారా తన వైఫల్యాలను, తీవ్రమైన ఎప్‌స్టీన్ ఫైల్ ఆరోపణలను పక్కకు మళ్లించడానికి ప్రయత్నించింది, కానీ భారత్ ఆ నాటకాన్ని గ్రహించింది. దేశానికి ఇంధనం, ఎరువుల భద్రతను కల్పించడంలో బిజెపి డబుల్'ఎఫ్' (ఫెయిల్) సాధించింది' అని ఖర్గే ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేశారు. ఇంధనం గురించి మాట్లాడుతూ ఉత్పత్తి తగ్గిందని, దిగుమతుల వైవిధ్యీకరణ విఫలమవుతోందని, హోర్ముజ్ జలసంధిలో మన నౌకలు సురక్షిత మార్గాన్ని పొందలేకపోతున్నాయన్నారు. 'గత 54 రోజులుగా 14 భారత జెండా ఉన్న నౌకలు అక్కడ చిక్కుకుపోయాయి. 2025—26లో వరుసగా 11వ ఏడాది కూడా భారతదేశ ముడిచమురు ఉత్పత్తి పడిపోతూనే ఉంది, ఇదంతా మోదీ ప్రభుత్వమే. 2014—15 నుంచి మొత్తం ముడిచమురు ఉత్పత్తి దాదాపు 22% పడిపోయింది' అని ఆయన అన్నారు. 2011—12లో 47,555 ఎంఎంఎస్‌సిఎంగా ఉన్న గ్యాస్ ఉత్పత్తి, 2020—21 నాటికి కేవలం 28,672 ఎంఎంఎస్‌సిఎంకు పడిపోయి, సుమారు 40% మేర మరింత దిగ్భ్రాంతికరమైన క్షీణతను చవిచూసిందని ఖర్గే అన్నారు. 'ఇప్పుడు, మోదీ ప్రభుత్వం కొత్త ఎల్పీజీ కనెక్షన్‌ను నిలిపివేసింది. పొడవైన క్యూలలో నిలబడటం, గ్రామీణ భారత ప్రజలు ఒక సిలిండర్ బుక్ చేసుకోవడానికి 45 రోజుల పాటు వేచి ఉండటం, బ్లాక్ మార్కెటింగ్ వంటి వాటి వల్ల 'సబ్ చంగా సీ' (అంతా బాగుంది) అనే నిరాకరణలతో ప్రజలే తీవ్ర ఇబ్బందులు పడ్డారు! అని ఖర్గే మండిపడ్డారు. ఎరువుల గురించి ఖర్గే మాట్లాడుతూ, భౌగోళిక రాజకీయ అవకతవకలకు ముందే, పలు సీజన్లలో ఎరువుల కొరత నమోదవుతోందని అన్నారు. బిజెపి ఉదాసీనత పర్యవసానాలను భారత రైతులు తీవ్రంగా అనుభవిస్తున్నారన్నారు. ఎరువుల ఉత్పత్తి గతేడాదితో పోలిస్తే ఏకంగా 24.6% మేర తగ్గి, మార్చి 2026 నాటికి గత 5 ఏళ్లలో కనిష్ట స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చైనా ఇప్పటికే జూలై 2025 నుంచే ప్రత్యేక ఎరువులపై ఆంక్షలు విధించింది, కానీ మోదీ ప్రభుత్వం దిగుమతులను వైవిధ్యపరచడానికి కూడా పట్టించుకోలేదని, రష్యా కూడా ఇప్పుడు ఎరువుల ఎగుమతులను నిలిపివేసిందన్నారు.

# మే 4న టిఎంసి పాలనకు తెర

- బెంగాల్‌లో తొలి విడత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతమే ఇందుకు నిదర్శనం : మోదీ

**మథురాపూర్ :** పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్ రాజ్‌కు మే 4వ తేదీతో (ఓట్ల లెక్కింపు జరిగే రోజు) 'గడువు ముగుస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మథురాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దక్షిణ 24 పరగణాల జిల్లా, కాక్‌ద్వీప్ స్టేడియంలో గురువారం జరిగిన ఒక సభనుద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో భారీగా నమోదైన పోలింగ్ శాతం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. టిఎంసి సాగించిన భయానక పాలన, బిజెపి వాగ్దానం చేసిన నమ్మకం ముందు ఖచ్చితంగా ఓడిపోతోందని పోలింగ్ సరళి సూచిస్తోందని ఆయన అన్నారు. బెంగాల్‌లో లంచాలు ఇవ్వకుండా ఏ పనీ జరగని రంగం ఒక్కటి కూడా లేదని, అక్కడ టిఎంసి సిండికేట్లు, వారి దళారులు 'కట్ మనీ' (కమీషన్లు) తీసుకోకుండా ఉండరని ఆరోపించారు. 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థకు, టిఎంసి సాగించిన 'మహా జంగిల్ రాజ్‌కు గడువు తేదీ వచ్చేసిందని, అదే మే 4వ తేదీ అని మోదీ అన్నారు. తప్పుడు వాగ్దానాలు చేయడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నందుకు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని బాధ్యురాలిని చేస్తూ, రాష్ట్ర అధికార పార్టీ ఇచ్చిన వాగ్దానాలలో నెరవేర్చని వాగ్దానాల జాబితాపై ప్రధానమంత్రి ఏకరువు పెట్టారు. 'గంగాసాగర్ మేళా జరిగే సాగర్ ద్వీపాన్ని ప్రధాన భూభాగంతో అనుసంధానించే వంతెన నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదని, ప్రజలు ఇప్పటికీ పడవలు (ఫెర్రీలు)పైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. వరదలను నియంత్రించే ఉద్దేశంతో రూపొందించిన 'ఘటల్ మాస్టర్ ప్లాన్' అసలు ముందుకు సాగలేదని, జిల్లా స్థాయి ఆహార పార్కులు, నదీ తీరాల కోతను అరికట్టే ప్రాజెక్టులు కూడా ఇంకా కార్యరూపం దాల్చలేదని మోదీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల అమలును అడ్డుకోవడమే కాకుండా, అభివృద్ధి పనుల కోసం కేంద్రం కేటాయించిన నిధులను కూడా తృణమూల్ కాంగ్రెస్ మింగేస్తోందని ప్రధానమంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో బిజెపి ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చినప్పుడే ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుందన్నారు. 2029లో లోక్‌సభలో శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తన ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు, టిఎంసి, కాంగ్రెస్‌తో చేతులు కలిపిందని మోదీ ఆరోపించారు. దేశ స్థానిక వనరులను దోచుకుంటూ, దేశ భద్రతకు ముప్పు కలిగిస్తున్న చొరబాటుదారుల పట్ల 'సహన రహిత విధానాన్ని' అనుసరించాలని బిజెపి నిర్ణయించిందన్నారు. ఈ ప్రాంతంలో వారు సముద్ర మార్గాల ద్వారా కూడా దేశంలోకి చొరబడుతున్నారని, అంతేకాక ఇక్కడ స్థిరపడేందుకు టిఎంసి అండదండలు పొందుతున్నారని మోదీ ఆరోపించారు.

## మేధావుల అభిప్రాయాలను గౌరవిస్తాం

- వాట్సప్ యూనివర్సిటీ సమాచారం తీసుకోం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష కేసులో సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మేధావులు, న్యాయకోవిదులు ప్రముఖుల అభిప్రాయాలను గౌరవిస్తామని, అంతే కానీ వాట్సప్ యూనివర్సిటీ ప్రచారాన్ని మాత్రం అంగీకరించలేమని వెల్లడించింది. గురువారం మరోసారి విచారణ చేపట్టిన సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. జ్ఞానంతో కూడిన వివరణ ఎక్కడి నుంచి వచ్చినా దానిని స్వాగతించాలి అని సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ ఒక కథనాన్ని చూపిస్తూ సుప్రీంకోర్టులో వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం 'మేం ఆ అభిప్రాయాలను గౌరవిస్తాం కానీ అవన్నీ వ్యక్తిగతమైనవాటిగానే పరిగణిస్తాం. ఇవన్నీ న్యాయపరమైన నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపవు' అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా స్పందించిన జస్టిస్ బివి నాగరత్న వాట్సప్ యూనివర్సిటీ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రం అంగీకరించలేమని చమత్కరించారు.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు




**న్యూఢిల్లీ :** ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు షాకిచ్చింది. కోర్టు ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అంటే కోర్టు నియమాల ఉల్లంఘనే అంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. జస్టిస్ వి కామేశ్వర్ రావు, జస్టిస్ మన్‌మీత్ అరోరా ఆధ్వర్యంలోని బెంచ్ ఈ కేసును విచారిస్తూ, గురువారం నోటీసులు జారీ చేశారు. అంతేకాదు.. దీనికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా సహా అన్నిరకాల ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్ వంటి సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన అన్ని వీడియోలను తొలగించాలని ఆదేశించింది. ఇది ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించిన అంశం విచారణ సందర్భంగా జరిగింది. ఈ కేసుకు సంబంధించి జడ్జిని మార్చాలని కోరుతూ కోర్టులో కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా కేజ్రీవాల్ స్వయంగా విచారణకు హాజరై, నేరుగా జస్టిస్ స్వర్ణకాంత శర్మతో తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా చిత్రీకరించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇలా వీడియోలు వ్యాప్తి చెందడం కోర్టులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించడమే అని కోర్టు అభిప్రాయపడింది. ఈ వీడియోలను పోస్ట్ చేసిన జర్నలిస్ట్ రవిష్ కుమార్, ఇతర వ్యక్తులకు కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS15UE 5544 | Ranjith Chinthakindi | FORCE TEMPO TRAVELLER AC BS6-P | 2021 |
| 2 | TS11UB 2202 | Sampath Mekala | MAHINDRA XYLO-P | 2017 |
| 3 | TS07UH 4105 | Ranjith Chinthakindi | FORCE TEMPO TRAVELLER-P | 2019 |
| 4 | AP20AV 6624 | Suresh Bommakanti | SWIFT VDI DIESEL 5 SEATER | 2014 |

AUCTION DATE : 25-04-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :31-3-2086/1, 1st Floor, Above City Union Bank, 100 Feet Road, Near Shyamala Garden, TNGO'S Colony, Waddepalliy, Hanamkonda – 506370. Cell : 9849955900 & 9573787776

# రాష్ట్రంలో రాజకీయ వేడి

తెలంగాణలో పెరుగుతున్న ఎండలకు సమాంతరంగా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రభుత్వ, ప్రతిపక్ష సారధుల ప్రత్యక్ష పరస్పర సవాళ్ళతో రాజకీయ రణం ఉధృతమైంది. ఇందుకు ఒకే రోజు (ఏప్రిల్ 20), ఒకే జిల్లా (ఉమ్మడి కరీంనగర్)లో ఒకే సమయంలో జరిగిన వైరి పక్షాల సభలే నిదర్శనం. మాజీ మంత్రి, మాజీ సిఎల్‌పి నేతగా సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా చెలామణి అయిన తిప్పనగారి జీవన్ రెడ్డి తన అనుచరగణ సమేతంగా బిఆర్‌ఎస్‌లో చేరేందుకు సోమవారం జగిత్యాలలో సభ పెట్టారు. దీనికి ప్రతిపక్ష నాయకుడు, బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, వారిని గులాబీ దళంలో చేర్చుకున్నారు.

మరోవైపు అదే రోజు కాళేశ్వరం ప్రాజెక్టు గుండెకాయ మేడిగడ్డ బ్యారేజి ప్రదేశానికి వెళ్ళి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, సీనియర్ కేబినెట్ మంత్రులు సహా పరిశీలించారు. అనంతరం రైతు భరోసా రెండవ విడత విడుదలకు నస్తూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. ఇంచుమించుగా కెసిఆర్ రాత్రి 7:40 గంటల ప్రాంతంలో ప్రసంగాన్ని ప్రారంభిస్తే, రేవంత్ రెడ్డి 8:10 గంటల ప్రాంతంలో తన ప్రసంగాన్ని ఆరంభించారు. ఎన్నికల ప్రచార కాలంలో తప్ప ఒకే రోజు ప్రత్యర్థి పార్టీలు బహిరంగ సభలను ఏర్పాటు చేసుకోవడం బహు అరుదు. తెలంగాణ ఏర్పడిన తరువాత ఎన్నికలేతర సమయంలో ముఖ్యనేతల సభలు ఏక కాలంలో జరగడం రాజకీయ పరిశీలకులనే గాక, రాష్ట్ర ప్రజలలో ఆసక్తి రేపింది. ఇది తెలుగు న్యూస్ ఛానల్‌లకు సంకటాన్ని తీసుకువచ్చింది. తీవ్రమైన రాజకీయ విభజన వాతావరణంలో ఏ ఛానల్ ఎవరి ప్రసంగానికి ప్రాధాన్యతనిస్తుందని ఉభయ పార్టీలు దేగకన్నుతో పరిశీలించటమే కాకుండా, ఎవరి ప్రసంగాన్ని ఎంత సమయం పాటు లైవ్ ప్రసారం చేసుకున్నారో లెక్కలు కూడా వేసుకున్నాయి.

ఇక విషయానికొస్తే, బిఆర్‌ఎస్ అధికారానికి దూరమైన రెండున్నరేళ్ళలో కెసిఆర్ ప్రజాదర్శనం అరుదైపోయింది. ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కినప్పటికీ, శాసనసభకు ఒకటి, రెండు సార్లు, అది కొద్ది నిమిషాల పాటే వచ్చిపోయారు. పార్టీ కార్యక్రమాలలో కూడా పెద్దగా కనిపించిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ముఖ్యమంత్రి, శాసనసభ్యులు మేడిగడ్డను పరిశీలించిన నేపథ్యంలో , కొద్ది రోజులకు ఆ జిల్లాలోనే పెట్టిన సభకు కెసిఆర్ వచ్చారు. ఆ తరువాత గతేడాది వరంగల్‌లో జరిగిన బిఆర్‌ఎస్ రజతోత్సవ సభకు హాజరయ్యారు. మళ్ళీ ఇప్పుడు జరిగిన సభనే. మూడేళ్ళలో మూడు సభల్లో పాల్గొన్నారు. జగిత్యాల సభలో గంటంబావు పాటు సాగిన కెసిఆర్ ప్రసంగంలో తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో టిఆర్‌ఎస్ పాత్ర, ప్రభుత్వం వచ్చాక చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఒక్క సందర్భంలో మినహా వ్యక్తిగత విమర్శలు చేయనప్పటికీ, తీవ్రస్థాయిలోనే ప్రభుత్వాన్ని ధ్వజమెత్తారు. నూటికి నూరుపాళ్ళు బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, తెలంగాణలో రాజకీయ పునర్నిర్మాణ యజ్ఞానికి సిద్ధం కావాలని పిలుపునివ్వడం ద్వారా కార్యకర్తలను ఉత్తేజపరచగలిగారు. అయితే, తమ ప్రభుత్వ వారసత్వంగా వచ్చిన రుణభారాలతో వర్తమాన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయలేకపోతుందనే విషయం ఆయనకు తెలియంది కాదు. తన ప్రసంగంలో కెసిఆర్ సమస్యలను ప్రస్తావించారే తప్ప తమ హయాంలో జరిగిన తప్పులు, అప్రజాస్వామిక ధోరణులపై ప్రస్తావించకపోవడంతో అధికారంలోకి రావాలనే యావే ద్యోతకమైంది. ఏ పార్టీ అయినా ప్రత్యక్షంగా పశ్చాత్తాపం చెప్పదు. కానీ, స్వయానా ఆయన కుమార్తె, మాజీ ఎంఎల్‌సి కవిత బిఆర్‌ఎస్‌లో జరిగిన తప్పులపై ఇప్పటికే పలుమార్లు క్షమాపణ చెప్పడంతో బిఆర్‌ఎస్ వైపు నుంచి సమాధానం రావాల్సిన బాధ్యత ఉంటుంది.

బహిరంగసభల తేదీలపై ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. సాధారణంగా బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27న సభను ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా ఆ తేదీకి వారం రోజుల ముందే జగిత్యాలలో సభ నిర్వహించుకోవడం గమనార్హం. బిఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ అయిన కవిత వ్యూహాత్మకంగానే బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవానికి రెండు రోజుల ముందే ఏప్రిల్ 25న తన సొంత పార్టీ ఆవిర్భావ సభను ఏర్పాటు చేయబోతున్నారు.

బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నాడు కవిత పార్టీపై, ఆమె విమర్శలపై ఫోకస్ ఉండకూడదనే ఉద్దేశ్యంతోనే వారం రోజుల ముందే జగిత్యాల సభను ఏర్పాటు చేసుకుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ బహిరంగ సభ విషయానికొస్తే, తాము నెలరోజుల ముందే కాళేశ్వరం కార్యక్రమం, సభను పెట్టుకున్నట్లు చెబుతున్నప్పటికీ, జగిత్యాల సభకు కౌంటర్‌గానే అదే రోజున సభ నిర్వహించేందుకు తేదీని ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజల మదిలో కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు కృంగిపోవడాన్ని చెరపకుండా ఉంచే ప్రయత్నంలో అది ఒక భాగమని భావిస్తున్నారు.

దాదాపు ముప్పావు గంట సాగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగం లో సింహభాగం జీవన్‌రెడ్డిని విమర్శించడమే కాకుండా, ఆయన మీదుగా కెసిఆర్‌పై విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్ళలో చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించటమే కాకుండా, బిఆర్‌ఎస్ గత పాలనను గుర్తు చేశారు. చివర్లో మాత్రం కెసిఆర్‌కు కనీసం ప్రతిపక్ష హోదాను కూడా దక్కనీయబోనంటూ ప్రకటించడం ద్వారా రాజకీయాన్ని మరింత వేడెక్కించారు రేవంత్ రెడ్డి. అయితే, ఇరువురు సారథులు తమ ప్రసంగాలలో తమకు అనుగుణంగా వాదనలను సమర్థవంతంగానే ప్రజల ఎదుట ఉంచినప్పటికీ, ఒకటి రెండు సందర్భాలలో వ్యక్తిగతస్థాయి దూషణలకు పాల్పడడం హోదాలకు శోభనీయం లేదు. రాజకీయాలు వ్యక్తిగత స్థాయిలో ఎంత లోతుగా పాతుకుపోయాయో ఇరువురి ప్రసంగాలే వ్యక్తం చేశాయి. జగిత్యాల, నస్తూరుపల్లి బహిరంగ సభల ద్వారా భవిష్యత్తు రాష్ట్ర రాజకీయాలు మరింత తీవ్రం కానున్నాయనే సంకేతాలు వెలువడ్డాయి. వీటికి తోడుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పి.సి.ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు, ఆర్‌టిసి సమ్మెతో వాతావరణం మరింత వేడెక్కింది. ●



## వాణిజ్య నమూనాను తిరగరాస్తున్న ఇరాన్ సుంకం

కీలకమైన అంతర్జాతీయ జలమార్గం హోర్ముజ్ జలసంధిలో సుంకాల వసూళ్ళ ద్వారా, ఇరాన్ ఇప్పటివరకూ అమలులో ఉన్న ప్రపంచ వాణిజ్య నమూనాను తిరగరాస్తోంది. ఉత్తర–దక్షిణాలలో ఉన్న ఇరాన్ ఒమన్‌లకు మధ్య ఇరుకైన మార్గంలో నౌకలు ఢీకొట్టుకోకుండా క్రమ పద్ధతిలో వాణిజ్యం కొనసాగడానికి 1968లో అంతర్జాతీయ సముద్రయాన సంస్థ నిర్దేశించిన 'ట్రాఫిక్ సెపరేషన్ స్కీమ్'కు ట్రంప్ చర్యలవల్ల కాలం చెల్లే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఈ మార్గాన్ని మార్చి తమ లారక్, ఖ్యేష్ దీవుల సమీపంగా నౌకలు వెళ్ళాలని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ఆదేశిస్తోంది. ఇరాన్ అధికారులు లెక్క కట్టాక నౌకలు తమ సరుకు విలువకు సరిపడ సుంకం చెల్లించి తమ దారిన వెళ్ళే పరిస్థితి వస్తోంది. అంతర్జాతీయ నౌకా రవాణా పరిశ్రమకు ఇది తీవ్ర వ్యతిరేకం. దాదాపు 20,000 లక్ష్యాలపై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు చేసిన తర్వాత కూడా తట్టుకుని నిలబడిన ఇరాన్ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనావేసిన ట్రంప్ కేవలం 24 గంటల్లో ఆ దేశాన్ని పాదాక్రాంతం చేసుకోగలననుకున్నారు''.

– విశ్లేషకుడు, ఫ్రాంక్ గార్డెనర్

## ప్రాణాలను పణంగా పెట్టే అభివృద్ధి అవసరమా?

పర్యావరణ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు లేని రోజు భారతదేశంలో లేదనిపిస్తుంది. హిందుస్తాన్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ రిఫైనరీ, రూ.79,459 కోట్ల వ్యయంతో నిర్మితమైన హెచ్ పిసిఎల్, రాజస్థాన్ ప్రభుత్వ సంయుక్త ప్రాజెక్టు, 2026 ఏప్రిల్ 21న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేత ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, ప్రారంభానికి ఒకరోజు ముందు (ఏప్రిల్ 20, 2026) మధ్యాహ్నం, రాజస్థాన్‌లోని బాల్టోరా జిల్లాలో ఉన్న రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ సముదాయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ యూనిట్ పరిమాణం ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన బిపిసిఎల్ యూనిట్‌కు సమానంగా ఉంది. ఈ ఘటన పర్యావరణ ప్రభావ అంచనా, త్వరిత ప్రమాద అంచనా నివేదికల సమగ్రతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ప్రమాద నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ విషయంలో గణనీయమైన లోపాలు కనిపిస్తున్నాయి. సైంటిస్ట్ ఫర్ పీపుల్ స్వతంత్ర అంచనా ప్రకారం, ఫ్యూజిటివ్ ఎమిషన్స్ సంవత్సరానికి సుమారు 7,500 టన్నుల వరకు ఉంటాయి. అయితే, ఈఐఏ నివేదికలో ప్రాణాంతకమైన విష ఉద్గారాల స్వభావం, ప్రభావాలపై సరైన వివరణ లేదు. ఇది అత్యంత ఆందోళనకర విషయం.

ఇలాంటి అధిక ప్రమాద పరిశ్రమల విషయంలో మార్గదర్శకంగా ఉండాల్సిన జాగ్రత్త సూత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడినట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో, ప్రతిపాదిత ప్లాంట్ సమీప గ్రామాలు, ప్రజల భద్రతను నిర్ధారించేందుకు సంబంధిత అధికారులు మరియు బాధ్యత గల వర్గాలు తక్షణ చర్యలు తీసుకోవడం అత్యవసరం. పెట్టుబడే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే అభివృద్ధి అభిలషణీయమా. పదునెనిమిది వందల పేజీల ఆంగ్ల నివేదికలను ప్రజలకు అందుబాటులో లేకుండా వెబ్‌లో పెట్టి వారికి కనీస సమాచారం అందించే బాధ్యత కూడా తీసుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎవరికోసం పనిచేస్తున్నారు? మనది స్వతంత్ర భారతమా? పర్యావరణ న్యాయం వారికి లభించేలా ప్రజాసంఘాలు, సైన్స్ ప్రచార సంస్థలు, విద్యావంతులు బలమైన ప్రయత్నం చేయాలి. ఏప్రిల్ 26 వరకూ అభిప్రాయాలూ, అభ్యంతరాలు పంపే అవకాశం వుంది. విజ్ఞాన వేదికలు, మేధావులు, హక్కుల సంఘాలు విధ్వంసకర అభివృద్ధిని ప్రశ్నించాలి.

**వేగం అభివృద్ధికి చిహ్నం కాదు – విపత్తుకు సంకేతం!**

నెల్లూరు బిపిసిఎల్ రిఫైనరీ అనుమతులలో ప్రభుత్వ తొందరపాటుపై బహిరంగ హెచ్చరిక. ఇంజనీరింగ్‌లో ఒక పాత సామెత ఉంది: 'రెండుసార్లు కొలిచి, ఒకసారి కోయాలి'. అంటే, ఏదైనా పనిచేసే ముందు తగినంత సమయం తీసుకుని లెక్కలు సరిచూసుకోవాలి. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో అత్యంత ప్రమాదకరమైన బిపిసిఎల్ రిఫైనరీ ప్రాజెక్టును సరైన పరిశీలన లేకుండానే వేగంగా ముందుకు నెడుతోంది. ఈ తొందరపాటు వల్ల మన ప్రాణాలకు, పర్యావరణానికి వాటిల్లే ముప్పు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి:

**1. ఇది సాదాసీదా పరిశ్రమ కాదు – ఒక పెనుముప్పు!**

ఈ రిఫైనరీ ఏటా 3,60,000 టన్నుల క్లోరిన్ గ్యాస్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంది. సైక్లోన్లు వచ్చే తీరప్రాంతంలో, భూకంప ముప్పు ఉన్న జోన్‌లో ఇలాంటి భారీ స్థాయి రసాయన నిల్వలు ఉండటం అంటే మనం ఒక 'బాంబు' మీద నివసించడమే. ప్రభుత్వం చూపుతున్న వేగం వల్ల ఈ రిస్కులను సరిగ్గా అంచనా వేయడం లేదు.

**2.ఎల్జీ పాలిమర్స్ వంటి విపత్తుకు దారితీయవచ్చు:** బిపిసిఎల్ స్వయంగా ఇచ్చిన నివేదిక ప్రకారం , కేవలం 25 మి.మీ. క్లోరిన్ లీకేజీ జరిగితే ఆ విషవాయువు 4.8 కి.మీ. మేర విస్తరించి ప్రాణాపాయం కలిగిస్తుంది. సరైన అత్యవసర ప్రణాళికలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు లేకుండా ప్రాజెక్టును ప్రారంభించడం అంటే మరో 'ఎల్జీ పాలిమర్స్' వంటి దుర్ఘటన ను ఆహ్వానించడమే.

**3. నివేదికల్లోని డొల్లతనం – హాస్యాస్పదమైన సర్వేలు**

992 పేజీల పర్యావరణ నివేదికలో 42 తీవ్రమైన లోపాలు ఉన్నాయి.

*తాబేళ్ల సర్వే:* తాబేళ్లు గుడ్లు పెట్టని కాలంలో (మార్చి నుండి మే) సర్వే చేసి, 'ఇక్కడ తాబేళ్లు లేవు' అని తేల్చారు. ఇది ఎంతటి అశాస్త్రీయమైన పద్ధతో ఆలోచించండి. *వాతావరణం:* విషవాయువులు నేల మీదకు దిగే శీతాకాల వాతావరణాన్ని అసలు పరిగణనలోకి తీసుకోలేదు.

*ఆరోగ్యం:* గ్రామంలో ప్రస్తుతం ఉన్న క్యాన్సర్ లేదా శ్వాసకోశ వ్యాధుల వివరాలను నమోదు చేయలేదు. రేపు రిఫైనరీ వల్ల జబ్బులు వచ్చినా, దానికి రిఫైనరీనే కారణమని నిరూపించడానికి ఆధారాలు లేకుండా చేస్తున్నారు.

**4. రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మనకు సురక్షితమైన వాతావరణంలో జీవించే హక్కు ఉంది. గ్రామ సభలు నిర్వహించకుండా, ప్రజల నుంచి వాస్తవమైన అంగీకారం తీసుకోకుండా భూసేకరణ చేయడం చట్టవిరుద్ధం. నాలుగు గ్రామాలను తరలిస్తున్నా, వారికి సంబంధించి ఎటువంటి పునరావాస ప్రణాళిక నివేదికలో లేదు.

**5.తప్పుల తడకగా ప్లాంట్ డిజైన్**

తొందరపాటు వల్ల రిఫైనరీ లేఅవుట్‌లోనే ప్రమాదకర లోపాలు ఉన్నాయి. ముఖ్యమైన కంట్రోల్ రూమ్ మరియు ఫైర్ వాటర్ పంప్ హౌస్ లు ప్రమాదకరజోన్లలోనే ఉన్నాయని బిపిసిఎల్ స్వంత నివేదికే చెబుతోంది. వీటిని ఇప్పుడే సరిచేయకపోతే, రేపు ప్రమాదం జరిగినప్పుడు ప్రాణనష్టాన్ని ఎవరూ ఆపలేరు.

అభివృద్ధి మనకు అవసరమే, కానీ అది మన ప్రాణాలను పణంగా పెట్టి రాకూడదు. ఒక ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలించడానికి 30 నెలలు పడుతుంది, కానీ దానిని కేవలం 16 నెలల్లోనే పూర్తి చేయాలని చూడటం వినాశనానికి దారితీస్తుంది. పర్యావరణ అనుమతులు ఇచ్చే ముందు పూర్తిస్థాయి శాస్త్రీయ విచారణ జరగాలి. వేగం కంటే ప్రాణాల భద్రతే ముఖ్యం.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు, 9989988912**

# 'హైరైజ్'ల వెలుగు – పర్యావరణానికి ముప్పు



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

ప్రపంచ జనాభా పెరుగుతోంది. జీవన శైలి మారుతోంది. గ్రామం నుంచి పట్టణానికి, పట్టణం నుంచి మహానగరానికి, అక్కడి నుంచి విదేశీ నగరాల కు వలసలు విస్తరిస్తున్నాయి. ఉపాధి, విద్య, వైద్యం, వ్యాపారం, సౌకర్యాలు ఇవన్నీ నగరాల చుట్టూ కేంద్రీకృతం కావడంతో నగరీకరణ అనివార్యంగా మారింది. ఫలితంగా భూమి విలువలు ఎగబాకాయి. రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది. ఆకాశాన్ని తాకే (హైరైజ్) టవర్లు అభివృద్ధి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. కానీ ఒక కఠినమైన ప్రశ్న మన ముందుంది: ఈ కాంక్రీట్ నాగరికత పర్యావరణానికి ముప్పు కానుందా?

ఐక్యరాజ్యసమితి తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం ప్రపంచ జనాభాలో సుమారు 45 శాతం మంది నగరాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగి ప్రపంచ జనాభా పెరుగుదలలో రెండు మూడొంతులు నగరాలకే చేరనున్నాయని అంచనా. అంటే రాబోయే దశాబ్దాల్లో మరింత గృహనిర్మాణం, మరింత రోడ్లు, మరింత వాణిజ్య సముదాయాలు, మరింత మౌలిక వసతులు అవసరం అవుతాయి.

అయితే నగరాల పెరుగుదల కేవలం నివాసాల విస్తరణ కాదు; అది ప్రకృతిపై ఒత్తిడి. భవన నిర్మాణ రంగం ప్రస్తుతం ప్రపంచ శక్తి వినియోగంలో 32 శాతం భాగం తీసుకుంటోంది. ప్రపంచ కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల్లో 34 శాతం ఈ రంగం నుంచే వస్తున్నాయి. సిమెంట్, ఉక్కు వంటి నిర్మాణ పదార్థాల తయారీ ఒక్కటే పెద్ద కాలుష్య మూలం.

ఒక అపార్ట్‌మెంట్ టవర్ నిర్మించడానికి వేల టన్నుల సిమెంట్, ఉక్కు, ఇసుక, నీరు, విద్యుత్ అవసరం. ఒక్కో భవనం వెనుక అనేక గనులు, ఫ్యాక్టరీలు, రవాణా వ్యవస్థలు పనిచేస్తాయి. అంటే మనం చూస్తున్నది కేవలం భవనం కాదు...అదృశ్యంగా ప్రకృతి సంపదల వినియోగ చరిత్ర. అడవులు నరికివేత, నదుల నుంచి ఇసుక తవ్వకం, భూగర్భ జలాల తగ్గుదల, మట్టిసారపు నష్టం ఇవన్నీ దాని వెనుక ఉంటాయి. అపార్ట్‌మెంట్ సంస్కృతి మరో ప్రమాదాన్ని తీసుకొస్తోంది...హీట్ ఐలాండ్ ప్రభావం. కాంక్రీట్, గాజు, టార్‌రోడ్లు వేడిని గ్రహించి నగరాలను చుట్టుపక్కల ప్రాంతాల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో ఉంచుతున్నా యి. చెట్లు తగ్గిపోవడం, ఖాళీ ప్రదేశాలు కనుమరుగవడం వల్ల వేసవులు భరించరాని స్థాయికి చేరుతున్నాయి. ఎయిర్ కండిషనర్లు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది; విద్యుత్ ఉత్పత్తి కోసం మరింత ఇంధనం కాలుతుంది.ఇది తిరిగి గ్లోబల్ వార్మింగ్‌ను వేగవంతం చేస్తుంది.

నగరాల్లో వర్షపు నీరు నేలలోకి దిగే అవకాశాలు కూడా తగ్గుతున్నా



యి. ఎక్కడ చూసినా కాంక్రీట్ కప్పేస్తే వర్షం పడినప్పుడు నీరు నేలలోకి చొరబడదు. ఫలితం ఒకవైపు వరదలు, మరో వైపు భూగర్భ జలాల కొరత. ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణలు.

ఇక యుద్ధాల ప్రభావం మరింత ఘోరం. ఒక నగరం మీద బాంబులు పడితే కేవలం భవనాలు కూలవు; సంవత్సరాలుగా ఉపయోగించిన సిమెంట్, ఉక్కు, శక్తి, మానవ శ్రమ...అంతా వృథా అవుతుంది. యుద్ధాల తర్వాత మళ్లీ పునర్నిర్మాణం కోసం మరిన్ని వనరు లు వినియోగించాల్సి వస్తుంది. ఇటీవల ప్రపంచంలోని యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో లక్షల ఇళ్లు ధ్వంసమై, కోట్ల టన్నుల శిథిలాలు పేరుకుపోయాయి. పునర్నిర్మాణం కోసం మళ్లీ సిమెంట్, ఉక్కు, ఇంధనం అవసరం అవుతుంది. అంటే యుద్ధం ద్విగుణీకృత నష్టం. మొదట విధ్వంసం, తరువాత పర్యావరణ ఖర్చుతో పునర్నిర్మాణం.

అయితే ఎత్తైన భవనాలన్నీ చెడు అని చెప్పడం సరైంది కాదు. సరైన ప్రణాళికతో నిర్మించిన అధిక సాంద్రత గృహాలు విస్తారమైన పట్టణ విస్తరణ కంటే మంచివే. ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి నివాసం కల్పిస్తే రవాణా దూరాలు తగ్గుతాయి, రోడ్ల విస్తరణ అవస రం తగ్గుతుంది, సేవల పంపిణీ సులభమవుతుంది. కానీ సమస్య ఏమిటంటే...మన నగరాల్లో చాలా నిర్మాణాలు లాభం ముందు, పర్యావరణం తర్వాత అన్న ధోరణిలో జరుగుతున్నాయి.

**అందుకే ప్రభుత్వాలు తక్షణమే ఐదు చర్యలు చేపట్టాలి:**

మొదటిది, గ్రీన్ బిల్డింగ్ కోడ్లు తప్పనిసరి చేయాలి. వర్షపు నీటి సంరక్షణ, సౌరశక్తి, సహజ గాలి ప్రవాహం, శక్తి పొదుపు డిజైన్లు ఉండాలి. రెండవది, ప్రతి కొత్త ప్రాజెక్టుకు నిజమైన పర్యావరణ ప్రభావ అంచనా ఉండాలి. మూడవది, నగరాల్లో కనీస పచ్చదన ప్రాంతాల నిబంధనలు కఠినంగా అమలు చేయాలి. నాలుగవది, పాత భవనాల పునర్వినియోగం, రీనోవేషన్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాలి; కూల్చి మళ్లీ కట్టడం మాత్రమే అభివృద్ధి కాదు. ఐదవది, ప్రజా రవాణా కేంద్రంగా నగర ప్రణాళిక చేయాలి.

**కార్పొరేట్ వర్గాలు కూడా బాధ్యత వహించాలి:**

(ఈ.ఎస్.జి) నివేదికలు కాగితాలకే పరిమితం కాకూడదు. ప్రతి నిర్మాణ కంపెనీ తన కార్బన్ ఫుట్‌ప్రింట్ ప్రకటించాలి. సిమెంట్‌కు ప్రత్యామ్నాయ పదార్థాలు, రీసైకిల్ స్టీల్, ప్రీఫ్యాబ్ టెక్నాలజీలు వినియోగించాలి. ప్రజలకూ బాధ్యత ఉంది. ఎంత పెద్ద ఇల్లు? కంటే ఎంత స్థిరమైన ఇల్లు? అని అడిగే సమయం వచ్చింది. ప్రకృతిని నాశనం చేసి నిర్మించిన లగ్జరీ ఫ్లాట్‌లో జీవించడం చివరికి కాలుష్యంతో, నీటి కొరతతో, వేడితో బాధపడటమే.

చివరిగా... ఆకాశహర్మ్యాలు అభివృద్ధి ప్రతీకలు కావచ్చు. కానీ అవి భూమి ఊపిరిని ఆపేస్తే ఆ అభివృద్ధి శ్మశాన నిశ్శబ్దమే. కాంక్రీట్ అడవులు కాదు, సజీవ నగరాలు నిర్మించడం నిజమైన నాగరికత. భవిష్యత్తు ప్రశ్నిస్తోంది...మనకు ఎత్తైన భవనాలే కావాలా? లేక నివసించదగిన భూమా?

# గ్రామాల్లో శివాజీ విగ్రహాలు..
# దేశభక్తి ముసుగులో హిందూ కాషాయీకరణ

తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన శివాజీ మహారాజు విగ్రహాలు ఇటీవల అత్యధిక సంఖ్యలో వెలుస్తున్న దృశ్యం కేవలం ఒక సాంస్కృతిక ఉద్యమం కాదు. అది ఒక లోతైన రాజకీయసామాజిక మార్పిడి – హిందూ ధర్మ సమాజ రక్షణ అనే నేపథ్యంలో దేశభక్తిని తన లక్ష్యంగా చూపించి, వాస్తవంలో హిందూ కాషాయీకరణను గ్రామ స్థాయిలో నాటుతున్న వ్యూహాత్మక ప్రయత్నం. గతంలో స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ నాయకుల విగ్రహాలు ఏకైక గ్రామీణ చిహ్నాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ స్థానాన్ని శివాజీ ఆక్రమిస్తున్నారు. ఈ మార్పు యొక్క లోతును అర్థం చేసుకోవాలంటే, దాని వెనుక ఉన్న ఆర్‌ఎస్ఎస్ కార్యకలాపాలు, బిజెపి రాజకీయ లాభాలు, సినిమా సాధనం వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించాలి.

గతకాలంలో గ్రామాల్లో భగత్ సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, డా. బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరా గాంధీ, స్వామి వివేకానందల విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠిత మవుతుండేవి. ఇవి భారత స్వాతంత్ర్య పోరాటం, సమాజ సంస్కరణ, లౌకికత్వం, ఐక్యత వంటి విలువలను ప్రతిబింబించేవి. ఈ విగ్రహాలు ఏ ఒక్క మతం లేదా సంప్రదాయానికి పరిమితం కాకుండా, మొత్తం జాతిని ఒక్కటి చేసే చిహ్నాలుగా నిలిచాయి. కానీ ఇప్పుడు ఆ స్థానాన్ని శివాజీ విగ్రహాలు ఆక్రమించడం యాదృచ్ఛికం కాదు. ఇది ఆర్‌ఎస్ఎస్ సంస్థలు గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న చురుకైన కార్యక్రమా లు, హిందూ ధార్మిక మహాసభలతో ముడిపడి ఉంది. ప్రతి గ్రామంలో అట్టహాసంగా వేడుకలు, ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఈ విగ్రహాలను కేవలం చారిత్రక వ్యక్తిగా కాకుండా, హిందూ సమాజ రక్షకుడుగా స్థాపించడం జరుగుతోంది.

ఈ ప్రక్రియకు ఇటీవలి కాలంలో ఒక బలమైన సాంస్కృతిక ఆయుధం లభించింది – 'చావా' చిత్రం. గత ఏడాది విడుదలైన ఈ సినిమా శివాజీ తనయుడు సంభాజీ మహారాజు యొక్క వీరత్వం, ధైర్యం, హిందూ సమాజ రక్షణను కేంద్రంగా చిత్రీకరించి భారతీయ ప్రజల మనసుల్లో గాఢంగా నాటుకుపోయింది. కానీ ఇది ఒక్కటే కాదు. 'కాశ్మీర్ ఫైల్స్'(2022), 'ది కేరళ స్టోరీ'(2023) వంటి చిత్రాలు కూడా ఇదే వ్యూహంలో భాగమయ్యాయి. కాశ్మీర్ ఫైల్స్ కాశ్మీరీ పండిట్ల బాధలను గ్రాఫిక్‌గా చూపి ముస్లింలను సాధారణీకరించి హింసాత్మకులు, ద్రోహులుగా చిత్రీకరించింది. కేరళ స్టోరీ 'లవ్ జిహాద్' అనే వివాదాస్పద థియరీని ఆధారం చేసుకొని ముస్లిం యువకులు హిందూ క్రిస్టియన్ అమ్మాయిలను ఆకర్షించి ఉగ్రవాదంలోకి నెట్టేవారుగా చూపి సామాజిక ధ్రువీకరణను రెచ్చగొట్టింది. ఈ చిత్రాలన్నింటినీ భారతీయ జనతా పార్టీ సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. సినిమా ద్వారా సృష్టించిన భావోద్వేగాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవ డం బిజెపి వ్యూహంలో కొత్త కాదు. కానీ ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే..ఈ చిత్రాలు దేశభక్తిని కాకుండా, హిందూ ధర్మ రక్షణను ప్రధాన థీమ్‌గా ఎత్తి చూపి బిజెపి ఆర్‌ఎస్ఎస్ కలయిక ద్వారా జరుగుతున్న కాషాయీకరణ ప్రక్రియకు బలం చేకూరుస్తున్నాయి.

ఈ వ్యూహం యొక్క లోతైన అర్థం ఏమిటి? ఇవి రాజకీయ లబ్ధి కోసం చేసే లెక్కలు. గ్రామ స్థాయిలో హిందూ ఐక్యతను సృష్టించడం ద్వారా బిజెపి తన ఓటు బ్యాంకును విస్తరించుకోవాలని చూస్తోంది. దేశభక్తి అనే ఉదాత్తమైన భావనను హిందూ ధర్మ సంరక్షణతో ముడిపెట్టడం ద్వారా, మతపరమైన ధ్రువీకరణను ప్రోత్సహిస్తుంది. ఇది భారతదేశం యొక్క లౌకిక స్వభావాన్ని, సమగ్ర జాతీయతను క్రమంగా కుంచించుతుంది.

ఆర్‌ఎస్ఎస్ దీర్ఘకాలిక సాంస్కృతిక ప్రాజెక్ట్ ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామాల్లో ధార్మిక మహాసభలు, కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా హిందూ సమాజాన్ని ఒక రాజకీయ బ్లాక్‌గా మార్చడం జరుగుతోంది. బిజెపి దీన్ని ఎన్నికల లాభంగా మార్చుకోవడం సహజం. కానీ ఈ ప్రక్రియ దేశం మొత్తం సామాజిక సామరస్యానికి, లౌకిక రాజ్యాంగ విలువలకు ఎంత పెద్ద సవాలుగా మారుతుందో గుర్తించాలి. జాతీయ నాయకుల విగ్రహాలు ఏకత్వాన్ని నిర్మించాయి. శివాజీ విగ్రహాలు మాత్రం ఒక నిర్దిష్ట ధార్మిక గుర్తింపును బలపరుస్తాయి. ఇది భారతదేశం యొక్క వైవిధ్యభరితమైన సమాజాన్ని ఒక ఏకపక్ష హిందూ దృక్పథంతో చూడడానికి దారితీస్తుంది. ఈ నేపథ్యంలో ఒక విషయం స్పష్టం – దేశభక్తి నిజమైనది కావాలంటే అది అన్ని వర్గాలను, అన్ని మతాలను కలుపుకొని ఉండాలి. హిందూ కాషాయీకరణ ద్వారా రాజకీయ లాభాలు పొందడం స్వల్పకాలిక విజయం కావచ్చు, కానీ దీర్ఘకాలికంగా దేశ ఐక్యత, సామాజిక స్థిరత్వానికి హాని చేస్తుంది.

గ్రామాల్లో శివాజీ విగ్రహాలు ఎంత భారీగా వెలుస్తున్నాయో, అంతగా మనం ఆలోచించాలి – ఇది నిజంగా దేశాన్ని బలపరుస్తుం దా, లేక ఒక నిర్దిష్ట రాజకీయ ఎజెండాను గ్రామ స్థాయి నుంచి బలపరుస్తుందా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం భారతీయ ప్రజాస్వామ్యం యొక్క భవిష్యత్తుకు కీలకం.

**కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, 9010128884**

## పౌర సమాజ సాధికారతకు పెద్దపీట..
## పంచాయతీరాజ్ వ్యవస్థ

పురాతన వేదకాలం నుంచే గ్రామ సభల పేరుతో అభివృద్ధి పథకాల రచనలు చేయడం ప్రారంభమైంది. ఈ స్థానిక స్వయం పాలన విధానమే నేడు చట్టరూపం పంచాయతీరాజ్ వ్యవస్థగా రూపాంతరం చెందింది. రాజ్యాంగ 73వ సవరణ చట్టం, 1992 ద్వారా 24 ఏప్రిల్ 1993 నుంచి అమలులోకి వచ్చిన పంచాయతీరాజ్ వ్యవస్థ నేడు స్థానికుల స్వయం పాలనకు రాచబాటలు వేసింది. పంచాయతీరాజ్ వ్యవస్థ అమలు తేదీని ఆధారంగా చేసుకొని ప్రతి ఏట 24 ఏప్రిల్ రోజున దేశవ్యాప్తంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం లేదా నేషనల్ పంచాయతీ రాజ్ డేను పాటించుట ఆనవాయితీగా వస్తోంది.

**పంచాయతీరాజ్ వ్యవస్థ లక్ష్యాలు:**

భారత రాజ్యాంగ సవరణ రూపంలో అమలులోకి వచ్చిన పంచాయతీరాజ్ వ్యవస్థల ద్వారా గ్రామీణాభివృద్ధి, అట్టడుగు వర్గాల సంక్షేమం, సమన్యాయం, మహిళా వికాసం, మహిళా సాధికారత, పారదర్శకత, జవాబుదారీతనం, స్థానిక సంస్థల బలోపేతం, గ్రామీణ పౌర సమాజ సాధికారత లాంటి ప్రయోజనాలు కల్పించడం జరుగుతున్నది. పరిపాలన వికేంద్రీకరణ, ఈ పరిపాలన వినియోగం, స్థానికుల్లో ఉత్పత్తి సామర్థ్యం పెంచడం, ఆర్థిక చేయూతను ఇవ్వడం లాంటి బాధ్యతలు పంచాయతీరాజ్ వ్యవస్థకు అప్పగించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం వేదికగా స్థానికులకు అవగాహన కల్పించడం, చర్చలు జరపడం, ఉత్తమమైన పథకాలు లేదా విజయవంతమైన ప్రయోగాలకు అవార్డులు ఇవ్వడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

**మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ:** నేటి పంచాయతీరాజ్ వ్యవస్థలో మూడంచెల పాలనా వ్యవస్థలను రాజ్యాంగం కల్పించింది. గ్రామస్థాయి గ్రామ పంచాయతీ స్వయంపాలన, బ్లాక్ స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ వ్యవస్థలుగా పంచాయతీరాజ్‌ను విభజించడం జరిగింది. తమ అవసరాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న నేటి పంచాయతీరాజ్ వ్యవస్థలు మెరుగైన సేవలను అందించేందుకు ముందుకు రావాలని సామాన్యులు కోరుకుంటున్నారు. ఈ స్థానిక సంస్థలు బలపడితే పట్టణాలకు వలసలు తగ్గడం, సమ్మిళిత గ్రామీణ సమగ్రాభివృద్ధికి బాటలు పడడం జరుగుతుందని, అలా జరిగితేనే అసలైన లక్ష్యాలు నెరవేరుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

*(24 ఏప్రిల్ 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం'సందర్భంగా)*

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

## తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకున్నప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జరుగుతున్నసంక్షేమ వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి లో గల మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల పాఠశాల జోగిపేట (బాలికలు )లో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. పాఠశాల పరిసరాలను ,తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యేక్షంగా మాట్లాడి వారి విద్యా ప్రగతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు తమ సూచనలు ,సలహాలు అందించాలని సమస్యలు ఉన్న పక్షంలో వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైతే కంప్లైంట్ బాక్కులు ఏర్పాటు చేసి విద్యార్థులు ,తల్లిదండ్రుల సమస్యలను స్వీకరించి పరిష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంగ్లీష్ భాషలో నైపుణ్యం పెంపొందించేందుకు హాస్టల్ లో ప్రతిరోజు ఒక గంట పాటు ఇంగ్లీష్ లో నే మాట్లాడే విదానాన్ని అమలు చేయాలని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రతి వి ద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి వారు బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు ఆసక్తి ఉన్న రంగాల లో ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం సం క్షేమ వసతి గృహాలలో విద్యార్థుకు అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తోందని ,పాఠ్యపుస్తకాలు, యూ నిఫారాలు ,అందించడంతో పాటు నాణ్యమైన విద్య పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వసతి గృహాలో అందిస్తున్న సౌకర్యాలపై కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ మీటింగ్ తల్లిదండ్రులు హాజరై పిల్లలతో కలిసి ఒక పూట బోజనం చేసేలా అన్ని వసతి గృహాలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.



విద్యార్థులలో పెరుగుతున్న మానసిక బావోద్యేగి సమస్యలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు కలిసి వారికి మానసిక ధైర్యం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న సబ్జెక్టులను ఎంపిక చేసుకుని ,తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత లక్ష్యాలను సాదించాలని కలెక్టర్ ప్రోత్సహించారు. తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి సంక్షేమ వసతి గృహాలలో అందుతున్న నాణ్యమైన విద్య, పౌష్టికాహారం , ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 2025 26 విద్యాసంవత్సరంలో 5,6,7,8,9 తరగతుల్లో ప్రథమ ,ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాదించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బిసి సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ప్రిన్సిపాల్ రజని , అసిస్టెంట్ ప్రిన్సిపాల్ స్రవంతి, డిప్యూటీ వార్డన్ జ్యోతి తల్లిదండ్రులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్టాండ్ల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు

### జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/మెదక్ :** టిజిఎస్ ఆర్‌టీసీ జెఎసి సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రజా రవాణా సేవలు అంతరా యం లేకుండా కొనసాగేందుకు బస్టాండ్ల వద్ద భద్రతను బలోపేతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి డి వి శ్రీనివాస్ రావు గురువారం జిల్లా కేంద్రం లోని ఆర్‌టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిపో మేనేజర్ సురేఖతో ఎస్‌పి మాట్లాడి బస్సుల రాకపోకలు, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సేవలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజా రవాణాకు ఆ టంకం కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరిస్తూ, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డియస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## వేసవి సెలవులను.. సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వేసవి సెలవులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థులకు సూచించారు. సెలవుల ను ఉల్లాసంగా గడుపుతూ ఇష్టమైన రంగంలో ప్రతిభను మరింతగా మెరుగు పర్చుకునేలా కృషి చేయాలని హితవు పలికారు. డిచ్‌పల్లి మండలం సుద్ద పల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు కలెక్టర్ ముఖ్యఅతిథిగా ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. స్విమ్మింగ్, కరాటే, డ్యాన్స్, సంగీతం వంటి వాటిలో తమ అభిరుచికనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వీలైతే చారిత్రక ప్రదేశాలను సందర్శించాలన్నారు. సెలవులను వృధా చేసుకోవద్దని, స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలను జాగ్రత్తగా గమనిస్తుండాలని వారంలో అరగంటకు మించి పిల్లలు స్మార్ట్‌ఫోన్ వినియోగించుకుండా చూడాలన్నారు. బాలికల పట్ల వివక్షత చూపకుండా వారిని ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. రెసిడెన్సియల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థినులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

## 'మై భారత్' కేంద్రం జిల్లా యువతకు సువర్ణావకాశం

### ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ప్రారంభం

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యువతకు వృత్తి పరమైన పని అనుభవాన్ని అందించేందుకు ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిఫ్ పథకం ప్రారంభించబడింది. జిల్లాలోని అర్హులైన యువతీ, యువకులు ,ప్రముఖ కంపెనీలలో శిక్షణ పొందుతూ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్దినియోగం చేసుకోవాలని మై భారత్ కోరుతుంది.

**పథకం ప్రయోజనాలు:** ఆర్థిక సాయం ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 9వేలు స్టైఫండ్ ,ఒకేసారి రూ 6వేలు జాయినింగ్ గ్రాంట్ లభిస్తుంది. శిక్షణ కాలం 6 లేదా 9 నెలల పాటు ఇంటర్న్‌షిఫ్ ఉంటుంది.దేశం లోని అగ్రశేణి కంపెనీలలో ప్రత్యక్షంగా పని చేసే అవకాశం

**అర్హతలు :** వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలి, ఉద్యోగ స్థితి అభ్యర్థి ప్రస్తుతం ఏలాంటి పూర్తిస్థాయి ఉద్యోగంలో ఉండకూడదు. విద్యార్హత 10వ తరగతి ,ఇంర్మీడియట్, ఐటిఐ డిప్లొమా ,డిగ్రీ **పీజీ చదివిన వారు అర్హులు దరఖాస్తు విదానం :** సంగారెడ్డి జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత, ఆసక్తి ఉన్న రంగాన్ని బట్టి అదికారిక పోర్టల్ నమోదు చేసకోవచ్చు అని సంగారెడ్డి జిల్లా యువజన అదికారి ఎం రంజిత్‌రెడ్డి, కార్యక్రమ అదికారికిరణ్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9963056730 ని సంప్రదించగలరు.

## ఈత సరదా.. ప్రాణాంతకం కావొద్దు

### జిల్లా ఎస్‌పి నితిక పంత్ హితవు



**ప్రజాపక్షం / రెబ్బన :** వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు ఈతకు వెళ్లే విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి నితిక పంత్ సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లల ఈత సరదా ప్రమాదకరంగా మారే అవకాశముందని ఆమె హెచ్చరించారు. నీటి లోతు తెలియక, నీటిలోకి జారి ప్రాణాలు కోల్పోయే సంఘటనలు జరుగుతున్నందున జాగ్రత్తలు పాటించాలని కోరారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పిల్లలకు ఈత నేర్పించాలనుకుంటే నిపుణులు లేదా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. వేసవిలో అధిక వేడి ఉన్నందున ప్రజలు వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలను ఇంట్లోనే ఉంచి చదువు, ఇతర సృజనాత్మక పనులపై దృష్టి పెట్టేలా చూడాలని కోరారు.

## అదనపు డిసిపి(అడ్మిన్)గా శుభం ప్రకాష్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) గా నగ్రాలే శుభం ప్రకాష్ బాధ్యతలు చేపట్టారు. గురువారం కమిషనర్ కార్యాలయంలో నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్యని మర్యాదపూర్వకంగా నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) నగాలే శుభం ప్రకాష్ పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ అదనపు డిసిపి (అడ్మిన్) ని స్వాగతిస్తు అభినందించారు.



## కల్యాణలక్ష్మీ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తలమడుగు:** తలమడుగు మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు ఆయన ఈ చెక్కులను అందజేశారు.పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు ఆర్థికంగా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. చెక్కుల జారీ ప్రక్రియలో అధికారులు ఎలాంటి జాప్యం చేయకూడదని, దరఖాస్తులను త్వరగా పరిశీలించి సమయానికి లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు.తహసిల్దార్ రాజ్‌మోహన్, ఎంపిడిఓ శంకర్, బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, పాధ్యక్షులు మగ్గిడి ప్రకాష్, ఆత్మచైర్మన్ కొడల నారాయణ, గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## భగీరథుని పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** నిరంతర ప్రయత్నం, అంకితభావం ఉంటే అసాధ్యమైన పనిని కూడా సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాములు, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా కష్టతరమైన పనిని సాధించే క్రమంలో భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకుంటామని తెలిపారు. తలపెట్టిన పని పూర్తయ్యే వరకు ఎంత కాలమైనా నిబద్ధతతో శ్రమించాలని ఆయన ఆచరించి చూపారని కొనియాడారు. భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించడం సంతోషకరమని వెల్లడించారు. జి ల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి , వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌టీసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ

**ప్రజాపక్షం / గజ్వేల్:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మె విరమింప జేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం జిపిపి డిపో వద్ద కార్మికుల ఆందోళనకు మద్దతుగా సంఘీభావ ప్రకటించి వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని, పోస్టుల భర్తీ చేపట్టాలని, ఆర్టీసీలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిని తొలగించాలని, పని భారం తగ్గించాలని పేర్కొన్నారు. అంతే గాకుండా శాంతియుతంగా కార్మికులు ఆందోళన చేపడుతుండగా, పోలీసులచే దౌర్జన్యం చేయించడం సిగ్గుచేటని నిలదీశారు. కార్మికులు ఏర్పాటు చేసుకున్న టెంట్లు తొలగించడం దురదృష్టకరం కాగా, కార్మికుల పొట్టగొట్టే చర్యలను వెంటనే విరమించుకోవాలని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించి బస్సు చార్జీలు పెంచడం తగదని నిలదీశారు. డ్రైవింగ్ రాని వ్యక్తులకు బస్సులను అప్పగించి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, డిపో గౌరవ అధ్యక్షులు నర్సింగరావు, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, సిపిఐ పట్టణ కార్యదర్శి రాజేశం, సంఘ బాధ్యులు నర్సింలు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



## జనగణనన్ను చిత్తశుద్ధితో చేయాలి

### 'గూగుల్ మీట్‌లో' కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/ మెదక్ :** మెదక్ జిల్లా లో జనగణనను పారదర్శకంగా నిర్వహించేందుకు తాసిల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షిలో జనగణన, డ్రైలాండ్‌వెట్ ల్యాండ్ సర్వే, ఆర్టీసీ సమ్మె ప్రభావం, రైతు అవసరాలు, ధాన్యం కొనుగోలు, గ్యాస్ సరఫరా, ఓటర్ మ్యాపింగ్, భూభారతి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర జిల్లా అధికారులతో కలిసి చర్చించారు. జిల్లాలో చెరువులు అన్యాక్రాంతం కాకుండా డ్రైలాండ్‌వెట్ ల్యాండ్ సర్వే వేగవంతం చేయాలని, శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణంలో ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు విత్తనాలు సమర్ధవంతంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు 525 కేంద్రాలు ప్రారంభించి 887 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గృహ వినియోగ గ్యాస్ సరఫరా లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, భూభారతి సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ఖచ్చితత్వంతో వేగవంతం చేయాలని, బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సరిచేయాలని సూచించారు. జిల్లాలో అన్ని కార్యక్రమాలు పారదర్శకంగా, సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పేర్కొన్నారు. గూగుల్ మీట్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బిసిలు అన్ని రంగాల్లో.. రాణించినప్పడే నిజమైన అభివృద్ధి



**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** బీసిలు కేవలం ఒక రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుకు సాగినప్పుడే ఆ వర్గాల నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని నిర్మల్ జిల్లా బీసి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు ఆకాంక్షించారు. బుధవారం నిర్మల్ జిల్లా బీసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన , జిల్లా కోర్టు జిపి గా కొనసాగుతున్న బి.శుభకరణ్‌ను ఘనంగా సన్మానించారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన ఒక సామాన్య కుటుంబం నుండి కష్టపడి పైకి వచ్చి నేడు అత్యున్నత స్థాయికి ఎదిగిన శుభకరన్ గారు జిల్లా ప్రజలందరికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. సామాన్య స్థాయి నుండి ఎదిగి ప్రజలకు ఆదర్శంగా నిలిచిన శుభకరణ్ గారు రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదువులను ఆధిరోహించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## నిర్మల్, భైంసా డిపోల ముందు ఆర్‌టిసి కార్మికుల గర్జన



**ప్రజాపక్షం/ నిర్మల్ రూరల్ :** తమ న్యాయమైన హక్కుల సాధన కోసం టి.ఎస్.ఆర్.టి.సి. కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె రెండో రోజున మరింత ఉధృతమైంది. ఇందులో భాగంగా భైంసా డిపో ముందు నిర్మల్ మరియు భైంసా డిపోలకు చెందిన కార్మికులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించి ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేశారు. విధులను బహిష్కరించి రోడ్లపైకి వచ్చిన కార్మికులు, తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భైంసా డిపో జేఏసి చైర్మన్ జి.గంగయ్య సభ్యులు కె. రాజన్న, బండారు సాయన్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసి కార్మికులు కీలక పాత్ర పోషించారని కానీ నేడు అదే కార్మికులు తమ హక్కుల కోసం రోడ్డెక్కడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 45 వేల మంది ఆర్టీసి కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సంస్థను పూర్తి స్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న డి.ఏ.లు, పి.ఎఫ్. నిధులు మరియు పదవీ విరమణ ప్రయోజనాలు అందక కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ వేతన దోపిడిని అరికట్టాలని కోరారు. ముఖ్యంగా మహాలక్ష్మీ పథకం నిధులను సకాలంలో విడుదల చేసి సంస్థను నష్టాల నుండి గట్టెక్కించాలని, ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టి ప్రజా రవాణా వ్యవస్థను కాపాడాలని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసి ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో కార్మికుల్లో మరింత ధైర్యం నెలకొంది. పేదవాడి రవాణా సాధనమైన ఆర్టీసి బతికితేనే సామాన్యులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం మొండి వైఖరి వీడి వెంటనే కార్మిక సంఘాలతో చర్చ లు జరపాలని నేతలు డిమాండ్ చేశారు. విద్యార్థులు, ప్రజా సంఘాలు మరియు ఉద్యమకారులు ఈ బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్బంద చర్యలకు దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ, తమ న్యాయమైన కోర్కెలు తీరే వరకు ఈ ధర్నాలు మరియు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఆర్‌టిసి కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం

### మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/మెదక్ :** ఆర్‌టీసీ కార్మకులు తమ న్యాయమైన డిమాండ్లను, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె రెండవ రోజు కొనసాగింది. గురువారం మెదక్ ఆర్టీసీ డిపో వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్ లో సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ జడ్పీవైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, బిఆర్ఎస్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులతో కలిసి కార్మికులకు సంఘీభవం తెలిపారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను ఆరెస్ట్ చేయడం అప్రజాస్వామికం వారికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అంటూ పోలీసులపై ఆగ్రహ వ్యక్తం చేడటశారు. మెదక లో మా త్రమే టెంట్ లేకుండా కార్మికులను ఎండలో కూర్చోబెట్టడం ఏమిటని ప్రశ్నించిన ఆమె తెలంగాణలో 'ఎక్కడ లేని రూ ల్స్ ఇ క్కడ ఎందుకు?' అంటూ అధికారులను నిలదీశారు. మహిళా కార్మికులను కూడా ఆరెస్ట్ చే యడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్ర భుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడ ంలో పూర్తిగా విఫలమైందని, ముఖ్య మంత్రి రేవ ంత్ రెడ్డి పరిపాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.' బిఆర్ఎస్ పార్టీ కార్మికులకు అండగా ఉం టు ంది. వా రి కోసం రోడ్డు మీద కైనా వస్తాం' అం టూ స్ప ష్టం చేశారు. సమ్మెను నిర్లక్ష్యం చేయకుండా త క్షణమే చర్చలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఎంసి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిల్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు సోహెల్ జుబేర్, దీ పక్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మ న్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ గౌడ్, వెంకటేశం, కాశీనాథ్,రావు, అంజి రెడ్డి, వేణు, సాయికుమార్, రంజిత్, స్వామి నాయక్, యంబిపూర్ మహేష్, చంద్ పాషా, ఆర్టీసీ జేఏసీ నాయకులు, సంఘ నాయకులు, ఉన్నారు.





## నేర ప్రవృత్తి వీడి.. ఉత్తమ పౌరులుగా జీవించాలి

### ఎస్ఐ ఉదయ్ కిరణ్



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు గురువారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన సంబంధిత వ్యక్తుల ప్రవర్తన తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. చట్టపరమైన నియమ నిబంధనలు పాటిస్తూ మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. భవిష్యత్తులో ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడినా కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రవర్తన మార్చుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది పాల్గొని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల వివరాలను నమోదు చేసుకున్నారు.

# లక్నోపై రాజస్థాన్ గెలుపు

## రాణించిన ఆర్చర్, జడేజా

వరుసగా రెండు ఓటముల తర్వాత రాజస్థాన్ రాయల్స్ గెలుపు బాట పట్టింది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 40 పరుగుల తేడాతో నెగ్గింది. రాజస్థాన్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనలో లక్నో 18 ఓవర్లలో 119 రన్స్‌కు ఆలౌట్ అయ్యింది. మిచెల్ మార్ష్ (55 పరుగులు) ఒక్కడే రాణించాడు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, బర్గర్ 2, బ్రిజేష్ శర్మ 2, జడేజా, బిష్ణోయ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (43 పరుగులు) టాప్ స్కోరర్. యశస్వీ జైస్వాల్ (22 పరుగులు) వేగంగా ఆడే క్రమంలో ఔట్ అయ్యాడు. వైభవ్ సూర్యవంశీ (8) ఈసారి విఫలమయ్యాడు. ధ్రువ్ జురెల్ (0) డకౌట్ అయ్యాడు. రియాన్ పరాగ్ (20 పరుగులు), హెట్‌మయర్ (22 పరుగులు), డొనోవన్ (20 పరుగులు), శుభమ్ దూబే (19పరుగులు) ఫర్వా లేదనిపించారు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, షమీ, మోహ్సిన్ ఖాన్ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో రాజస్థాన్ పట్టికలో రెండో స్థానంలోకి దూసుకొచ్చింది. ఇప్పటిదాకా ఏడు మ్యాచ్‌ల్లో ఐదింట్లో నెగ్గింది. దీంతో 10 పాయింట్లతో రెండో ప్లేస్‌లో కొనసాగుతోంది. మరో వైపు, అన్నే మ్యాచ్‌లు ఆడిన లక్నోకు ఇది ఐదో ఓటమి. తొలి మూడు మ్యాచ్‌ల్లో రెండింట్లో నెగ్గిన లక్నో, తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడింది.



# ఒకే గ్రూపులో భారత్, బంగ్లా

## మే 25 నుంచి సాఫ్ టోర్నీ

**మార్గవో:** దక్షిణాసియా ఫుట్బాల్ సమాఖ్య(సాఫ్) మహిళల టోర్నీకి వేళయింది. మార్గవో(గోవా) వేదికగా మే 25 నుంచి జూన్ 6వ తేదీ వరకు టోర్నీ జరుగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ను బుధవారం ఢాకా(బంగ్లాదేశ్)లో విడుదల చేశారు. టోర్నీలో మొత్తం ఆరు జట్లు బరిలో ఉన్నాయి. ఆతిథ్య భారత్ సహా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవులు పోటీపడుతున్నాయి. ప్రస్తుత ఫిఫా ర్యాంకింగ్స్ను అనుసరించి గ్రూపులను ప్రకటించారు. ఐదుసార్లు చాంపియన్ భారత్, బంగ్లాదేశ్, మాల్దీవులు గ్రూపుబీలో ఉన్నాయి. టోర్నీలో రికార్డు స్థాయిలో ఆరోసారి టైట్పి కన్నేసిన భారత మహిళల జట్టుకు డిఫెండింగ్ చాంపియన్ బంగ్లా నుంచి దీటైన పోటీ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2016 తర్వాత రెండోసారి ఆతిథ్యమిస్తున్న భారత్..మరోమారు టైటిల్ లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నది.



# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## కంటిలో ఏ కణాలు రంగుల వ్యత్యాసాన్ని గుర్తించగలవు?

- 'మా' నది భూటాన్ లో ఉంది. మరి 'పో' నది ఎక్కడ ఉంది?
  ఇటలీ
- కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఎక్కడ ఉంది?
  ఖమ్మం
- భారత రాజ్యాంగం భారతదేశాన్ని ఏ విధంగా వర్ణించింది?
  రాష్ట్రాల యూనియన్
- ఆఫ్రికాలోని ఎత్తయిన పర్వతమేది?
  కిలిమంజారో పర్వతం
- 'విచిత్రచిత్త' అని పిలిచే పల్లవ రాజు ఎవరు?
  మహేంద్రవర్మ
- 'జనాశ్రయ' గ్రంథాన్ని ఎవరు రచించారు?
  మల్లియరేచన
- గవర్నర్ అధికార నివాసగృహం ఏది?
  రాజభవన్
- రాజ్యసభలో సభ్యుల గరిష్ట సంఖ్య ఎంత?
  250
- ఏ రాష్ట్రం ద్వారా కర్కాటక రేఖ వెళుతుంది?
  ఝార్ఖండ్
- ఎయిర్ ట్రాన్స్పోర్ట్ పరిశ్రమను ఎప్పుడు జాతీయం చేశారు?
  1953
- భూమి చుట్టుకొలత ఎంత?
  40,000 కి.మీ.
- శాస్త్రీయ పద్ధతిలో పాలలోని బ్యాక్టీరియాను నశింపజేసే పద్ధతి
  పాశ్చరైజేషన్
- చివరి పీష్వా ఎవరు?
  రెండో బాజీరావు
- కంటిలోని ఏ గ్రంథి పనితీరుకు విటమిన్ ఎ అవసరం?
  లాక్రిమల్
- ఉక్రెయిన్లోని నికోపాల్ నిక్షేపాల్లో ఉన్న లోహమేది?
  మాంగనీస్
- 'శ్యాద్వాదచల సింహ' అనే బిరుదు ఎవరిది?
  సోమదేవసూరి
- చట్టప్రకారం ఆర్థిక సంఘాన్ని నియమించే అధికారం ఎవరికి ఉంది?
  భారత రాష్ట్రపతి
- ఈశాన్య రుతుపవనాల వల్ల ఎక్కువగా వర్షపాతం పొందే ప్రాంతమేది?
  తమిళనాడు సముద్ర తీరం
- అరటి పంటను దేనితో వ్యాప్తి చేస్తారు?
  పిలకలు
- చైతన్యపురి సమీపంలోని మూసీనది తీరంలో లభించిన ప్రాకృత శాసనం ఎవరిది?
  గోవిందవర్మ
- మన రాష్ట్రంలో జిల్లా పారిశ్రామిక కేంద్రాలు ఎప్పుడు ప్రారంభించారు?
  1978
- నీరాంచల్ పథకాన్ని ఏ రంగ అభివృద్ధికి ప్రారంభించారు?
  వాటర్‌షెడ్
- కాలానికి ప్రమాణం
  సెకను
- 'ఉపాధిహామీ' దేనికి సంబంధించినది?
  పనులు లేని సమయాల్లో గ్రామీణ నిరుపేదలకు పని కల్పించడం



- కంటిలో ఏ కణాలు రంగుల వ్యత్యాసాన్ని గుర్తించగలవు?
  కోన్స్
- ఇక్ష్వాకుల కాలంలో రోమన్ నాణేలు ఎక్కడ లభించాయి?
  నాగార్జునకొండ
- రామమోహన్ రాయ్‌కు 'రాజా' అనే బిరుదు ఇచ్చిన మొగలు చక్రవర్తి ఎవరు?
  రెండో అక్బర్
- 2013–14లో ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం ఎంత? (మిలియన్ హెక్టార్లలో)
  126
- ముస్లిం లీగ్ ప్రత్యక్ష కార్యాచరణ దినాన్ని ఏ రోజున పాటించింది?
  1946, ఆగస్టు 16
- కింది ఏ గవర్నర్ జనరల్‌కు 'డాక్ట్రిన్ ఆఫ్ ల్యాప్స్'తో సంబంధం ఉంది?
  డల్హౌసీ
- ఆస్ట్రేలియాలో అతి పెద్ద బాక్సైట్ క్షేత్రం ఎక్కడ ఉంది?
  వైపా
- భారతదేశంలో మొదటి మహిళా ముఖ్య మంత్రి ఎవరు?



  సుచేతా కృపలానీ
- రాష్ట్రంలో మంత్రిమండలి సమావేశం ఎవరి అధ్యక్షతన జరుగుతుంది?
  ముఖ్యమంత్రి
- ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం సుప్రీం కోర్టు ఏ ప్రకరణ (ఆర్టికల్) ప్రకారం రిట్లను జారీ చేస్తుంది?
  32
- ఇటీవల మహాత్మాగాంధీ కాంస్య విగ్రహాన్ని లండన్‌లోని బ్రిటన్ పార్లమెంట్ స్క్వేర్ వద్ద ఆవిష్కరించారు. గాంధీ విగ్రహ స్మారక ట్రస్టు వ్యవస్థాపకుడు ఎవరు?
  లార్డ్ మేఘనాథ్ దేశాయ్
- శ్రీలంక తన పేరును సిలోన్ నుంచి ఏ సంవత్సరంలో మార్చుకుంది?
  1972
- యునెస్కో ((UNESCO) కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
  ప్యారిస్
- విష్ణుకుండినుల కులదైవం ఎవరు?
  శ్రీపర్వతస్వామి
- 'మంచి నేలబొగ్గు'కు కింది ఏ గుణం ఎక్కువగా ఉండాలి?
  స్థిరమైన కార్బన్
- ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టంలో ఎన్ని ఉపగ్రహాలు ఉంటాయి?
  7
- ప్రాథమిక హక్కులను రద్దుచేసే అధికారం ఎవరికి ఉంది?
  రాష్ట్రపతి
- 1962లో పర్యావరణం కోసం 'నిశబ్ద వసంతం' రాసిన గ్రంథకర్త ఎవరు?
  రేచెల్ కార్సన్
- కిందివాటిలో దేని గురించి భారత రాజ్యాంగం పేర్కొనలేదు?
  ఆపద్ధర్మ, సంకీర్ణ, స్థిర ప్రభుత్వం
- 'సిక్' అనే పదానికి అర్థం ఏమిటి?
  శిష్యుడు
- భారత రాష్ట్రపతి ఏ ఆర్టికల్ ప్రకారం సుప్రీంకోర్టును సలహా కోరవచ్చు?
  143

## ఉపాధ్యాయులకు రెండవ పిఆర్‌సి ప్రకటించండి

### ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఉపాధ్యాయులకు రెండవ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) ద్వితీయ కార్యవర్గ సమావేశం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్, పూర్వ అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక, పెండింగ్ బిల్లులు చెల్లించనందున ఇబ్బందులు పడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులు ఆగచాట్లు తీరాలంటే 51శాతం ఫిట్మెంట్‌తో రెండవ పిఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మేనిఫెస్టోలో పేర్కొన్న సమస్యలపై తాత్సరం చేయడం తగదన్నారు. వచ్చేనెల 5న ఒకరోజు నిరాహార దీక్ష రాష్ట్రవ్యాప్తంగా చేయనున్నట్లు అప్పటికి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన గలం బలంగా వినిపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో గత నెలలో పదవీ విరమణ చేసిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వడ్డే హనుమంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం మురళిని ఘనంగా సన్మానించారు.

## కొత్త లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ప్రపంచ కార్మిక దినోత్సవంను పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ 189 డివిజన్ యాప్రాల్‌లో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రవిచంద్రన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను హరిస్తోందని విమర్శించారు. ఈ విభజన వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే ఆ నాలుగు కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా కార్మికులందరూ చైతన్యవంతులై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అసంఘటితరంగ కార్మికుల సంక్షేమం కోసం ఒక సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ అల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ సింగ్, మేడ్చల్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు వై.వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, సిపిఐ మండల సీనియర్ నాయకులు పి.చంద్రయ్య, సురేష్, నర్సింగ్, సాయిలు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలి

### ఆర్‌టిసి జెఎసి నాయకుడు అశ్వథామరెడ్డి


ఎల్‌బి నగర్...


కుత్బుల్లాపూర్...

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆర్‌టిసి కార్మికులు వారి సమస్యలపై నిరసన తెలిపే హక్కులను ప్రభుత్వం హరించడం హేయమైన చర్య అని, కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా నిరసన చేసే కార్మికులను అరెస్టు చేయడం దారుణమని ఆర్‌టిసి జెఎసి నాయకులు అశ్వథామరెడ్డి విమర్శించారు. గురువారం హయత్ నగర్ డిపో వద్ద కార్మికుల ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని, కార్మికులకు రావాల్సిన పే స్కేల్స్, పే ఏరియర్స్, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ప్రభుత్వం కార్మికుల సంఘాలతో చర్చలు జరిపి వారి డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డిపో జెఎసి కన్వీనర్లు అమనగంటి వెంకన్న, మల్లేష్, పి.కృష్ణయ్య, లక్ష్మీ కాంత్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం హేయం

ఆర్‌టిసి కార్మికుల హక్కుల కోసం ప్రజా సంఘాలు మద్దతుగా నిరసన తెలిపితే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హయత్ నగర్ పోలీసులు డిపో ముందు నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులను అరెస్టు చేశారు. అనంతరం వారి వ్యక్తిగత పూచికతో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్‌గౌడ్ ఉన్నారు.

**పెద్దపల్లి :** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ మద్దతు తెలుపుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని ఆర్టీసీ డిపో దగ్గర కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ తో కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, టి.రమేశ్ కుమార్, ఎజ్జా రాజయ్య, నవీన్, తిరుమల, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** ఆర్‌టిసి కార్మికుల రెండో రోజు సమ్మెలో బాగంగా గురువారం సంగారెడ్డి డిపో ఎదురుగా జరిగిన కార్మికుల అందోళనకు సిపిఐ, ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.ఎ.రెహమాన్ మాట్లాడుతూ సమ్మెవల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దాన్ని కార్మికులకు నెట్టడం అన్యాయమని దాని బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది కాబట్టి వెంటనే చర్చలకు పిలిచి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌ఖాన్, శివశంకర్, లక్ష్మి, గడ్డం కిరణ్, కుమార్, విక్రమ్ కుమార్ పాల్గొన్నారు.

**మహబూబ్ నగర్:** ఆర్‌టిసి కార్మికుల రెండో రోజు కొనసాగిన సమ్మెలో జెఎసి పిలుపులో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూబస్టాండ్ డిపో ఎదుట కార్మికులతో కలిసి ఎఐటియుసి నేతలు మహాధర్నా ర్యాలీలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి సమ్మె పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్మికుల లేవనెత్తిన న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించి కార్మికులు చేస్తున్న సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు.

**మధిర :** ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సకల జనుల సెగ తప్పదని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు హెచ్చరించారు. గురువారం మధిర ఆర్‌టిసి డిపో వద్ద జరిగిన కార్మికుల సమ్మెకు వారు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టిసి ఉద్యోగులు, కార్మికులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. రెండో రోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరుగుతున్న ఆర్‌టిసికార్మికుల సమ్మెలో భాగంగా డిపో ముందు కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొని డిపో నుండి బయటికి బస్సులు రాకుండా అడ్డుకున్నారు. సమ్మెకు ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ, సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సతీష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ ,జోసెఫ్ జోగేష్ ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌టిసి కార్మికుల సమ్మె రెండో రోజు సందర్భంగా జీడిమెట్ల డిపో ఎదుట నిర్వహించిన ఆందోళనకు సిపిఐ, ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం చేస్తామని, పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సిలను అమలు చేస్తామని, యూనియన్‌లను పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా వాటి అమలులో పురోగతి కనిపించలేదని విమర్శించారు. సమ్మె కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కార్మికులపై నెపం మోపడం సరికాదని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి, ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు, మండల సహాయ కార్యదర్శి హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, నాయకులు శ్రీనివాస్, జెఎసి నాయకులు రాజు, డానియల్, గోవర్ధన్, గీత, ఖయ్యూం, రాజేష్, నారాయణ పాల్గొన్నారు.

**నర్సంపేట:** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట ఆర్‌టిసి బస్సు డిపో వద్ద కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం గోవర్ధన్, వేముల రవి, ఓరుగంటి కొమ్మాలు, గోలనకొండ వేణు, పులిశెట్టి రంగయ్య, డిఆర్ కుమార్, శ్రీలత, పుష్పలీల, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


భూపాలపల్లి...


మధిర...


నర్సంపేట...



మహబూబ్‌నగర్...


పెద్దపల్లి...


సంగారెడ్డి...

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో ఆర్టీసీ కార్మికులు 52 రోజులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేశారని ఇప్పుడు అవే సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారన్నారు. అప్పుడు సమ్మెకు కాంగ్రెస్ మద్దతునిచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను మేము అధికారంలోకి రాగానే చేపడతామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దానిని పక్కదారి పట్టించే ప్రయత్నం ఎందుకు చేస్తుందన్నారు. ప్రభుత్వ తీరు పట్ల కార్మికులు మనో వేదనకు గురై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చారని ఇందుకు వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్ ఎదుట ఆర్టీసీ డ్రైవర్ నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడమే ఇందుకు నిదర్శనమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. లేని పక్షంలో కార్మికులతో పాటు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## మొక్కజొన్న పంట దగ్ధం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలో ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెంలో గురవయ్య అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న నేలకొండపల్లి ఫైరింజన్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత రైతు దాదాపు రెండు ఎకరాలు మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు పేర్కొన్నారు.

## ఖమ్మం కలెక్టరేట్ వద్ద మొక్కజొన్న రైతుల మహాధర్నా

'నేడు' భారీ సమీకరణకు పిలుపు

**ప్రజాపక్షం/కారేపల్లి:** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల సమస్యలపై నేడు ఉదయం 10గంటలకు ఖమ్మం కలెక్టరేట్ వద్ద రైతుల మహాధర్నా, ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ మండల నాయకులు, మాజీ దిశ కమిటీ సభ్యులు లకావత్ లక్ష్మణ్ అన్నారు. ఈ ధర్నాకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఖమ్మం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకట వీరయ్య, జిల్లా మాజీ ప్రజాప్రతిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇంచార్జులు, పార్టీ శ్రేణులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. సింగరేణి మండలంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు, అలాగే అన్ని గ్రామాల మొక్కజొన్న రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 25 నుంచి 'జెవివి' సమ్మర్ క్యాంపు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 25 నుంచి 30 వరకు జెవివి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. మోహన్, కె. రామారావు లు గురువారం తెలిపారు. ఖమ్మం ఎన్నెస్పి క్యాంపులోని నిర్మల్ హృదయ్ స్కూల్‌లో విద్యార్థులకు ఈనెల 25 నుంచి 30 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 10 గంటల వరకు క్యాంపు జరుగుతుందన్నారు. 25న డ్రాయింగ్, 26న చేతిరాత, 27న సైన్స్, 28న లాంగ్వేజ్, 29న పాటలు, 30న మ్యూజిక్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆరు నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఈ క్యాంపులో పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు వి. మోహన్, కె. రామారావు, కోశాధికారి టి. శివన్నారాయణ, క్యాంపు ఇంచార్జి రమేష్ లు తెలిపారు.

## యశోదలో గొంతు క్యాన్సర్‌కు అరుదైన చికిత్స

వైద్యులు ప్రదీప్ కారుమంచి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో గొంతు క్యాన్సర్‌కు అరుదైన రేడియేషన్ థెరపీ చికిత్స అందిస్తున్నట్లు ప్రముఖ వైద్యులు ప్రదీప్ కారుమంచి తెలిపారు. గురువారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు ప్రదీప్ కారుమంచి మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతానికి చెందిన 86 ఏళ్ల వృద్ధురాలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గొంతు నొప్పితో బాధపడుతూ సోమాజిగూడ యశోద ఆసుపత్రిని సంప్రదించారని ఆయన తెలిపారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె గొంతులో ఓ పెద్ద కణితి శ్వాస మార్గానికి అడ్డుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆమెకు అత్యవసరంగా ట్రాకియోస్టమి (శ్వాస నాళికను తెరవడం) చేశామన్నారు. ఆమెకు తదుపరి పరీక్షల్లో హైపోఫారింజియల్ క్యాన్సర్ స్వరపేటికకు (లారింక్స్) వ్యాపించి అడ్డంకి కలిగిస్తున్నట్లు తేలిందన్నారు. ఆమెకు వృద్ధాప్యం, ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఉపశమన చికిత్స మాత్రమే చేయగలమని నయం చేయడం కష్టమని గుర్తించామన్నారు. ఆమెను ఐసియులో ఉంచి క్యాన్సర్ నిర్ధారించడానికి పిఈటిసిటి స్కాన్, బయాప్సీ పరీక్ష చేయించినట్లు తెలిపారు. ఆమె వయస్సు, ఆరోగ్య పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ఆమెకు రేడియేషన్ థెరపీ ఒకటే మార్గమని గుర్తించి ఆమెకు హైపోఫ్రాక్షనేటెడ్ రేడియో థెరపీ చికిత్స అందించినట్లు తెలిపారు. ఆమె చికిత్స అనంతరం క్రమంగా తీవ్ర అనారోగ్యం నుండి కోలుకుని మరల నడవడం ప్రారంభించిందన్నారు. మూడు నెలల తర్వాత మరల ఆమెను పరీక్షించగా క్యాన్సర్ నుంచి పూర్తిగా విముక్తి పొందినట్లు వైద్యులు ప్రదీప్ తెలిపారు. సోమాజిగూడ యశోదలో మెదడు కణతులు, ప్రోస్టేట్, ఊపిరితిత్తులు, కాలేయ క్యాన్సర్ వంటి వాటికి ఐదు రోజుల్లో క్యాన్సర్ చికిత్స, ఆసుపత్రుల సందర్శనలను తగ్గించడం, రోగి ఒత్తిడిని తగ్గించడం, దుష్ప్రభావాలు లేకుండా చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. 90ఏళ్ల వయస్సు గల రోగులకు కూడా సురక్షితంగా చికిత్సలు చేయవచ్చునని తెలిపారు. ఎంఆర్ఎల్ఐఎనేసితో ప్రపంచ క్యాన్సర్ సంరక్షణలో భారతదేశం పెద్ద ముందడుగు వేసిందన్నారు. అంకాలజీ విభాగంలో ఎంఆర్ఎల్ఐఎనేసి ఓ గొప్ప వరమన్నారు. యశోద సోమాజిగూడ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ఖమ్మం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు వినీత్ ఇలాపురం, శ్రీధర్‌రావు, బాలకృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

# రెండో రోజూ ఆర్టీసీ కార్మికుల నిరసన గళం

తాత్కాలిక సిబ్బందితో బస్సులు తిప్పుతున్న యాజమాన్యం

నీడ కోసం వేసుకున్న టెంటు తొలగించిన పోలీసులు




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా భద్రాచలం డిపో ప్రాంగణంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గేటు ముందు భైఠాయించి నినాదాలు చేశారు. కార్మికులు శాంతియుతంగా చేస్తున్న సమ్మెకు అంతా మద్దతు తెలపాలని నేతలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను కాపాడే ఆర్టీసీ కార్మికుల జీవితాలతో పాలకులు చెలగాటం ఆడుతున్నారని పలువురు నేతలు మండిపడ్డారు. కార్మికులు సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ మానిరెడ్డి శివాజీ, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి కార్మికులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయకుండా పాలకులు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా కార్మికులు విధులు బహిష్కరించి రోడ్డు ఎక్కితే ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మికులతో చర్చలు జరిపేందుకు కూడా ముందుకు రాకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా కార్మికులకు ఇచ్చిన హామీలను పాలకులు నిలుపుకోవాలని కోరారు. అదే విధంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు దేపంగి రమణయ్య, రావులపల్లి ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సును పాలకులు పక్కదారి పట్టిస్తున్నారని, ప్రభుత్వం పంతానికి పోయి ఓట్లు వేసి గెలిపించి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక జేఏసి నేతలచో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు.

**బస్సులు తిప్పుతున్న తాత్కాలిక సిబ్బంది :** కార్మికుల సమ్మె కారణంగా బస్సులు నిలిచిపోకుండా యాజమాన్యం జాగ్రత్తలు పడుతోంది. తాత్కాలిక పద్ధతిన భద్రాచలం డిపోలో డ్రైవర్లు, కండక్టర్లను నియమించి బస్సులను తిప్పుతున్నారు. కొన్ని బస్సులు కండక్టర్లు లేకుండానే తిరుగుతున్నాయి. కార్మికులు నీడ కోసం ఏర్పాటు చేసుకున్న టెంట్‌ను పోలీసులు రాత్రికి రాత్రే తొలగించడంతో పట్టణంలో తీవ్ర చర్చసాగింది. డిపో పరిధిలోని కార్మికులు వచ్చి ఆందోళన చేయకుండా పోలీస్ ఆంక్షలు విధించారు. డిపో సమీపంలో ఉన్న ఆటో స్టాండ్ ప్రదేశంలో వేసుకున్న టెంటును తొలగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. శాంతియుత నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు ఇలా వ్యవహరించడం దారుణమని కార్మికులు ఆవేదనవ్యక్తం చేశారు. నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కూడా కాలరాయడం దారుణం అని అంటున్నారు.

**మణుగూరు కార్మికుల ముందస్తు అరెస్టు :** మంత్రి పొంగులేటి పర్యటనను పురస్కరించుకుని మణుగూరు డిపోకు చెందిన కార్మికులను ముందస్తు అరెస్టుచేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి చాలాసేపటి తర్వాత పూచికత్తుతో విడిచిపెట్టారు. మణుగూరు డిపో పరిధిలో కార్మికులు రెండో రోజు కూడాసమ్మెలో పాల్గొని శాంతియుత నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు పలువురు సంఘీ భావం ప్రకటించి మద్దతు తెలిపారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. అరెస్టులను ఖండించింది. ఇల్లెందు డిపో పరిధిలో కార్మికుల చేస్తున్న సమ్మె శాంతియుతవాతావరణలో సాగుతోంది. కార్మిక సమ్యల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను విరించేదే లేదని నేతలు శపథం చేస్తున్నారు. సిపిఐ నాయకులు సమ్మె వద్దకు చేరుకుని మద్దుతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

## విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

ప్రతీ విద్యార్థి ఉన్నతస్థాయికి చేరేలా సదుపాయాలు

మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/మణుగూరు :** ప్రభుత్వం విద్యావైద్యం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రెవెన్యూ, సమాచార, పౌర సంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని లంక మల్లారంలో గురువారం మంత్రి బిటి రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. టిటిఆర్‌జెసి బాలికల డార్మెటరీ హాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పినపాక, భద్రాచలం ఎమెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డా.తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బిటి రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బిటి రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇటీవలే రూ. 2.70 లక్షలతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్యాలయాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాణ్యమైన భోజనాన్ని వసతిగృహాల్లో అందిస్తున్నామని, పోషకాహారంతో కూడిన మెనూ అమలు చేస్తున్నామని చెప్పారు.వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూనెం రమేష్, పాఠశాల్ ప్రిన్సిపల్ రాణి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ గురువారం ప్రజాదర్బార్

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ప్రతీ గురువారం ప్రజా దర్బార్ నిర్వహిస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. గురువారం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కమిటీ మొట్టమొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు మహ్మద్ జా విద్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహీద్ హుస్సేన్ సతీమణి గౌసియా హుస్సేన్, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు మృతిపట్ల కమిటీ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రతీ గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో చేపడుతున్న అభివృద్ధి, వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రతి గ్రామంలో ప్రతి గడపకు చేరవేయాలని నాయకులకు సూచించారు. రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మి నర్సింహారావు, మలీదు హైమావతి, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కాపా సుధాకర్, కళ్లేం వెంకటరెడ్డి, ప్రధాన కా ర్యదర్శులు కిలారు అనిల్‌కుమార్, సయ్యద్ ముజాహీద్ హుస్సేన్, వెంకటనర్సయ్య, రామసహాయం హరితారెడ్డి, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణశాఖ, మండల, గ్రామస్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వివిధ దఫాలుగా లబ్ధిదారులు ఖాతాల్లో జమ కావాల్సిన బిల్లులు జమ కావడం లేని, వెంటనే సరిచేయాలన్నారు. స్థానిక పరిధిలో సమస్యలు ఇక్కడే పరిష్కరించుకోవాలని, రాష్ట్రస్థాయిలో పెండింగ్ సమస్యలు తక్షణమే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. బిల్లుల విషయంలో పేద లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, హౌసింగ్ పిడి రవీంద్రనాథ్, కమిషనర్ సుజాత, ఎంపిడిఒలు, తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ వ్యవస్థ బలోపేతమే ధ్యేయం

అంగన్వాడీ సేవలకు డిజిటల్ శక్తి

సారపాకలో స్మార్ట్ ఫోన్ల పంపిణీ

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** అంగన్వాడీ వ్యవస్థ బలోపేతమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని సారపాకలో గల వాసవి ఫంక్షన్ హాల్‌లో అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం సీడీపీవో రేవతి అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో బాలల భవిష్యత్తుకు పునాది వంటివని, స్మార్ట్ ఫోన్ల ద్వారా సేవల నిర్వహణ మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మారుతుందన్నారు. గర్భిణీ స్త్రీలు, చిన్నారులకు అందే పోషణ, ఆరోగ్య సేవలను సమయానికి అందించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. మండలంలోని 84 అంగన్వాడీ కేంద్రాదలకు ఈ సదుపాయం కల్పించడం ద్వారా ప్రభుత్వ సేవలు వేగవంతం అవుతాయని తెలిపారు. అలాగే అన్ని అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని, ఇప్పటికే పలు భవనాలు నిర్మించామని, త్వరలోనే ఐటీసీ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో సారపాకలో మరో నాలుగు అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అనంతరం సీడీపీవో రేవతి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లతో అంగన్వాడీ కేంద్రాల రోజువారీ కార్యకలాపాల నమోదు సులభతరం అవుతుందని, పిల్లల హాజరు, పోషణ వివరాలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సమాచారం అన్నీ డిజిటల్ రూపంలో నమోదు చేయడం వల్ల పర్యవేక్షణ మెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ శాఖ డీఈ టి. వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉదయ్ కిరణ్, సూపర్వైజర్లు సక్కుబాయి, స్వరాజ్యం, పోషణ అభియాన్ మండల కోఆర్డినేటర్ శంకర్, సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ లీడల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహమూద్ ఖాన్, జిల్లా కార్యదర్శి వరాల వేణు, సర్పంచ్‌లు మంద నాగరాజు, మంగమ్మ, పోతునూని సూరమ్మ, పంచాయితీ కార్యదర్శి మహేష్, మాజీ మండల అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఇంగువ రమేష్, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, భజన ప్రసాద్, దునుకు రాము, ఎడమకంటి పిచ్చిరెడ్డి, తిరుపతి చంటి, కాటం వెంకట్రామిరెడ్డి, దుగ్గెంపూడి సుశాంత్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ, ఫోన్ మోజులో పడి బలవుతున్న బాలికలు

మహిళల అక్రమ రవాణా నివారణ అందరి బాధ్యత

సిడిపిఒ మెహరున్నిసా బేగం




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** యుక్త వయసు బాలికలు ప్రేమ, ఫోన్ మోజులో పడి మోసపోయి వ్యభిచార గృహాలకు అమ్ముడుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సిడిపిఒ మెహరున్నిసాబేగం. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సత్తుపల్లి మండలం కొత్తూరు రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి సిడిపిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెహరున్నిసా బేగం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరమని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సిడిపిఒ మెహరున్నిసా బేగం పిలుపునిచ్చారు. యుక్త వయసు బాలికలు ప్రేమ, ఫోన్ మోజులో పడి మోసపోయి వ్యభిచార గృహాలకు అమ్ముడుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సమాజంలోని అన్ని వర్గాలతో సన్నిహితంగా ఉంటారని, వారికి ఈ సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆపదలో ఉన్న వారిని గుర్తిస్తే వెంటనే 100, 1098, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పద్మశ్రీ డా. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ప్రజ్వల సంస్థ ఇప్పటివరకు 32,500 మంది బాలికలను, మహిళలను రక్షించి పునరావాసం కల్పించిందని తెలిపారు. లఘు చిత్రాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, గ్రూప్ చర్చల ద్వారా అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. పాఠశాల, గ్రామ స్థాయిలో సమాజ జాగృతి, విద్యార్థి జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉంటే అక్రమ రవాణాను నిరోధించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ భూపాల్ నారి మళ్ళ, సూపర్‌వైజర్లు సుజాత, మహాలక్ష్మి, గంగాజలం, రమాదేవి, రజని, సత్తుపల్లి మండల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పరిశీలన

పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం గోపాలరావుపేట వద్ద రూ.250 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా భూ నిర్వాసితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. విద్యా ప్రమాణాల పెంపునకు ఈ స్కూల్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం బోటిగూడెం, తోగూడెం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక సర్పంచ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎండల్లో ఆరిపోతున్న ధాన్యం

నెరవేరని కలెక్టర్ హామీ !

రామచంద్రాపురం రైతుల ఆవేదన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం నెల్లిపాక సహకార సంఘ పరిధిలోని రామచంద్రాపురం గ్రామ రైతులు వరి ధాన్యం కొనుగోలు విషయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరి కోత పూరై ఇప్పటికే 22 రోజులు గడిచినా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవ దం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. రైతులు వివరాల ప్రకారం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి తేమ శాతం పరీక్షలు కూడా నిర్వహించి ధాన్యం కొనుగోలుకు అనుకూలమని సూచించినప్పటికీ, ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు సక్రమంగా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో సోమవారం రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన కలెక్టర్, రెండు రోజులలో ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారు. అయితే ఆ తరువాత అధికారులు గ్రామానికి వచ్చినప్పటికీ ఎటువంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం రైతుల్లో అసంతృప్తిని పెంచింది. ప్రస్తుతం తీవ్ర ఎండల కారణంగా ధాన్యం పొలాల్లోనే ఆరిపోతుండటంతో, రైతులు భారీ నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టిన ఖర్చులు తిరిగి రావడమే కాకుండా, ధాన్యం నాణ్యత తగ్గిపోవడంతో మార్కెట్‌లో ధరలు పడిపోతాయనే ఆందోళన వ్య క్తం చేస్తున్నారు.

## కల్వర్టు నిర్మాణానికి తొలి అడుగు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ 28వ వార్డులోని శ్రీరామ్‌నగర్‌కాలనీ ప్రధాన దారిలో ఉన్న ఏదులాపురం చెరువు అలుగు కాల్వపై నిర్మించనున్న కల్వర్టుకు మున్సిపల్ అధికారులు గురువారం మార్కింగ్ చేశారు. దీంతో దీర్ఘకాల సమస్యకు తెరపడి, కల్వర్టు నిర్మాణానికి తొలి అడుగుపడింది. ఈ మార్కింగ్ ఏర్పాటును 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కల్వర్టు నిర్మాణాన్ని త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికానికి చదువు అడ్డంకి కాదు: కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/కాటారం;పేదరికం చదువుకు అడ్డంకి కాదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.గురువారం మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సంక్షేమ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తల్లిదండ్రులకు జిల్లాకు మంచి పేరు తీసుకురావచ్చని అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20 నుండి 26 వరకు నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో నాల్గవ రోజు తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రగతి నివేదికలను పంపిణీ చేసారు.ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు విద్యార్థులు భవిశ్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రోత్సహించారు.కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,డిటిడబ్ల్యుఒనాగ సాగర్,ఎంపిడిఓ బాబు,సర్పంచ్ పవిత్ర,పాఠశాల ప్రిన్సిపల్, పాల్గొన్నారు.

## భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ: భూ భారతి పెండింగ్ ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో భూ భారతి, సాదా బైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై జేసి బెన్షాలోమ్‌తో కలిసి సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్‌లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జిపిఒ, పిపిబి, నాలా, తదితర పెండింగ్ దరఖాస్తు పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్‌డిఓలు గోపిరాం, వెంకన్న, అన్ని మండలాల తహశిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాపక్షం/ములుగు:జనగణన...2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం ప్రకాష్ ఎన్యుమరేటర్స్/సూపర్‌వైజర్లకు తెలిపారు. గురువారం మొదటి రోజు మున్సిపాలిటీ ములుగు జనగణన, ఇండ్ల గణన శిక్షణ కార్యక్రమాన్ని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ములుగులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళిక అధికారి మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ మొత్తం 33 ప్రశ్నలతో కూడిన వివరాలు ఉంటాయని ప్రతి ప్రశ్నకు తగిన సమాధానాన్ని సరిగా నమోదు చేయాలన్నారు. తొలుత మే 11 నుండి జూన్ 9 వరకు సర్వే చేపడతామని ఆ తర్వాత రెండవ విడత 2027 ఫిబ్రవరిలో జనాభా గణన సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ములుగు మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తారు. ఏ మధుసూదన్, డి వెంకటేశ్వర్లు పర్యవేక్షకుడిగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో భూక్య లాల్, గణాంకాధికారి హమీద్, మాస్టర్ ట్రైనర్ పాల్గొన్నారు.

## చదువుతోపాటు నైతిక విలువలు నేర్పించాలి: కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రజాపక్షం/నర్సింహులపేట:తల్లిదండ్రులు తమ పిల్లలను ఆదర్శ భావాలతో పెంచాలని,టీచర్లు స్కూల్లో చదివే స్టూడెంట్లకు చదువుతో పాటు క్రీడాలు,నైతిక విలువలు నేర్పించి సమాజంలో వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని హైస్కూల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా పేరెంట్స్,టీచర్ల మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. స్టూడెంట్ల సర్వతోముఖాభివృద్ధికి పేరెంట్స్,టీచర్ల సమన్వయం ఎంతో అవసరమని,ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని నాణ్యమైన విద్యాతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు,యూనిఫాంలు,మధ్యాహ్న భోజన పథకాలను ప్రతి స్టూడెంట్ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీమన్నారాయణ,ఎంఇఒ రామ్మోహన్‌రావు,ఎంపిడిఒ రాధిక,స్థానిక సర్పంచ్ పెదమాముల యాకయ్య,ఉపసర్పంచ్ కాస యాకయ్యలు,వార్డు మెంబర్ ఎల్లావుల ఉప్పలయ్య,మైనోద్దీన్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా 'సర్' మ్యాపింగ్ ప్రక్రియ: కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ: పారదర్శకంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్ఐఆర్ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై జేసి బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 78 శాతం పురోగతి నమోదైందని, దీన్ని త్వరితగతిన 100 శాతానికి చేర్చాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, అధికారులు శ్రీధర్, తహశిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

కాపులకానిపర్తిలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రజాపక్షం/సంగెం/ గీసుకొండ : రైతులకు పంట విక్రయాల్లో ఎ లాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ముం దస్తుగా వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రె డ్డి అన్నారు. గురువారం సంగెం మండలంలోని కాపుల కానిపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాల యం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిధాన్యం, మొక్కజొ న్న కొనుగోలు కేంద్రాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సం క్షేమమే ప్ర ధాన లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమ లు చేస్తోందన్నారు. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే తమ ఉత్పత్తులను విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించా రు. ప్రస్తుత సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**అధికారులకు ఆదేశాలు:**

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఆటంకాలు, అసౌకర్యాలు ఎదురుకాకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ధాన్యం తూకం, రవాణా తదితర విషయాల్లో క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రైతును రాజుగా చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ అంతిమ ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు,రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గీసుగొండ మండలం ఎల్కుర్తి గ్రామంలో గురువారం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు నిరంతరం కొనసాగించాలని అన్నారు.సన్న వడ్లకు రూ 500 బోనస్, రైతు భరోసా, రైతు బీమా, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికపరంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడినిచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు.

## దిగజారుడు రాజకీయాలు వద్దు

ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి హెచ్చరిక



ప్రజాపక్షం/నెక్కొండ:రాష్ట్రంలో, జిల్లాలో, మండల స్థాయిలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నాయకులు కావాలని దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి తీవ్రంగా విమర్శించారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పలరావుపేటలో వాట్ ప్లాంట్ శంకుస్థాపన, పత్తిపాకలో ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అభివృద్ధిపనులతో ముందకు సాగుతున్న సమయంలో కొంత మంది నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు ప్రజల సేవ కోసం ఉండాలని, వ్యక్తిగత విమర్శలు అసత్య ప్రచారాలకు వేదిక కావద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల అభివృద్ధి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా అపోహాలకు లోనుకాకుండా వాస్తవాలను గుర్తించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి దిశగా కలిసి నడిస్తేనే నియోజకవర్గం మరింత ముందుకు వెళ్తుందని పేర్కొంటూ, రాజకీయాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల్ చౌహాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్థానిక సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, రామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు చల్లా శ్రీపాల్ రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, నెక్కొండ పిఏసిఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, నర్సంపేట న్యాయ స్థానం ఏజిపి బండి శివకుమార్, కుసుమ చెన్నకేశవులు, సింగం ప్రశాంత్, కొల్లు వెంకట సుబ్బారెడ్డి, ఆవుల శ్రీనివాస్, చల్ల రఘోత్తం రెడ్డి, నేతుల సారంగపాణి, అప్పలరావుపేట సర్పంచ్ అశోక్, పత్తిపాక సర్పంచ్ సమ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన పాత్రికేయులందరికి అక్రిడేషన్‌లు అందజేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్, అక్రిడేషన్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్య శారద తెలిపారు. వరంగల్ జిల్లా మీడియా అ క్రిడేషన్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడేషన్ కో సం చేసుకున్న వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అక్రిడేషన్ కమిటీ సభ్యులు ప్ర యత్నించాలని ఆమె సూచించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కా ర్డు అందే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. 2026....28 సంవత్సరానికి నూతన కార్డులు జారీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. జిల్లా అ క్రిడేషన్ కమిటీ సభ్యులు వచ్చిన దరఖాస్తలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు మంజూరు చేయడానికి ప్రతిపాదించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. అక్రిడేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఆమె పేర్కొన్నారు. ఎవరు కూడా ఆందోళనకు గురి కాకుండా జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో అప్లయి చేసుకోవాలని జర్నలిస్టులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ ప్రేమలత, వరంగల్ జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు శ్రీరాంచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, బోడిగ శ్రీనివాస్, మట్టా దుర్గా ప్రసాద్, కోదాటిగోపాలకృష్ణ,సోమేశ్వర్, హుస్సేన్ పాషా, బొల్లపల్లి రాజు, పాల్గొన్నా రు.

## పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణ లక్ష్మి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి :పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరం లాంటి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 115 మంది లబ్ధిదారులకు కోటి 15 లక్షల విలువైన చెక్కుల పంపిణీ, మున్సిపాలిటీ పరిధిలో 5,6 24 వార్డుల ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు. అమ్మాయిల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాలపై భారం తగ్గించడమే ఈ పథకాల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందిస్తాం అని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ప్రజలకు ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, తాహసిల్దార్ లక్ష్మి రాజయ్య, ఆర్ఐ రామస్వామి, కౌన్సిలర్లు అప్పం కిషన్, వేముల జ్యోతి శ్రీకాంత్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతు వేదికల వద్దే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

అఖిల భారత రైతు సమాఖ్య (ఎఐకెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్




ప్రజాపక్షం/ నర్సంపేట : ప్రతి రైతు వేదికల వద్దే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జాప్యాన్ని నివారించాలని, మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్న దళారులు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ సూచించారు. ఈ మేరకు ఏఐకేఎఫ్ ప్రతినిధి బృందం జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్, మార్కెటింగ్ అధికారి సురేఖలకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు జరిగినప్పటికీ కొనుగోళ్లకు తగిన ఏర్పాట్లు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో మధ్య దళారీలు ఇదే అదునుగా బావించి క్వింటాకు 16001800కే కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని, కనీస మద్దతు ధర రూ. 2400 అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అన్ని రైతు వేదికల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్నలను బేషరతుగా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎఫ్ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ప్రజా పాలన అభివృద్ధి పథంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నేపథ్యంలో నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి గురువారం 48వ, 30వ డివిజన్‌లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రెండు డివిజన్‌లలో కలిపి సుమారు రూ.2.90 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్ల నిర్మాణాలు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థలు ,ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ప్రాంతీయ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు .పనుల అమలులో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అధికారులకు,కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే స్పష్టమైన సూచనలు చేశారు. అలాగే నిర్ణీత కాల వ్యవధిలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు .ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్య తా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, నియోజకవర్గాన్ని అన్ని రంగా ల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,అధికారులు పాల్గొన్నారు.

## సాఫీగా భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపు

వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేసి, మట్టి తరలింపు ప్రక్రియను సాఫీగా నిర్వహిస్తూ మే 15 నాటికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపు పై సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు నుండి మట్టి డంపింగ్ ప్రాంతాల వరకు వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు పరిస్థితులు తదితర అంశాలపై సాగునీటి పారుదల, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, కుడా అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడిక మట్టిని రెడ్డిపురం, పలివేల్పుల, మామునూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో డంపింగ్ చేయాలని సూచించారు. మట్టి తరలింపులో ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఇటుక బట్టీల యజమానుల నుండి మట్టి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని, గతంలో అనుసరించిన విధానానికి అనుగుణంగా అవసరమైన మట్టికి డీడీలు చెల్లించి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. భద్రకాళి చెరువు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెగ్యులేటరీ పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని, పూడిక మట్టి తరలింపు ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఎన్. రవి, వై.వి. గణేష్, హనుమకొండ ఆర్‌డిఓ రాథోడ్ రమేష్, సాగునీటి పారుదలసిఇ సుధీర్, ఎస్ఈ రాంప్రసాద్, ట్రాఫిక్ ఎసిపిసత్యనారాయణ, కుడాసిపిఒ అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న, సాగునీటి పారుదల శాఖ ఇఇ కిరణ్ కుమార్, డిఇఇ మధుసూదన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలును వేగవంతం చెయ్యాలి

బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో



ప్రజాపక్షం / నల్లబెల్లి:రాష్ట్ర ప్రభుత్వం మక్కల కోనుగోలు ప్రక్రియను వేగవం తం చేయ్యాలని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల బిఆర్ఎస్ఆధ్వర్యంలో నిరసన ,రాస్తారోకో నిర్వహించారు . గురువారం మండల కేంద్రంలోని కెనాల్ కాల్వ సమీపంలో మక్క రైతులకు అండగా బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించాగా ముఖ్య అథిలుగా మాజీ జడ్పి ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న ,మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి ,పిఎసిఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ హజరైనారు . రైతులు రాతిబంవళ్ళు మక్కల కోనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారని చెప్పారు . మక్కలు నిల్వ చేసేందుకు సరిపడా గోదాం లేక ,రవాణా సౌకర్యం లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు . ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రం అప్రమత్తమై మక్కల కోనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్ ,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్ ,నల్లబెల్లి ,శనిగరం ,కన్నారావుపేట సర్పంచులు నాగెల్లి జ్యోతి ప్రకాష్ , ఊట్కూరి అశోక్ ,పార్టీ నాయకులు మామిండ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
24-04-2026
www.prajapaksham.in

“నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముప్పై కోట్ల బడ్జెట్‌లో పది సినిమాల్ని నిర్మించనున్నారు. ఈ మేరకు టీఎఫ్డీఏ మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్ర-మానికి ముఖ్య అతిథి చదలవాడ శ్రీనివాసరావు హాజరయ్యారు.”

రీల్

# దర్శకుల సంఘం కోసం పది సినిమాల నిర్మాణం



నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముప్పై కోట్ల బడ్జెట్‌తో పది సినిమాలని నిర్మించనున్నారు. ఈ మేరకు టీఎఫ్డీఏ మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి చదలవాడ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్. ఆదిత్య, ట్రెజరర్ సాయి రాజేష్, వైస్ ప్రెసిడెంట్ సముద్ర, ప్రముఖ దర్శకులు నవీన్ మేడారం, అజయ్ కుమార్, ప్రసన్న కుమార్ తదితరలు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో.. వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ ‘మా కమిటీ కొత్తగా ఎన్నికైంది. మేం విద్య, వైద్యం, ఉపాధి అనే అంశాల మీదే ఫోకస్ పెట్టాం. చదలవాడ శ్రీనివాసరావు గారు ఉగాది నాడు ఓ గొప్ప ఆలోచనను మాతో పంచుకున్నారు. నిర్మాతలుంటేనే మా దర్శకులు మనుగడ కొనసాగించగలరు. టాలెంట్ ఉండి కూడా యూనియన్ మెంబర్ షిప్ కోసం కష్టపడాల్సి వస్తుంది. చదలవాడ శ్రీనివాసరావు బ్యానర్ మీద ముప్పై కోట్లతో పది సినిమాల్ని నిర్మిస్తున్నారు. మా అసోసియేషన్లోని మెంబర్లకు ఆయన గొప్ప అవకాశం ఇస్తున్నారు. దీని ద్వారా పది మంది దర్శకుల కంటే.. వంద, నూట యాభై మంది అసిస్టెంట్ దర్శకులకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. అయితే ఈ సినిమాల కోసం ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఆ కమిటీలో సీనియర్ దర్శకులు అజయ్ కుమార్, ప్రసన్న కుమార్ వంటి వారు కీలకంగా వ్యవహరిస్తారు. మా డైరెక్టర్ అసోసియేషన్‌లోని మెంబర్‌లు చెప్పిన కథలు, బౌండెడ్ స్క్రిప్టులను ఫిల్టర్ చేస్తున్నాం. ఈ మేరకు కమిటీ ఆల్రెడీ పని చేస్తోంది. ఒకరికి ఒక అవకాశం ఇవ్వడం అనేది మామూలు విషయం కాదు. కానీ చదలవాడ శ్రీనివాసరావు గారు ఒకేసారి ఎంతో మందికి అవకాశం ఇస్తున్నారు. ఆ సినిమాల్లో లాభాలు వస్తే.. యూనియన్కే ఇస్తాను అని ఆయన అన్నారు. ఇది మాకు అవకాశం కాదు.. వరం.. ఆయనకు శతసహస్ర కృతజ్ఞ తాభివందనాలు’ అని అన్నారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలా పబ్లిసిటీ చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. కానీ వీఎన్ ఆదిత్య మాత్రం నా చేతుల మీదుగానే ఈ ప్రకటన జరగాలని అన్నారు. దర్శకులు సాయి రాజేష్, అజయ్ కుమార్ , ప్రసన్న కుమార్ , సముద్ర, నవీన్ మేడారం పాల్గొన్నారు.



తమిళ నాడులో గురువారం అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్, టివికె అధినేత, హీరో విజయ్

# సినిమా చూసి ఇంటికెళ్ళాక కూడా నవ్వుకుంటాం

గాయపడ్డ సింహం
చిట్ చాట్ లో జెడీ చక్రవర్తి

తరుణ్ భాస్కర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి చేసిన సినిమా ‘గాయపడ్డ సింహం’. గాయపడ్డ సింహం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నటుడు జెడి చక్రవర్తి గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ధర్మా క్యారెక్టర్ గ్లింప్స్ రిలీజ్ అయినప్పుడు ఒక విషయం చెప్పాను, మళ్లీ అదే చెబుతున్నాను. కమల్ హాసన్ చేసిన క్యారెక్టర్లు ప్రపంచంలో ఎవ్వరూ చేయలేదు. అయితే ‘గాయపడ్డ సింహం’లో యాక్టర్‌గా కాదు, క్యారెక్టర్ పరంగా ఆయనకు రాని అదృష్టం నాకు వచ్చిందని భావిస్తున్నాను. అలాంటి ఒక డిఫరెంట్ క్యారెక్టర్ ఇందులో చేశాను. ఒకే క్యారెక్టర్ ఫస్ట్ హాఫ్‌లో ఒక షేడ్, సెకండ్ హాఫ్‌లో మరో షేడ్ ఉండటం మామూలే. కానీ ఫస్ట్ హాఫ్, సెకండ్ హాఫ్ రెండింటిలో ఒకే విధంగా కనిపిస్తూ, రెండు షేడ్స్ లో కనిపించడం నన్ను చాలా ఎక్సైట్ చేసింది. అది ఎలా అనేది మీరు సినిమా చూసి తెలుసుకోవాలి. అలా చేయడానికి నేను చాలా కష్టపడ్డాను అని చెప్పడం లేదు. కథలోనే ఆ బలం, మ్యాజిక్ కుదిరింది.నేను నా కెరీర్లో ఎప్పుడూ గబగబా సినిమాలు చేయలేదు. మొదటి నుంచి అలాగే చేస్తున్నాను. కథ నచ్చితేనే చేస్తాను.‘శివ’లో నా క్యారెక్టర్ నా పేరుగా మారిపోయింది. చక్రవర్తి అంటే గుర్తుపట్టరు, జేడీ చక్రవర్తి అంటే గుర్తుపడతారు. అలాగే భవాని, సత్య, భీకు మాత్రే, కల్లు మామ ఇలా చాలా పాత్రలు గుర్తుండిపోయాయి. కానీ కథ వర్కౌట్ కాకపోతే క్యారెక్టర్లు నిలవవు. ఒకవేళ నిలిచినా.. సినిమా ఆడదు. నా కెరీర్ లో ఫేవరెట్ క్యారెక్టర్ ‘వైఫ్ ఆఫ్ వి వరప్రసాద్’. ఆ పాత్ర వర్క్ అవుట్ అయ్యింది. కానీ సినిమా ఆడలేదు. ఇందులో తరుణ్ భాస్కర్ గాయపడ్డాడు, నేను గాయపడ్డాను, ఇంకో సింహం కూడా గాయపడింది. ఆ సింహం ఎవరో త్వరలో రివీల్ చేస్తాం. ఈ సినిమా చూసి ఇంటికి వెళ్లినాక కూడా సీన్స్ గుర్తుకొచ్చి నవ్వుకుంటాం. ఈ కథను చాలా కొత్తగా ప్రెజెంట్ చేశారు. ఇందులో ధర్మా క్యారెక్టర్, తరుణ్ భాస్కర్ చేసిన దరహాస్, ఇంకో పాత్ర ఇవన్నీ కలిసే విధానం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. కశ్యప్ కి షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్ లు చేసిన మంచి అనుభవం వుంది. తన స్టైల్ నాకు చాలా నచ్చింది. చాలా కాన్ఫిడెంట్గా ఉంటాడు. రియలిస్టిక్, హిలేరియస్ హ్యూమర్తో సినిమా తీశాడు.ఈ సినిమాలో నా పాత్ర పేరు ‘బ్రూటల్ ధర్మ’. కానీ నేను స్క్రీ చేసే పనులు ప్రేక్షకులకు నవ్వు తెప్పిస్తాయి.ఇది డైరెక్టర్స్ ఫిల్మ్ అన్నాను.



# కామెడీలో జెట్లీ కొత్త ఎక్స్‌పీరియెన్స్

కామెడియన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్య ఇప్పుడు హీరోగా దర్శకుడు రితేష్ రానాతో మళ్లీ జతకట్టి చేస్తున్న చిత్రం ‘జెట్లీ ’. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా మరోసారి డిఫరెంట్ ఎంటర్టైన్మెంట్‌ను తెరకెక్కిస్తున్నారు. క్లాప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. మే 1న సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో సత్య మాట్లాడుతూ రితేష్ కథ చెప్పగానే చాలా నచ్చింది. ఈ క్యారెక్టర్ చాలా నచ్చి సినిమా చేశాను. ఇందులో క్యారెక్టర్ హీరోలా కాకుండా కామెడీ స్పేస్ లోనే వుంటుంది. యాక్షన్ కామికల్ గానే వుంటుంది. ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్ తో జరిగే ఇంటరాక్షన్ చాలా ఆసక్తికరంగా వుంటుంది. ప్రతి సెగ్మెంట్ ని చాలా ఎంజాయ్ చేశాను. రితేష్ స్టయిల్ లో వర్క్ చేయడంతో ఇంట్రస్టింగ్‌గా వుంటుంది. ఈ సినిమాలో చిరంజీవి గారి రిఫరెన్స్‌లు వుంటాయి. మే1న అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ రితేష్ రానా మాట్లాడుతూ ఇది యాక్టర్ ని బట్టి డిజైన్ అయ్యే స్టోరీ. సత్య అనుకున్నప్పుడు తన స్టయిల్ క్యారెక్టరైజేషన్ బట్టి స్క్రిప్ట్‌ని డిజైన్ చేశాం. మిషన్ ఇంపాజిబుల్ సినిమా సత్యతో తీస్తే ఎలా వుంటుందో ‘జెట్లీ’ అలా వుంటుంది. వెన్నెల కిషోర్ మాట్లాడుతూ ఇందులో నా పేరు మీరు నేరుగా థియేటర్లో తెలుసుకోవాలి. కథ చెప్పగానే క్లూస్ పట్టేస్తుంటాను. టైమ్ పాస్ కోసం ఒక సినిమా సుడోకు గేమ్ ఆడుతుంటాను.



# నేను నా పల్లెటూరు పాట ఆవిష్కరణ

హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా ’గోదారి గట్టు పైన’ తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ‘గోదారి గట్టుపైన’ లోని ‘నేను నా పల్లెటూరు’ పాటను విడుదల చేశారు. పాట వినగానే అందమైన పల్లె జ్ఞాపకాల్లోకి తీసుకెళ్తుంది. నాగ వంశీ కృష్ణ స్వరపరిచిన ఈ మెలోడీ పల్లెటూరి మట్టి వాసన, గోదావరి తీరాల అందాలను అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన పదాలు పల్లెటూరి ఆత్మని హత్తుకునేలా చూపిస్తున్నాయి. ఎంఎల్ఆర్ కార్తికేయ వోకల్స్ ఈ పాటకు మరింత ప్రాణం పోసింది.ఈ సాంగ్‌లో సుమంత్ ప్రభాస్ తన ఫ్రెండ్స్‌తో గడిపే సరదా క్షణాలని, పల్లెటూరి లైఫ్‌ను ఎంతో సహజంగా చూపించారు. ఆ సన్నివేశాలు అందరికీ కనెక్ట్ అవుతున్నాయి. ఈ చిత్రాని సినిమాటోగ్రఫీని సాయి సంతోష్, ప్రొడక్షన్ డిజైన్‌ను ప్రవాల్య, ఎడిటింగ్‌ను అనిల్ కుమా ర్ పి, సౌండ్ డిజైన్‌ను నాగార్జున తల్లపల్లి నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం మే 8న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ నటిస్తున్నారు.



# ‘ఎవరే’ పాట రిలీజ్

అనిశ్రీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద వెంకట కళ్యాణ్ మండవిల్లి సమర్పణలో శిరీష మండవిల్లి నిర్మాణంలో ‘ఎవరే’ ప్రైవేట్ ఆల్బమ్‌ను ఆనంద్ తెరకెక్కించారు. ఈ ఆల్బమ్‌కు స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ బాధ్యతల్ని ఆనంద్ నిర్వర్తించారు. ఎస్ ఎస్ వర్దన్ మ్యూజిక్ అందించిన ఈ ఆల్బమ్‌లో వెచలపు కృష్ణ, రిద్ధి అనామిక చరణ్ నటించారు. ఈ క్రమంలో ఈ పాటకు సంబంధించిన రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్జున్ అంబటి, సింగర్ సాకేత్, రాంబాబు గోసాల ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హీరో అర్జున్ అంబటి మాట్లాడుతూ ‘‘ఎవరే’ టీంకు ఆల్ ది బెస్ట్. నిర్మాత బాగుంటేనే మళ్లీ ఇంకో పాటను గానీ, సినిమాను గానీ తీస్తారు. పవన్ కళ్యాణ్ పాట పాడుతూ ఉంటే నేను పర్ఫామ్ చేశాను. పవన్ కళ్యాణ్ సింగర్‌గా ఇంకా మంచి స్టేజ్‌కి వెళ్లాలని కోరుకుంటున్నాను. వర్దన్ మ్యూజిక్ బాగుంది. కృష్ణ, రిద్ధి జంట బాగుంది. పక్కింటి అబ్బాయిలా కృష్ణ కనిపిస్తున్నారు. ‘ఎవరే’ పాట మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు. సింగర్ సాకేత్ మాట్లాడుతూ ‘‘ఎవరే’ టీంకు ఆల్ ది బెస్ట్. ఎస్ ఎస్ వర్దన్ పేరు బాగుంది. తమన్ అన్న రేంజ్లో ఎదగాలని కోరుకుంటున్నాను. పవన్ కళ్యాణ్, అనన్య చక్కగా పాడారు. పాటలో ఎనర్జీ, మెలోడీ రెండూ చక్కగా కుదిరాయి అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ ఎస్ వర్ధన్ మాట్లాడుతూ ‘‘ఎవరే’ పాట కోసం మేం ఏడాది నుంచి వర్క్ చేస్తున్నాం. నా విజన్‌కి సపోర్ట్ చేసిన ఆనంద్, కృష్ణకి థాంక్స్. ఏడాది పాటుగా మేం శ్రమించి ఈ పాటను తెరకెక్కించాం. ఈ కార్యక్రమంలో రాంబాబు గోసాల, డైరెక్టర్ ఆనంద్ , హీరో వేచలపు కృష్ణ , హీరోయిన్ రిద్ధి అనామిక చరణ్, సింగర్ పవన్ కళ్యాణ్ , సింగర్ అనన్య భాస్కర్ పాల్గొన్నారు.



## రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

భూపాలపల్లి, ములుగు, భద్రాది కొత్తగూడెం,మహబుబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, గ ద్వాల్, వనపర్తి జిల్లాలో 43 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. అదేవిధంగా మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్, యాద్రాది భువనగిరి, జనగామ, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలో 42 నుంచి 44 డిగ్రీలు, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలో 41 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తీవ్ర ఎండలకు తోడు వడగాలులు విచే అవకాశం ఉం డడంతో ఈ 6 రోజుల పాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటికి రావద్దని అధికారులు సూచించారు.

## మోదీ సంఘీభావమా?

(మొదటి పేజీ తరువాయి)

వైఖరులతో పాటు అన్ని మానవ విలువలకు కూడా ద్రోహం చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ కూడా ఆరోపించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో లక్షలాది మంది పాలస్తీనియన్లు తమ ఆస్తులను కోల్పోయి నిరాశ్రయులవుతున్న విషయంలోనూ మోదీ పూర్తిగా మౌనం వహించారని రమేష్ ఎక్స్ చానెల్‌లో పేర్కొన్నారు. గత నెలలో, పశ్చిమ ఆసియా యుద్ధం ముసుగులో ఇజ్రాయెల్ తన ‘గ్రేటర్ ఇజ్రాయెల్’ విజన్‌తో ముందుకు సాగుతూ, పాలస్తీనా దేశం ఏర్పాటుపై ఉన్న ఆశలను పూర్తిగా తుంచివేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ గళం విప్పకపోవడాన్ని కూడా తీవ్రంగా విమర్శించింది. గాజాలో పౌరులపై ఆ దేశం నిర్దాక్షిణ్యంగా దాడులు కొనసాగిస్తున్నప్పటికీ, ఫిబ్రవరిలో ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడాన్ని కూడా కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. పాలస్తీనీయుల సమస్య పట్ల తమ నిబద్ధతపై మోదీ ప్రభుత్వం నీచమైన, కపటమైన ప్రకటనలు చేసిందని, కానీ వాస్తవానికి వారిని వదిలేసిందని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది.

## సుంకాల వసూళ్ళు

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న ప్రచారాన్ని ఖండించింది. మరోవైపు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఒక ప్రకటన చేస్తూ, కాల్పుల విరమణ ఉల్లంఘన కొనసాగినంతకాలం చర్చలకు అవకాశం లేదని ప్రకటించారు. తమ షరతులు అంగీకరించాలని, చర్చలకు ఇంకా తమ తలుపులు తెరచే ఉన్నాయని చెప్పారు. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబాఫ్ కూడా ఒక ప్రకటన చేస్తూ, కాల్పుల ఉల్లంఘన కొనసాగినంతకాలం హోర్ముజ్ జలసంధిని తెరచే అవకాశం లేదని పేర్కొన్నారు.పదే పదే అబద్ధాలు ప్రచారం చేయడం ద్వారా అమెరికా తన లక్ష్యాలు చేరుకోలేదని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తలవల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాపై ఆందోళన నెలకుంది. చమురు ధర బ్యారెల్‌కు 100 దాటి పోయింది.ఇదిలాఉండగా, హోర్ముజ్ జలసంధిలో ఒక చమురు రవాణా నౌక నుండి మొదటిసారి సుంకం వసూలు చేశామని ఇరాన్ పార్లమెంటు డిప్యూటీ స్పీకర్ హమీద్ రెజా సోషల్ మీడియా ద్వారా చెప్పారు. ఐతే ఏ దేశానికి చెందిన నౌక ఈ సుంకం చెల్లించిందనే విషయాన్ని ఆయన రహస్యంగా ఉంచారు. ఒక బ్యారెల్ చమురుకు ఒక డాలరు వంతున సదరు పైన పేర్కొన్న నౌక నుండి రెండు మిలియన్ డాలర్లు బ్యాంక్ అకౌంటు ద్వారా జమ చేయించినట్లు హమీద్ రెజా చెప్పారు. తమ అనుమతి లేకుండా ఏ ఒక్క నౌకా జలసంధి దాటి వెళ్ళలేదని ప్రకటించిన ఇరాన్ ఇప్పటికే రెండు నౌకలను తన అధీనంలోకి తెచ్చుకుంది. బుధవారంనాడు జలసంధి దాటేందుకు యత్నించిన మూడు నౌకలపా కాల్పులు జరిపింది. బుధవారం ఇరాన్ కాల్పులు జరిపిన రెండు నౌకల్లో 22 మంది భారతీయులు ఉన్నారు. ఐతే వారు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయట పడినట్లు భారత్‌కు చెందిన నౌకామంత్రిత్వశాఖ సీనియర్ అధికారి గురువారం చెప్పారు. అంతకుముందు అనుమతి పొందిన ఒక భారత్ నౌకను కూడా జలసంధి దాటకుండా వెనక్కు తరిమికొట్టింది. హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ అధీనంలోనే ఉండాలని చర్చల్లో అమెరికాకు ఇరాన్ ఒక షరతుగా పెట్టింది. హోర్ముజ్ జలసంధి ఎప్పటికీ తిరిగి అమెరికాకు దక్కదని స్పష్టం చేసింది. హోర్ముజ్‌లో సుంకాలు వసూలు చేసేందుకు వీలుగా ఇరాన్ పార్లమెంటులో కూడా ప్రభుత్వం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇది ఆమోదం పొందకుండా అపరిష్కృతంగా ఉంది. ఈ తీర్మానం ఆమోదం పొందితే పూర్తిస్థాయిలో సుంకాలను ఇరాన్ వసూలు చేయడం ప్రారంభిస్తుంది. గడచిన శనివారం ఏప్రిల్ 18 నుండి హోర్ముజ్ జలసంధిలో నౌకల కార్యకలాపాలను ఇరాన్ తిరిగి నిషేధించింది. కాగా హిందూమహాసముద్రంలో శ్రీలంక–ఇండోనేసియా మధ్య అంతర్జాతీయ జలాలలో ఇరాన్ చమురుతో వెళుతున్న ఒక నౌకను స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా దళాలు ఈ నౌకలోకి ప్రవేశించాయి. అంతకుముందు హోర్ముజ్‌లో తౌస్కా నౌకను కూడా అమెరికా దళాలు ఇదేవిధంగా హెలికాప్టర్ ద్వారా వె ళ్ళి తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఇరాన్ చమురు ఎగుమతి ఆదాయాన్ని అడ్డుకుని ఆర్థికంగా దెబ్బతీయడం ద్వారా ఆ దేశంపై ఒత్తిడి పెంచడమే తమ ప్రధాన లక్ష్యమని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బె స్సెంట్ రెండు రోజుల క్రితమే ప్రకటించారు. ఇప్పటికే ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కునారిల్లిపోయిందని, ప్రపంచంలో ఏ జలాల్లో ఉన్నాగానీ ఇరాన్ చమురును తరలించే నౌకలను, ఇరాన్‌కు సహాయం చేసే నౌకలను వెంటాడి పట్టుకుంటామని అమెరికా ప్రకటించింది.

# రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ద్రోణి, క్యూములో నింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, సిద్దిపేట, జగిత్యాల, జనగాం, రాజన్న సిరిసిల్ల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శుక్రవారం నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల, జనగాం, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈనెల 25 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందన్నారు.

**పెరగనున్న ఉష్ణోగ్రతలు..**

వర్షాలు కురుస్తున్నప్పటికీ, రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల: 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**హైదరాబాద్‌లో వర్షం..**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గురువారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపగా, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. కాప్రా, ఏఎస్ రావు నగర్, ఈసిఐఎల్, కూకట్‌పల్లి, హైదర్ నగర్, జెఎన్‌టియు, మూసాపేట్, కెపిహెచ్‌బి, ఆల్విన్ కాలనీ, జీడిమెట్ల, సుచిత్ర, కొంపల్లి, బహదూర్ పల్లి, గండి మైసమ్మ ప్రాంతాల్లో వర్షం కురవడంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

# వైద్యానికి ఆధార్ తప్పనిసరి : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ :ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించడానికి ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలా, సహాయకుడు లేకపోతే చికిత్స ఇవ్వాలా అనే అంశాలపై పూర్తి వివరాలు సమర్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేవలం ఆధార్ అంశం పైనే కౌంటర్ దాఖలు చేయడాన్ని తప్పు పట్టిన కోర్టు, సమగ్ర విధివిధానాలతో నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసు మహబూబాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తికి ఆసుపత్రిలో వైద్యం నిరాకరణ ఆరోపణల నేపథ్యంలో సుమోటో పిటిషన్‌గా తీసుకుని విచారణ ప్రారంభించింది.మరో కేసులో, ఆధార్ లేకపోయినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. వికారాబాద్ జిల్లాలో పాము కాటుకు గురైన బాలికకు అంబులెన్స్ సేవలు అందించినట్లు వెల్లడించింది. ఈ అంశంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించిన కోర్టు, వైద్యం నిరాకరణ జరగలేదని గుర్తించి పిటిషన్‌ను కొట్టివేసింది.ఇక మెదక్ పట్టణంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై దాఖలైన పిటిషన్‌లో, ఆక్రమణల తొలగింపుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ అధికారులను హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# అక్రమ నిర్మాణాలపై జిహెచ్‌ఎంసి చర్యలు నామమాత్రం

ప్రజాపక్షం/హైదరాబాద్ :నగరంలో అక్రమ నిర్మాణాల నియంత్రణలో జిహెచ్‌ఎంసి చర్యలు సరిపోవడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదులు అధికంగా వచ్చినప్పటికీ, కేవలం షోకాజ్ నోటీసులతో పరిమితమవుతోందని పేర్కొంది.అక్రమ నిర్మాణాల ఫిర్యాదులను వెబ్‌సైట్‌లో అందుబాటు లో ఉంచాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించింది. కోఠి ప్రాంతంలో జ్ఞానశేఖర్ నిర్మాణాలపై చర్యలు తీసుకోలేదని ముకుందాస్ సోని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో, స్థలాన్ని సీలు వేశామని చెప్పినా తదుపరి చర్యలు లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది.

## దర్యాప్తు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక కారణాలను హైకోర్టు తప్పుబట్టింది. ఈ నివేదికలో వారిపై ప్రస్తావించిన అంశాలు అమల్లో ఉండవని, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే తీర్పునిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సిబిఐ దర్యాప్తునకు ప్రభుత్వం జీఓ జారీ చేసింది. తొమ్మిది నెలలైనా సిబిఐ దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదు. హైకోర్టు తీర్పు సిబిఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకిగా లేదని న్యాయ నిపుణులు తెలియజేశారు’’ అని మంత్రివర్గం అభిప్రాయం వ్యక్తం చేసింది. గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని, తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదని, రిటైర్మెంట్ వయస్సు పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని మంత్రులందరూ ఉదారంగా ముందుకువచ్చారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం తీర్మానించింది. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు (పిఎసిఎస్) నామినేటెడ్ పద్ధతిన పాలకవర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 76 ఎకరాల్లో 64 ఎకరాల్లో 21 రకాల స్పోర్ట్స్‌కు సంబంధించిన సౌకర్యాలు కల్పించడంతో పాటు అవుట్ డోర్ స్టేడియం సామర్థ్యం 20 వేల నుంచి 50 వేలకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. స్విమ్మింగ్ పూల్ సామర్థ్యం పెంపుతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాకారులకు వసతి, శిక్షణ సౌకర్యాలు కల్పించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మిగిలిన 12 ఎకరాలను డెవలపర్స్‌కు ఇచ్చి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతి, తద్వారా వచ్చే ఆదాయాన్ని స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ, క్రీడాకారుల వసతి, శిక్షణ ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.మంథని నియోజకవర్గ ప్రాంత ప్రజల చిరకాల కోరిక చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ‘‘మహాదేవ్‌పూర్, కాటారం, మల్హర్‌రావు, మహాముత్తారం మండలాల్లో దాదాపు 45 వేల ఎకరాలకు, 63 గ్రామాల ప్రజలకు ఈ ప్రాజెక్టుతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్టుకు దాదాపు 2427 ఎకరాల భూమి అవసరం. ఇప్పటివరకు 1020 ఎకరాలు సేకరించారు. మిగిలిన భూసేకరణకు అవసరమయ్యే రూ.166.67 కోట్ల ప్రతిపాదనలకు కేబినేట్ ఆమోదం తెలిపింది’’ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇరిగేషన్ డిపార్ట్ మెంట్‌కు చెందిన 85.10 ఎకరాలను మత్స్య శాఖకు కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

# బండి సంజయ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

మంత్రి ఉత్తంకుమార్

డ్యామ్‌ల నిర్మాణ రంగంలో ఎన్ఎస్‌డిఏ చైర్మన్ అనిల్ జైన్ ఎంతో గౌరవపదమైన వ్యక్తి అని అలాంటి వ్యక్తి పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇష్టానుసారంగా మాట్లాడడం సరైందికాదని రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటికైనా కేంద్ర మంత్రి చిల్లర రాజకీయాలు మానుకుని వాస్తవాలను గ్రహించాలని సూచించారు. ఎన్‌డిఎస్ఎ కేంద్ర ప్రభుత్వంలో భాగమని, బిజెపి జేబు సంస్థ కాదని గుర్తుంచుకోవాలని ఆయన హితువు పలికారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు ఎన్‌డిఎస్ఎ చైర్మన్ హోదాలో అనిల్ జైన్ మేడిగడ్డబ్యారేజ్‌ను అధికారికంగా సందర్శించి పలు సూచనలు చేశారన్నారు. చైర్మన్ అధికారులతో జరిగిన సమీక్ష కార్యక్రమంలో మాత్రమే పాల్గొన్నారు. తప్ప ఎక్కడా రాజకీయపరమైన కార్యక్రమంలో పాల్గొనలేదని ఆయన స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తాను మాత్రమే పాల్గొన్నామని తెలిపారు. అసలు కేంద్రమంత్రి బండి సంజయ్ ముందు ఎన్‌డిఎస్ఎ రిపోర్ట్ చదువుకోవాలని సూచించారు. 1000 బోర్లు, ఉండాలా 100 బోర్లు ఉండాలా, అసలు ఎన్ని బోర్లు ఉండాలో కేంద్ర మంత్రికి తెలుసా అని మంత్రి ప్రశ్నించారు. రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన సంస్థ చైర్మన్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com